ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 06.07.2025 | సంపుటి :11 సంచిక : 348 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ప్రజాపోరాటాలతోనే కాలుష్య పరిశ్రమలను
# తరిమికొట్టాలి

### పొల్యూషన్‌కంట్రోల్ బోర్డులో నిపుణులు లేరు



- పర్యవేక్షణ, పరిశోధనలు కరువై పరిశ్రమలకు అనుమతులిస్తున్నరు
- ఇథనాల్‌కంపెనీలను ప్రోత్సహించడమంటేనే అది అశాస్త్రీయం

**శాస్త్రవేత్త, డాక్టర్ బాబురావు కీలక వ్యాఖ్యలు**

- రెండు జీవనదులున్నా పాలమూరు రైతులు అల్లాడుతున్నారు : హరగోపాల్
- దశాబ్దాలుగా జిల్లాపై కొనసాగుతున్న వివక్షపై రాష్ట్రస్థాయి సదస్సు






> లాభదాయకమైన పరిశ్రమలే అయితే ఇథనాల్ కంపెనీలకు అనుమతులిచ్చినా ఎందుకు ఏండ్ల తరబడి వాటిని ప్రారంభించడం లేదని, బడాబడా పెట్టుబడిదారులు పర్మిషన్లు తీసుకున్నప్ప టికీ వాటిని వెంటనే ఎందుకు పెట్టడం లేదని శాస్త్రవేత్త, డాక్టర్ బాబురావు ప్రశ్నించారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమల గురించి ప్రమోషన్లు చేస్తున్నారు తప్పితే ప్రశ్నించేవారు కరువయ్యారని చెప్పారు. ఇథనాల్ ఫ్యాక్టరీల పద్ధతులు అశాస్త్రీయంగా ఉన్నాయని చెబితే ఎవరూ వినేప రిస్థితుల్లో లేరని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోనూ సైంటిస్టులు, నిపుణులు సరైనవారు లేరని వివరించారు. ఆ బోర్డు దాని పనిని అది సరిగ్గా చేయకపోవడం వల్ల ప్రజలు దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా పోరాటాల ద్వారానే కాలుష్య పరిశ్రమలను తరమికొట్టాలని పిలుపునిచ్చారు.

> ప్రతిపక్షాలు పాలమూరు జిల్లాకు అనేక హామీలు గుప్పించి, అధికా రంలోకి రాగానే అన్నీ మరిచిపోతున్నాయి. పైగా వారే అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నారు. రెండు జీవనదులున్న ప్పటికీ పాలమూరు ప్రజలు అల్లాడుతు న్నారు. పాలకులు మొత్తం విద్రోహ పనులే చేస్తున్నారు. ప్రజలను నమ్మిస్తూ ఇథనాల్ ఫ్యాక్టరీలను తేవాలని చూస్తున్నారు. రైతులను కూడా అరెస్టు చేసి వేధింపులకు గురిచేస్తున్న పాలకులు ప్రజలవై పు నిలుస్తున్నారో లేదో మననం చేసుకోవాలి
>
> \- ప్రొఫెసర్ హరగోపాల్
> పాలమూరు అధ్యయన వేదిక గౌరవ అధ్యక్షులు



**హైదరాబాద్(జనంసాక్షి):** 'సాగునీటి లేమి కరువు కాటకాలు వలసలు విస్థాపన ఎంతకాలం? మహబూబ్‌నగర్ ప్రజలకు జననమే కానీ గౌరవ జీవనం అవసరం లేదా?' అనే అంశంపై పాలమూరు అధ్యయన వేదిక (పీఏవీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో పలువురు ప్రజాస్వా మికవా దులు, మేధావులు, పౌర హక్కుల సంఘాల నేతలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పాలమూరు జిల్లాకు జరుగుతున్న అన్యాయాలూ, వివక్షా రూపాలను వక్తలు విపులంగా వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త బాబురావు మాట్లాడుతూ.. భారతదేశానికి పెట్రోల్ వనరులే లేవని, ఇప్పటికే 86శాతంతో దిగుమతి చేసుకుంటున్నట్టు తెలిపారు. అందులో 20శాతం మాత్రమే వినియోగిస్తూ దేశానికి చాలా ఆదాయం కల్పిస్తున్నామని ప్రకటించుకోవడంలో అర్థం లేదన్నారు. ఇథనాల్ పరిశ్రమల విషయంలో అశాస్త్రీయ విధానాలే కొనసాగుతున్నాయని, కేవలం వెనుక బాటుతనం ఉన్న నారాయణపేట, గద్వాల జిల్లా లో ఎందుకు పరిశ్రమలు వస్తున్నాయని ప్రశ్నిం చారు. నీటి వనరులు ఉన్నచోట ఇథనాల్ కంపె నీలు పుడుతున్నాయని, ఉన్న నీరే తక్కువగా ఉన్నప్పుడు ఫ్యాక్టరీలకు ఎలా వినియోగిస్తారని అన్నారు. ఉద్యమాలకు ప్రధాన కారణం కూడా నీరు లేనప్పుడు ఫ్యాక్టరీలకు మిగతా 2లో..

# చర్చకు సిద్ధం



### వ్యవసాయంపై ఈ నెల 8న భేటికి సీఎం రేవంత్ హాజరుకావాలి : కేటీఆర్

- దేశంలో వ్యవసాయ అభివృద్ధికి మళ్లీ కేసీఆర్ మోడల్ అవసరం
- భాజపా పాలిత మహారాష్ట్రలో 3 నెలల్లో 767 మంది రైతులు చనిపోయారు
- వ్యవసాయ విధానాన్ని అర్థం చేసుకునే మెరుగైన వ్యవస్థ మనకు కావాలి
- తెలంగాణ భవన్ మీడియా సమావేశంలో భారాస నేత

**హైదరాబాద్(జనంసాక్షి):** వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి సిద్ధమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతుల బాగుపై కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎరువులు, విత్తనాల కోసం రైతులు క్యూలైన్లలో చెప్పులు పెట్టడమేనా? అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని కేంద్రం ఇబ్బందులు పెట్టినా కేసీఆర్ నిలబడ్డారని గుర్తుచేశారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. మహారాష్ట్రలో రైతుల మరణాలపై భారత రాష్ట్ర సమితి మిగతా 2లో..

## చిన్నారులు, మహిళల భద్రతకు
# అధిక ప్రాధాన్యం




### భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండ

- సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత వ్యవహరించాలి
- చిన్నారులపై లైంగిక హింస కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తాం
- సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్(జనంసాక్షి):** చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండగా ఉంటున్నట్లు చెప్పారు. 'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత' అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ ఖండించాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సీతక్కకు వచ్చిన లేఖ నకిలీది..

2లో

### ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
మావోయిస్టు మృతి.. కొనసాగుతున్న కాల్పులు

# వీఆర్‌వో, వీఆర్‌ఏలకు జీపీవోలుగా అవకాశం

- అందుకోసం వారికి త్వరలోనే మరోసారి అర్హత పరీక్ష
- ప్రతి రెవెన్యూ గ్రామానికి గ్రామ పరిపాలనా అధికారి
- రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రతి రెవెన్యూ గ్రామానికి గ్రామ పరిపాలనా అధికారి ఉంటారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమావేశమయ్యారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ పరిపాలనా అధికారుల నియామకాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. వీఆర్‌వో, వీఆర్‌ఏలుగా పని చేసినవారికి జీపీవోలుగా అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక పరీక్ష ద్వారా 3,454 మంది అర్హత సాధించారని వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు వీఆర్‌వో, వీఆర్‌ఏలకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అర్హత పరీక్ష త్వరలోనే నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు.

### స్టాంప్ సవరణ చట్టం కోసం
# కసరత్తు

- అసెంబ్లీలో సవరణకు నిర్ణయం
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

వార్త 3లో



### 600 రోజులైనా ఇచ్చిన హామీల అమలేది?

**బీజేపీ విధానాలు నచ్చని వారు పార్టీని వీడినా నష్టం లేదు**

**అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావు**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని భాజపా మిగతా 2లో..

# కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు
- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భట్టి



**హైదరాబాద్(జనంసాక్షి):** అవకాశం ఉన్న ప్రతిచోట మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీకి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. తొలి నెల అద్దె కింద రూ.1.49 కోట్లు- ఆయా సంఘాలకు.. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క అందించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వారికి రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. ఈ నెల 8న అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించాలి. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి గురించి చర్చించాలి. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు- చేయాలి. ఈనెల 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయి. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలని భట్టి విక్రమార్క తెలిపారు.

### ట్రంప్ ఒత్తిడికి మోదీ
# తలొగ్గుతారు

**ఇది నిజం...రాసి పెట్టుకోండి :రాహుల్**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** మూడు నెలల క్రితం భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని రాహు ల్ పేర్కొన్నారు. ట్రంప్ సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని.. తన మాటలు నమ్మక పోతే రాసిపెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. అమెరికా పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠ విధానాలను కలిగిఉందని స్పష్టం చేశారు. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు దేశం ఎప్పుడూ తొందరపడదని అన్నారు. రెండు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే అంగీకరిస్తుందన్నారు. నవ భారత్‌కు ఆకాశమూ హద్దు కాదు అమెరికాతో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి అగ్రరాజ్యాన్ని సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్‌టైల్స్, రత్నాలు, మిగతా 9లో..

# ఇకపై రోజుకు 10 గంటలే పని..

### పనివేళలను సవరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):** వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పని వేళల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం సవరించింది. రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో పని వేళలు 48 గంటలు మించరాదని స్పష్టం చేసింది. పరిమితి దాటితే ఓటీ వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రోజులో 6 గంటల్లో కనీసం అరగంట విశ్రాంతి ఇవ్వాలని, విశ్రాంతితో కలిపి 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలు సవరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# చర్చకు సిద్ధం

కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. భాజపా పాలిత మహారాష్ట్రలో 3 నెలల్లో 767 మంది రైతులు చనిపోయారని తెలిపారు.మహారాష్ట్రలో సగటున ప్రతి 3గంటలకు ఒకరైతు ఆత్మహత్య చేసుకోవడం కలచివేస్తోందన్నారు. వ్యవసాయ విధానాన్ని అర్థం చేసుకునే మెరుగైన వ్యవస్థ మనకు కావాలన్నారు. ప్రస్తుతం దేశానికి రైతు బంధు, పంటల బీమా, రైతు బీమా అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు, పంటకు గిట్టుబాటు ధర ఇచ్చే వ్యవస్థ కావాలని చెప్పారు. దేశంలో వ్యవసాయ అభివృద్ధికి కేసీఆర్ మోడల్ అవసరమని కేటీఆర్ అన్నారు.

# భారీ వర్షాలు వరదలతో హిమాచల్ అతలాకుతలం

**వరదలతో కొట్టుకుపోయిన రోడ్లు, భవనాలు, వంతెనలు**
**ఇప్పటికే 72 మంది మృతి చెందారని వెల్లడి**
**700 కోట్లకు పైగానష్టం వాటిల్లిందన్న సిఎం సుఖ్వీందర్**

**సిమ్లా(జనంసాక్షి):**హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వీటి ప్రభావంతో కురుస్తున్న కుండపోత వర్షాలతో హిమాచల్ ప్రాంతంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొండచరియలు విరిగి పడుతున్నారు. ఇప్పటివరకూ 72 మంది మృతి చెందారు. 40 మంది గల్లంతయ్యారు. ఎడతెరిపి లేకుండా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా 500కి పైగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో వరద సహాయక చర్యలు ముమ్మరం కొనసాగుతున్నాయి. 7 వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని అంచనా నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఈ ఏడాది భారీ వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ అతలాకుతల మవుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక వరదలు, భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుండి కనీసం 72 మంది ప్రాణాలు కోల్పోయారని, 40 మంది గల్లంతయ్యారని, 100 మందికి పైగా గాయపడ్డారని ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు నివేదించారు. రాష్ట్రంలో 14 ప్రాంతాల్లో భారీ వర్షాలు సంభవించాయని, మౌలిక సదుపాయాలను తీవ్రంగా దెబ్బతీశాయని ముఖ్యమంత్రి సుఖు చెప్పారు. రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ ప్రాథమిక అంచనాల ప్రకారం, భారీ వర్షాల వల్ల కలిగిన నష్టం రూ.541 కోట్లుగా అంచనా వేయగా, వాస్తవ నష్టాలు రూ.700 కోట్లకు దగ్గరగా ఉండవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నష్టానికి సంబంధించి ఇంకా నివేదికలు వస్తున్నాయి. అనేక భవనాలు, రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. కాంగ్రా, సిర్మౌర్, మండి జిల్లాల్లో ఆదివారం అతి భారీ నుండి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్థానిక వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక ఇవాళ, సోమ, మంగళవారాల్లో ఉనా, బిలాస్‌పూర్, హమీర్‌పూర్, చంబా, సోలన్, సిమ్లా, కులు జిల్లాలకు కూడా ఆరంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆరంజ్ అలర్ట్ తీవ్రమైన వాతావరణ ముప్పును సూచిస్తుంది.

# పుతిన్ మారణహోమం సృష్టిస్తున్నారు

**ఆయన ప్రజలను చంపుతూనే ఉంటారు**
**పుతిన్ తీరుపై ట్రంప్ అసహనం**



**వాషింగ్టన్(జనంసాక్షి):**ఉక్రెయిన్‌పై రష్యాతో యుద్ధ విరమణ చేయించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నానాతంటాలు పడుతున్నారు.ఆ దిశగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో అసహనం వ్యక్తంచేస్తోన్న ఆయన.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై పరుష వ్యాఖ్యలు చేశారు అలాగే మాస్కోపై మరిన్ని ఆంక్షలు ఉండొచ్చని బెదిరింపులకు పాల్పడ్డారు. "ఆయన (పుతిన్) అంతే. మనుషులను చంపుతూనే ఉండాలని కోరుకుంటున్నారు. అది ఏమాత్రం మంచిదికాదు" అని మీడియా ఎదుట ఆగ్రహం వ్యక్తంచేశారు అమెరికా కాలమానం ప్రకారం గురువారం ఉదయం 10 గంటలకు ఉక్రెయిన్ యుద్ధం తదితర అశాలపై పుతిన్-ట్రంప్ సుమారు గంటసేపు చర్చలు జరిపారు. ఇంత చేసినా వారు ఏ నిర్ణయానికి రాలేదు. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ ఆ తర్వాత అంగీకరించారు. ఈ విషయంపై జర్నలిస్టులతో ఆయన చెబుతూనే.. "మేము ఈ రోజు ఎటువంటి పురోగతి సాధించలేదు. ఫోన్‌కాల్‌లో సుదీర్ఘంగా మాట్లాడుకొన్నాం. ఇరాన్ విషయం సహా పలు అంశాలపై మాట్లాడుకొన్నాం. మీకు తెలుసు కదా ఉక్రెయిన్ అంశం చర్చకు వచ్చింది. ఆ విషయంలో నేను ఏమాత్రం సంతృప్తిగా లేను. ఏమాత్రం పురోగతి సాధించలేదు" అని ట్రంప్ నిరాశ వ్యక్తంచేశారు. యుద్ధంలో రష్యా ఓడితే అమెరికా మాపై దృష్టి పెడుతుంది: చైనా భయాన్ని నిక్కచ్చిగా చెప్పేసిన విదేశాంగ మంత్రి ఆ అంశంపై పుతిన్ సహాయకుడు యూరీ ఉషోకోవ్ మాట్లాడుతూ ఇరువురు నాయకులు సూటిగా చర్చించుకొన్నారు. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని ట్రంప్ సూచించినా.. పుతిన్ మాత్రం తిరస్కరించారు. ఈ యుద్ధానికి కారణమైన అంశాల్లో రష్యా లక్ష్యాలను సాధించడానికి కట్టుబడి ఉన్నట్లు తేల్చిచెప్పారు. అదే సమయంలో దౌత్య మార్గంలో అంతిమంగా పరిష్కరించుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. యుద్ధ విరమణ కోసం ట్రంప్-పుతిన్ చర్చించుకోవడం ఇది ఆరోసారి. ఉక్రెయిన్‌పై కఠిన వైఖరితో వ్యవహరిస్తోన్న రష్యా.. అమెరికా అధ్యక్షుడితో సమావేశం ముగిసిన కొద్దిసేపటికే ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా 13 ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని భారీ దాడులు జరిపిన సంగతి తెలిసిందే.



**ప్రజాపోరాటాలతోనే కాలుష్య పరిశ్రమలను**

# తరిమికొట్టాలి

ఎలా తరలిస్తారని రైతాంగం ఆందోళనకు దిగుతోందన్నారు. ప్రభుత్వ వ్యవస్థల్లోనూ నిపుణుల కమిటీలకు సైన్సు తెలియకపోవడం లేదా దాచిపెట్టడం వల్ల ప్రజానీకానికి నష్టం వాటిల్లుతోందన్నారు.

– పాలమూరు అధ్యయన వేదిక గౌరవ అధ్యక్షులు ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు పాలమూరు జిల్లాకు అనేక హామీలు గుప్పించి, అధికారంలోకి రాగానే అన్నీ మరిచిపోతున్నాయని, పైగా వారే అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నారని చెప్పారు. వెనుకబడిన ఉమ్మడి జిల్లాను ముక్కలు చెక్కలుగా చేసి మరింత సంక్షోభంలోకి నెట్టారన్నారు. రెండు జీవనదులున్న ప్పటికీ ప్రజలు అల్లాడుతున్నారని, ఆర్డీఎస్‌ను ఆధునీకరించాలంటే మీనమేషాలు లెక్కిస్తున్నారని గుర్తుచేశారు. నెట్టెంపాడు ఎత్తిపోతల కింద కాలువలు లేక రైతులు పొలాలు కోల్పోతున్నారని, పాలమూరు ఎత్తిపోతల పథకాన్నీ పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. పాలకులు మొత్తం విద్రోహ పనులే చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి పాలమూరుకు నీళ్లే లేకుండా చేయడాన్ని తీవ్రంగా నిలదీశారు. అందుకే మహబూబ్‌నగర్ ఇంకా ప్రశ్నిస్తోందన్నారు. ప్రజలను నమ్మిస్తూ ఇథనాల్ ఫ్యాక్టరీలను తేవాలని చూస్తున్నారని, ఈ క్రమంలో రైతులను కూడా అరెస్టు చేసి వేధింపులకు గురిచేస్తున్న పాలకులు ప్రజలవైపు నిలుస్తున్నారో లేదో మననం చేసుకోవాలన్నారు.

**ఐక్యంగా వెళ్తే సమస్యలన్నీ దూరం**
**- ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం**

పాలమూరు అధ్యయన వేదిక చేస్తున్న ప్రజాపోరాటాలను, కార్యక్రమాలను అభినంద నీయం. వాళ్ల త్యాగం మామూలుది కాదు. భవిష్యత్తు లో మరింత కృషి చేయాల్సి ఉంది. అన్ని సంఘాలు సహకారంతో మాస్ లైన్‌తో ఐక్యంగా ముందుకెళ్లాలి. అప్పుడే పాలమూరు జిల్లాల్లో సమస్యలు దూరమ వుతాయి. ఏడాదిలోపే దీని మార్పు కనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ ఆలోచించి అడుగేయాల్సిన తరుణ మిది.

**ప్రశ్నించకుండా అభివృద్ధి చర్చ చేయలేం**
**- ఎన్ వేణుగోపాల్, వీక్షణం ఎడిటర్**

ప్రజల మౌలిక అభివృద్ధి సాధ్యమైందా లేదా అన్నది ఇక్కడ ప్రశ్నించుకోవాలి. అదే అభివృద్ధికి కొలమానంగా భావించాలి. అసలు విద్యా, వైద్యం అందుతుందా? ప్రజలకు అవసరమైన సౌకర్యాలు ఏర్పడుతున్నాయా అన్నది ఆలోచించాలి. అభివృద్ధి అనే అంకెల గారడీలో పడితే చాలా చిక్కుల్లో ఉన్నట్టే. రోడ్లు వస్తే పురోగతి సాధించినట్టు కాదు. ప్రజల మౌలిక అభివృద్ధి సాధ్యమైందా లేదా అన్నది పరిశీలించాలి. ప్రజలు కోరుకున్నట్టు జరుగుతోందా లేక కార్పొరేట్లు ఆశించినట్టు పనులు సాగుతున్నాయా అన్నది బేరీజు వేయాలి. మహబూబ్‌నగర్‌కు వచ్చిన ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల తలసరి ఆదాయం పెరిగిందనే భావన కూడా కల్పిస్తారు. కాబట్టి ప్రశ్నించకుండా అభివృద్ధి చర్చ చేయలేం. ఈ నిర్వచనాన్ని పునరాలోచించాలి. దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంలో గట్టు మండలం నిలవడం దేనికి సంకేతం..?

**పాలమూరు ప్రజలకు పోరాడే శక్తి ఉంది**
**- జ్యోతి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు**

పాలమూరు జిల్లాకు విద్యా, వైద్యం అందిందా అంటే అదీ లేదు. అయినప్పటికీ పాలమూరు ప్రజలకు ఏండ్ల తరబడి సమస్యలపై ఎదురించి పోరాడే శక్తి ఉంది. ఈ ప్రాంతం వెనుకబాటుతనంలో కొట్టుమిట్టాడం వల్ల పాలకులకు విపరీతమైన నిర్లక్ష్యమూ ఉంది. ఇక్కడి ప్రజలు ప్రశ్నించలేరని అనుకుంటున్నారు. పాలకులే ఉద్యమాల్లో వ్యక్తులను దూర్చి నిర్వీర్యం చేస్తున్నారు. డబ్బులు తీసుకుని ఉద్యమాలకు పురమాయించడం దారుణం. దీన్ని ప్రజలందరూ గమనిస్తున్నారు. పెద్దధన్వాడ ప్రజలు చూపిన చైతన్యం పోరాటాలకు ఆదర్శం. ఇందులో యువత పాత్ర చాలా కీలకంగా మారింది.

**రైతులకు పౌరసమాజం అండగా నిలవాలి**
**- ఎంఎం రహమాన్, జనంసాక్షి ఎడిటర్**

ఉమ్మడి పాలమూరు జిల్లా విషయంలో పాలకుల నిర్లక్ష్యం వెంటాడుతోంది. సమస్యలు తీర్చాలని వేడుకుంటే కొత్త సమస్యలు తీసుకొస్తున్నారు. ఇప్పటికైనా ప్రశ్నించకపోతే భవిష్యత్ తరాలకు మరింత కష్టం. పాలకులను ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలి. ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పెద్ద ధన్వాడ రైతులకు పౌర సమాజం అండగా నిలవాలి.



**ఇంకెంత కాలం ఈ నిర్లక్ష్యం**
**: రాఘవా చారి, పాలమూరు అధ్యయన వేదిక**

పాలకపార్టీలు కక్షగట్టినట్టు పాలమూరుపై దశాబ్దాలుగా వివక్ష చూపాయి. ఇక్కడి ప్రజలకు జీవించే హక్కులేదా? ఎల్లకాలం ఈ వలసలకు ఉమ్మడి జిల్లా బలి కావాల్సిందేనా? దీన్ని సహించడానికి ఇకపై ప్రజలు సిద్ధంగా లేరు. పాలకులూ, ఇకనైనా మారండి. రాజ్యాంగ హక్కులను గౌరవించే పార్టీలు ఏవైతే ఉన్నాయో.. ఆ పార్టీలు ప్రజాపక్షాన నిలబడకపోతే చరిత్ర క్షమించదు.

**ఇప్పటికీ కరువూ కాటకాలు**
**: ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, సీఎల్‌సీ తెలంగాణ అధ్యక్షుడు**

ఒక జిల్లాకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించేందుకు వేదికను ఏర్పాటు చేయడం అభినందనీయం. నీటి లేమి, కరువు కాటకాలు, కనీస వసతులు కరువైన పాలమూరు జిల్లాలో వలసలు కొనసాగడం బాధాకరం. భూములను ఆక్రమించు కుంటూ ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు కడుతుంటే సారవంతమైన భూములు కోల్పోతున్నాం. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన జిల్లా గురించి ఇకనైనా పట్టించుకోవాలి. లేకపోతే గౌరవ ప్రదమైన జీవనం ప్రశ్నగానే మిగిలిపోతుంది.

**రైస్ మిల్లు పెడతామని చెప్పి పెద్దపెద్ద రోడ్లు వేశారు**
**- రామచంద్రయ్య,**
**చిత్తనూరు ఇథనాల్ వ్యతిరేక పోరాట ఉద్యమకారుడు**

రైస్ మిల్లు పెడతామని చెప్పి పెద్దపెద్ద రోడ్లు వేశారు. తర్వాత విషయం తెలుసుకున్న పోరాటాలు మొదలయ్యాయి. గ్రామగ్రామానా అవగాహన చేపట్టాం. కొందరు నాయకులు డబ్బులకు అమ్ముడుపోయి ఇథనాల్ కంపెనీకి సహకరించారు. వంద రోజులకుపైగా పోరాటం చేసినా అంగ బలం, అర్థబలంతో కంపెనీ ప్రారంభించారు. ఆ కాలుష్య ప్రభావంతో దగ్గూదమ్ముతో పాటు అనేక ఇబ్బందులొస్తున్నాయి. కిలోమీటర్ల దుర్వాసన వెదజల్లుతోంది. ప్రభుత్వం మారినప్పటికీ మా సమస్య తీరలేదు.

ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ డి నర్సింహారెడ్డి,సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె లక్ష్మీ నారాయణ, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవా చారి, పీవీపీ మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ కె వెంకటేశ్వర్లు, నాయకులు తిమ్మప్ప, గద్వాల జిల్లా కన్వీనర్ ఎండి ఇక్బాల్ పాషా, గద్వాల జిల్లా కో కన్వీనర్ డి హన్మంతు, వనపర్తి జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, శాంతన్నతో పాటు పలువురు రైతులు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీపై ఇక్బాల్ రచించిన పాటను వేదికపై ఆవిష్కరించారు.

# సీతక్కకు వచ్చిన లేఖ నకిలీదే..

వరంగల్(జనంసాక్షి): మంత్రి సీతక్కకు వార్నింగ్ ఇస్తూ వారం క్రితం మావోయిస్టులు విడుదల చేసిన లేఖ ఫేక్ అని తేలింది. ఇలాంటి లేఖ ఏదీ తాము రాయలేదని ఇప్పుడు మావో అధికార ప్రతినిధి పేరుతో ఓ లేఖ విడుదలయ్యింది. ఆ లేఖ మేం రాయలేదంటూ మరో లేఖ విడుదల చేయడంతో ఫేక లేఖ ఎవరిదన్నది ఇప్పుడు బయటపడాల్సి ఉంది. మంత్రి సీతక్కను హెచ్చరిస్తూ మావోయిస్టులు రిలీజ్ చేసిన లేఖపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ క్లారిటీ- ఇచ్చారు. ఈ మేరకు ఒక అధికారిక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ- పేరుతో 26.06.2025న మంత్రి సీతక్కపై వచ్చిన తాము రాయలేదని.. మా పార్టీకీ, ఆ లేఖకు ఎలాంటి సంబంధం లేదని తాజా లేఖలో స్పష్టం చేశారు. అలాగే మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావ్ అలియాస్ లొంగుబాటులో వాస్తవం లేదని తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

చర్ల(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో శనివారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో మావోయిస్టు మృతిచెందినట్టు గుర్తించి స్వాధీనంచేసుకున్నారు.ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిసర్వ్ గార్డ్), (ఎస్‌టీఎఫ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్) బలగాలకు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పుల కొనసాగుతున్నాయి. కాల్పుల ఘటనపై ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

# స్టాంప్ సవరణ చట్టం కోసం కసరత్తు

**అసెంబ్లీలో సవరణకు నిర్ణయం**
**అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్(జనంసాక్షి):**రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సాధారణ ప్రజలకు నష్టం కలిగించకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండేలా స్టాంప్ విధానాన్ని అమలు చేయాలనుకుంటున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇందుకు అనుగుణంగా తెలంగాణ సవరణ బిల్లు-2025ను తీసుకురావాలని నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సవరణ బిల్లుపై శనివారం నాడు డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి. ఎస్.లోకేష్ కుమార్, న్యాయ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డి వేముల శ్రీనివాస్ తదితరులతో సమావేశం నిర్వహించారు. భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం, తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను మరియు 26 ఆర్టికల్స్ ను సవరించుట కొరకు 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి కేంద్రప్రభుత్వం ఆమోదం కొరకు పంపడం జరిగిందని అయితే ఈ బిల్లుపై కేంద్రం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో భారత ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించడం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణయించినట్లు- వెల్లడించారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలు కట్టుదిట్టమైన రూపంలోకి తీసుకురావడం కొత్త ఒప్పందాలకు చట్టబద్దత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని అలాగే పాత చట్టంలో లేనివాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్దం చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్దతిలో భూముల ధరల సవరణ జరగాలన్నారు. ఏపీ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది అక్కడ హేతబద్దంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతోందని దీనిలో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని అలాగే కొత్త, పాత అపార్ట్‌మెంట్ లకు స్టాంప్ డ్యూటీ- ఒకే విధంగా ఉందని పాత అపార్ట్ మెంట్‌లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకొని స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని ఈ రెండు అంశాలపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

# మసూద్ అజహర్, హఫీజ్ సయీద్‌లు పాక్‌లోనే ఉన్నారా..?

# అయితే అడ్రస్ చెప్పండి.. అరెస్టు చేస్తాం

**పాక్ నేత బిలావల్ భుట్టో వ్యంగ్య వ్యాఖ్యలు**

**లాహోర్(జనంసాక్షి):** మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, జైషే మహ్మద్ ముఠా అధినేత మసూద్ అజార్, లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌లు ఎక్కడున్నారో చెప్పాలని ఆ దేశ మాజీ మంత్రి, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ అధినేత బిలావల్ భుట్టో అన్నారు. వీరు పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారని భారత్ ఎన్నిసార్లు చెబుతున్నా.. పాక్ మాత్రం దాన్ని అంగీకరించట్లేదు. తాజాగా బిలావల్ భుట్టో కూడా మరోసారి అబద్దాలతో ముందుకు వచ్చి అమాయకత్వం నటించారు. మసూద్ ఎక్కడున్నాడో తమకు తెలియదని అంటున్నారు. అతడు పాక్‌లో ఎక్కుడున్నాడో భారత్ చెబితే సంతోషంగా అరెస్టు చేస్తామంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బిలావల్ భుట్టో ఈ వ్యాఖ్యలు చేశారు. హఫీజ్ సయీద్ స్వేచ్ఛగా తిరుగుతున్నాడంటూ వస్తున్న వార్తలు అవాస్తవం. అతడు పాక్ కస్టడీలోనే ఉన్నాడు. ఇక, మసూద్ అజార్ విషయానికొస్తే అతడు ఎక్కుడున్నాడో మేం గుర్తించలేకపోతున్నాం. అరెస్టు చేయలేకపోతున్నాం. గతంలో జరిగిన కొన్ని ఘటనలను గుర్తుచేసుకుంటే.. బహుశా అతడు అఫ్గానిస్థాన్‌లో ఉండి ఉంటాడని భావిస్తున్నాం. ఒకవేళ అతడు పాక్ గడ్డ పైనే ఉన్నట్లు- భారత ప్రభుత్వం మాకు కచ్చితమైన సమాచారం ఇస్తే.. మేం



సంతోషంగా అతడిని అరెస్టు చేస్తాం. కానీ, న్యూదిల్లీ ఆ వివరాలు ఇవ్వదని అంటూ భుట్టో ఆరోపణలు చేశారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్ ను విజయవంతంగా చేపట్టిన సంగతి తెలిసిందే. పాక్, పీఓకేలోని జైషే, లష్కరే ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఉగ్రముఠాల ప్రధాన కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. అంతేకాదు.. భారత్ దాడుల్లో తమ కుటుంబంలో 10 మంది చనిపోయారని మసూద్ అజార్ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల వేళ.. భుట్టో తాజాగా చేసిన వ్యాఖ్యలు దాయాది ద్వంద్వవైఖరికి అద్దం పడుతున్నాయి. పాక్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠా అధినేత అయిన మసూద్.. భారత్‌లో పలు భీకర దాడులకు సూత్రధారి. 1995లో భారత్ అతడిని అరెస్టు చేసింది. అయితే, 1999లో కొందరు ఉగ్రవాదులు విమానాన్ని హైజాక్ చేసి అతడిని విడిపించుకున్నారు. ఆ తర్వాత అతడు జైషేను స్థాపించాడు. 2001లో పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడి, 2008లో ముంబయిలో జరిగిన బాంబు పేలుళ్లలోనూ ఇతడి ప్రమేయం ఉంది. 2019లో మసూద్‌ను ఐరాస అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అయినా అతడిని అప్పగించడంలో పాక్ మెలికలు పెడుతునే ఉంది.

# 600 రోజులైనా ఇచ్చిన హామీల అమలేది?

రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు.2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేసి తీరుతామని చెప్పి.. 600 రోజులైనా (దాదాపు 20 నెలలు) అమలు చేయలేదని విమర్శించారు. 6 గ్యారంటీల్లో భాగంగా 63 అనుబంధ హామీలను ప్రకటిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో ఊరూరా కరపత్రాలు పంచారని ఎద్దేవా చేశారు. అన్ని వార్తా పత్రికల్లో మొదటి పేజీల్లో ప్రకటనలు సైతం ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ ఏ ఒక్క గ్యారంటీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. తమను మోసం చేశారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని రామచందర్‌రావు లేఖలో పేర్కొన్నారు.

**బీజేపీ విధానాలు నచ్చని వారు పార్టీని వీడినా నష్టం లేదు**

భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రామచందర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాషాయ నేతలు ఆయన్ను గజమాలతో సత్కరించారు.హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను రామచందర్ రావుకు కిషన్ రెడ్డి అప్పగించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడికి బీజేపీ శ్రేణులు అభినందనలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి వరకు రావడం బీజేపీలోనే సాధ్యమని.. ఇందుకు తన ఎన్నికే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి స్పష్టమైన కార్యచరణతో ముందుకెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతామన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ చేసిన రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిసి ఇష్టమొచ్చినట్లు హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు ఉసురు తగులుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరతపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన యూరియాను రాష్ట్ర పాలకులు తినేశారా అని ఆరోపించారు. మోడీ, బీజేపీని తిట్టడమే కాంగ్రెస్ సామాజిన న్యాయ సభ ఉద్దేశమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు తన నివాసం నుంచి ర్యాలీగా వచ్చిన రామచందర్‌రావు ఉస్మానియా వర్సిటీలోని సరస్వతీ దేవాలయంలో, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ విధానాలు నచ్చనివారు పార్టీని వీడినా నష్టం లేదంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ విధానాలు, నిర్ణయాలు నచ్చక ఎవరు పార్టీని వీడినా నష్టం లేదని రామచంద్రరావు అన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని బీజేపీ ఎప్పుడూ మోసం చేయదని, అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కాంగ్రెస్ పార్టీ దోపిడీకి అక్షయపాత్రలుగా మారాయని వ్యాఖ్యానించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒక్క హామీని కూడా సమర్థంగా అమలు చేయలేకపోందని, ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ఆయన నిలదీశారు.

# ఎన్‌డీఏకు జాతి ప్రయోజనాలే ముఖ్యం

**ఏదేశంతో అయినా ఒప్పందాల్లో**
**ఇదే ప్రధానం:కేంద్రమంత్రి పీయూష్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎన్డీఏ ప్రభుత్వానికి జాతీయ ప్రయోజనాలే మొదటి ప్రాధాన్యత అని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సుంకాల విషయంలో ప్రధాని ఓ నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం దేశ ప్రజల గురించి పట్టించుకోక పోవడం వల్ల బలహీనంగా మారిన దేశాన్ని బలమైన, అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారన్ని తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై గోయల్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ నేతలు జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకున్నారని వ్యాఖ్యానించారు. భారత్‌కు ప్రపంచంలోని ఏ దేశంతో అయినా పోటీ- పడగలిగే సామర్థం ఉందని తాము విశ్వాసిస్తున్నామన్నారు. ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటే మాత్రమే ఏ దేశంతో అయినా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ సంసిద్ధతను వ్యక్తం చేస్తుందని గోయల్ అన్నారు. అలా కానీ పక్షంలో ఎట్టిపరిస్థితుల్లోనే ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాలను ఏర్పరుచుకోమని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్.. మారిషస్, యునైటె-డ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, నార్వే, యూకే వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని గోయల్ వెల్లడించారు. ప్రస్తుతం ఈయూ దేశాల కూటమి, అమెరికా, ఒమన్, పెరూ, చిలీ సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందని అన్నారు.

# దేశంలో లైంగిక నేరాలు పెరుగుతున్నాయి

**లైంగిక నేరాల పట్ల కఠినంగా తెలంగాణ ప్రభుత్వం**

**మంత్రి సీతక్క**





హైదరాబాద్ (జనంసాక్షి) : దేశంలో లైంగిక నేరాలు పెరుగుతున్నాయని, లైంగిక నేరాల పట్ల తెలంగాణ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని మంత్రి సీతక్క అన్నారు. ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో లైంగిక నేరాల నుంచి బాలల సంరక్షణ అనే అంశంపై జరుగుతున్న న్యాయ కోవిదులు, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు, రిజిస్ట్రార్లు, పోలీసు ఉన్నతాధికారుల కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేసి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లైంగిక దాడులు రిపోర్టు కాగానే వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలిచామన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టామన్నారు. 90% కేసుల్లో నిందితులకు కఠినమైన జైలు శిక్ష పడేలా చేశామన్నారు. పోక్సో బాధితులు ఆఫీసులో చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. వారికి పరిహారాన్ని గ్రీన్ ఛానల్ ద్వారా అందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. లైంగిక దాడులకు సంబంధించి అసలు మూలాలను కనిపెట్టి వాటిని నియంత్రించే చర్యలు చేపట్టాము. గంజాయి మత్తు పదార్థాల వల్లే ఎక్కువగా దాడులు జరుగుతున్నట్టు పోలీసు విచారణలో తేలిందని, అందుకే గంజాయి మత్తు పదార్థాలను కట్టడి చేసేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పోలీస్ శాఖలో ప్రత్యేకంగా నార్కోటిక్స్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. గంజాయి మత్తు పదార్థాల వినియోగాన్ని రవాణాను అణచివేస్తున్నామన్నారు. దీంతోపాటు చిన్న వయసు నుంచి పిల్లలకు గుడ్ టచ్ బాడ్ టచ్ మీద అవగాహన కల్పించాలని నిర్ణయిం చామన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా, మహిళా స్వయం సహాయక బృందాల సహకారంతో చిన్నారులు కిశోర బాలికలు కౌమార బాలికలు అందరికీ అవగాహన కార్యక్రమాలు కల్పిస్తామన్నారు. తెలంగాణలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ద్వారా బలమైన మహిళా సంఘటితశక్తి ఉంది. మహిళా ఆర్మీని సిద్ధం చేసి గ్రామాల్లో వేధింపులు, దాడుల పట్ల అప్రమత్తంగా ఉండేలా చేస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి అనే పాలసీ ద్వారా మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి వల్ల మహిళలు ఆర్థికంగా సామాజికంగా బలోపేతం అవుతున్నారు. ఇందిరా మహిళా శక్తి విధానంలో చిన్నారులు మహిళల సంరక్షణ ఎజెండా చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. న్యాయాధిశులు, పోలీసు ఉన్నతాధికారులు.. బాధితులకు సత్వర న్యాయమందే విధంగా చూడాలన్నారు. బాధితులకు న్యాయం అందించడంలో మానవతతో వ్యవహరించాలన్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, డ్రగ్స్, గంజాయి లేకపోతే లైంగిక దాడులు ఆగిపోతాయని, నిందితులను శిక్షించడంతోపాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పిల్లలు దేవుళ్ళతో సమానం, అటువంటి పిల్లల మీద అఘాయిత్యాలు జరగటం దారుణమన్నారు. మహిళలు పిల్లలు సగర్వంగా స్వేచ్ఛగా తలెత్తుకొని తిరిగే వాతావరణం ఏర్పడాలని, అందుకోసం నిందితులకి కఠిన శిక్ష పడేలాగా ప్రభుత్వం పోలీసులు జడ్జిలు అందరూ కలిసి పని చేయాలని, బాధితులకు ఒక కుటుంబం లాగా మనమంతా అండగా నిలవాలని కోరారు.

# అసెంబ్లీకి రమ్మంటే భయమెందుకు?

**చర్చలంటే ప్రెస్ క్లబ్‌లో పెడతారా?**

**కెటిఆర్, హరీష్ సెకండ్ బెంచ్ లీడర్స్**

**బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ జగ్గారెడ్డి**




హైదరాబాద్, జూలై 5 (జనంసాక్షి) : తీవ్ర విమర్శలు, ప్రతివిమర్శలతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కుతున్న క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో చర్చ జరగాలన్న సీఎం రేవంత్ రెడ్డి పిలుపుపై బీఆర్ఎస్ నేతలు చర్చకు భయపడుతున్నారని, అసెంబ్లీని తప్పించుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణలో విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. ప్రతిపక్ష పార్టీలు అధికార పక్షాన్ని అసెంబ్లీ పెట్టాలని కోరుతాయని, కానీ అందుకు విపక్ష బిఆర్ఎస్ సిద్ధంగా లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ పెడతా, ప్రతిపక్ష నాయకుడు రావాలి అంటున్నాడు, కానీ కెసిఆర్ అందుకు సిద్దంగా లేదని జగ్గారెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ చర్చను పక్కనపెట్టి ప్రెస్ క్లబ్‌కు, బోట్స్ క్లబ్‌కు రావాలని కేటీఆర్ పిలవడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ఇంకా రెండు రోజులు గడిస్తే... కల్లు దుకాణం దగ్గర రా అంటాడేమో కేటీఆర్, అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడి స్థానంలో సెకండ్ బెంచ్ నాయకులు మాట్లాడుతుండటాన్ని కూడా జగ్గారెడ్డి తీవ్రంగా ఖండించారు. కేటీఆర్, హరీష్‌రావు లాంటి నేతలు మొదటి బెంచ్‌కు చెందకుండా సెకండ్ బెంచ్‌లో ఉంటూ మాట్లాడుతున్నారు. అసలు అసెంబ్లీలో చర్చకు రావాలంటే వీళ్లెందుకు మధ్యలో వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్, కేసీఆర్ గతంలో ఆంధ్రావారిపై చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, ఇప్పుడు వారి తీరుపై ప్రశ్నించారు. 'ఆంధ్రోళ్లను తిట్టింది నువ్వే. కాళ్లకు ముళ్ళు గుచ్చుకుంటే నోటితో తీయమన్నది కేసీఆర్. కానీ ఇప్పుడు నీళ్లను దొంగతనం చేసినవాళ్లను ఇంటికి పిలిచి మీటింగ్ పెడుతున్నారని జగ్గారెడ్డి విమర్శించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పాలన కొనసాగిందని, ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు. మా ఫోన్లు వింటూ మీరు పరిపాలించారు. ఇప్పుడు అదే మీ ఇంట్లో జరిగితే కోపం రాకుండా ఉంటుందా? అని ప్రశ్నించారు. ఇక చంద్రబాబు, కేసీఆర్ మధ్య సంబంధాన్ని గుర్తు చేస్తూ... 'కేసీఆర్ కూడా చంద్రబాబుకే శిష్యుడు. ఇద్దరూ యూత్ కాంగ్రెస్‌లో పనిచేశారు. రేవంత్ మీద చంద్రబాబు కోవర్ట్ అన్న ఆరోపణల ముందు... మీ గతాన్ని కూడా గుర్తు పెట్టుకోండని అంటూ విమర్శలు చేశారు. కేసీఆర్ పాలనలో చేసిన పద్ధతులకు రేవంత్ ఇంకా ఓపికగా స్పందిస్తున్నారని, ఆయన గడ్డం పట్టుకుని మాట్లాడుతున్నారు. అసెంబ్లీలో చర్చ చేద్దామంటే... బయట వేదికలు ఎందుకని అన్నారు.

# చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి ముందుకు రావడం అభినందనీయం

**శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ, ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త..**



హైదరాబాద్ (జనంసాక్షి) : చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి ముందుకు రావడం అభినందనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ, ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్)12వ వార్షికోత్సవం సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పబ్బ మల్లేశం గుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ, ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేసిన రక్తదాతలు అన్నదాతలతో సమానమేనమేనని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. తలసేమియా వ్యాధి చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉంటుందని ఆ చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి ఐవీఎఫ్ నిరంతరాయంగా రక్తదాన శిబిరాలను డాక్టర్ బాలు ఆధ్వర్యంలో నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, ఐవిఎఫ్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కట్ట రవికుమార్, పబ్బ మల్లేష్ గుప్త,దారా లక్ష్మణ్ గుప్త,కే ఎస్ సంపత్ కుమార్ గుప్త,జయకృష్ణ గుప్త,బడంపేట్ వెంకటేష్ గుప్త,వనమా శ్రీనివాస్ గుప్త,పబ్బ శ్రీనివాస్ గుప్త,ఐత భాస్కర్ గుప్త,చిన్నం సత్యనారాయణ గుప్త,కోటేశ్వర రావు,పృధ్వీ గుప్త,కే వి గుప్త. జయకిశోర్ గుప్త,నటరాజు గుప్త, గాయత్రీ లలితలు పాల్గొన్నారు.

# యాజమాన్యాల పట్ల ప్రభుత్వాల ఉదరాభావం

**కార్మిక చట్టాల నిర్వీర్య ఫలితమే సిగాచి ఘటన**

**కార్మిక చట్టాల రద్దుతో భవిష్యత్తులో మరిన్ని సిగాచి ఘటనలు**

**మృతులకు క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా నిలబడాలి**

**గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి**

**సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఎంపీ రాజారాం సింగ్**

**సిగాచి ఫ్యాక్టరీ సందర్శన, బాధితులకు పరామర్శ**



సంగారెడ్డి (జనంసాక్షి) : ఫ్యాక్టరీ యజమాన్యాల పట్ల ప్రభుత్వాలు ఉదర భావంతో వ్యవహరిస్తున్నాయని, దాని ఫలితంగా కార్మికులు శ్రమ దోపిడితోపాటు ప్రాణాలు కోల్పోయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్లమెంట్ సభ్యుడు, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ రాజారాం సింగ్ అన్నారు. పారిశ్రామికవేత్తల అనుకూలమైన విధానాలతో మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని, వీటి ద్వారా భవిష్యత్తులో మరిన్ని సిగాచి ఘటనలు జరగనున్నాయని ఆయన అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా పాశ మైలారం సిగాచి ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఎంపీ రాజారాం సింగ్, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే మనోజ్ మంజిల్, కేంద్ర కమిటీ సభ్యుడు నైనాలశెట్టి మూర్తి సందర్శించారు. అనంతరం బాధితుల కుటుంబాలను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ. .. ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాల్లో సిగాచి ఘటన పెద్దదని, ఇది అత్యంత విషాదమని ఆయన అన్నారు. ఫ్యాక్టరీలలో సరైన సదుపాయాలు లేకపోవడం భద్రతాపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సిగాచి ఫ్యాక్టరీ యజమాన్యం ఈ ఘటనకు బాధ్యత వహించాలని కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ యజమాన్యం అందించే సాయంతో పాటు ప్రభుత్వ సాహసం అధికంగా ఉండాలని, ఎక్స్గ్రేషియా చెల్లించాలని ఆయన అన్నారు. కార్మికుల మృతుల సంఖ్యపై తేడాలు ఉన్నాయని, లెక్కలు అనుమానాస్పదంగా ఉన్నాయని రాజారాం సింగ్ తెలిపారు. కొద్ది మంది వివరాలు తెలియడం లేదని వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వలస కార్మికుల విషయంలోనూ అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారి వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, రాష్ట్ర కమిటీ సభ్యులు నూనవత్ వీరు నాయక్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఏఐసిసిటీయు రాష్ట్ర కార్యదర్శి రొయ్యల రాజు, నాయకులు మహంకాళి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# డెడ్ అయిన పార్టీ డెడ్‌లైన్లు పెట్టడమేంటి?

**కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ సీతక్క**

హైదరాబాద్, జూలై5 (జనంసాక్షి) : కేటీఆర్ గుర్తింపు సమస్యతో బాధ పడుతున్నాడని, ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో చర్చిద్దాం రా అంటే...ప్రెస్ క్లబ్ కు రమ్మనడం ఏంటని మంత్రి సీతక్క సెటైర్ వేశారు. మంత్రి సీతక్క ప్రజా భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు కేటీఆర్ స్పందించిన తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కు కేటీఆర్ కు అర్థం కానట్లు- ఉందని, విదేశాలలో ఉన్న కేటీఆర్ తెలంగాణకు వచ్చినట్లు- చెప్పేందుకే ప్రెస్ మీట్ పెట్టినట్టుగా ఉందన్నారు. ప్రజలు ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్నది ప్రెస్‌క్లబ్ లో చర్చించడానికి కాదని, అసెంబ్లీలో చర్చించ మంటే.. ప్రెస్ క్లబ్ కు రావాలని కోరడం ఏంటని ఆమె అన్నారు. 72 గంటల డెడ్‌లైన్ అంటూ అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నాడని, డెడ్ అయిన పార్టీ డెడ్ లైన్ పెట్టడం విడ్డూరంగా ఉందని, నీ సొంత చెల్లే ..నిన్ను నాయకునిగా గుర్తించడం లేదని, ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీ కి రాడా... సమస్యల పై చర్చిందాం రా అంటే భయమెందుకు అని ఆమె ప్రశ్నించారు.

# నీటి కుంటలో పడి అక్కాతమ్ముడి మృతి



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి): ఆదిలాబాద్ జిల్లా మావాల మండల కేంద్రం శివారు ప్రాంతంలోని ఓ నీటి కుంటలో ఒకే కుటుంబానికి చెందిన అక్కా తమ్ముడు మృతి చెందిన సంఘటన విషాదం నింపింది. వివరాల ప్రకారం మావాల మండల కేంద్రంలో నివాసం ఉంటున్న లంక స్వామికి వినూత్న(11) విధాత(9) సం.గల ఇద్దరు పిల్లలు ఉన్నారు . అక్కా తమ్ముడు కలిసి శనివారం సైకిల్ తొక్కు కుంటూ మండలం శివారు ప్రాంతంలో ఉన్న గ్రీన్ సిటీ వెనక మైదానం ప్రాంతం వైపు వెళ్లారు. ఆ ప్రాంతంలో నీటి కుంటలు ఉండడంతో వారు తొక్కుతున్న సైకిల్ బురదలో స్లిప్ కావడంతో సైకిల్ పై ఉన్న వినూత్న కుంటలో జారి పడి పోయింది.నీటిలో పడ్డ అక్కని కాపాడదామని విధాత నీటిలో దిగాడు. దీంతో ఇద్దరు నీటిలో మునిగిపోయారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో సైకిల్ పడి ఉండడాన్ని గమనించిన కొంతమంది స్థానికులు వెంటనే నీటి కుంటలో దిగి గాలించగా అప్పటికే ఊపిరాడక మృతి చెందిన అక్కా తమ్ముడి మృత దేహాలు లభ్యమయ్యాయి. దీంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# రాజాసింగ్‌ను వదిలించుకునేందుకు సిద్ధం

**ఇక ఎంతమాత్రం ఉపేక్షించరాదన్న భావన**

**త్వరలోనే బిజెపి నిర్ణయం తీసుకునే అవకాశం**



హైదరాబాద్, జూలై5 (జనంసాక్షి) : పంటి కింద రాయిలా పరిణమించిన గోషామహల్ శాసనసభ్యుడు రాజాసింగ్‌ను వదిలించుకోవాలని బీజేపీ భావిస్తున్నట్టు- తెలుస్తున్నది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక తీరుపై కేంద్ర నాయకత్వం మీద నిరసన గళం విప్పిన రాజాసింగ్ ఏకంగా పార్టీకి రాజీనామా చేస్తూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖ ఆధారంగా స్పీకర్‌కు లేఖ రాసి తన అసెంబ్లీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయించాలని మాట్లాడారు. తాను ఇక ఏమాత్రం బీజేపీ సభ్యుడిని కానని కూడా ప్రకటించారు. దీంతో ఇదే అదునుగా ఆయనను పార్టీ నుంచి బయటకు పంపాలని రాష్ట్రంలోని పలువురు నేతలు పావులు కదుపుతున్నట్టు తెలిసింది. పలుమార్లు పార్టీని, పార్టీ నేతలను ఇరుకున పెట్టేలా వ్యవహరించిన రాజాసింగ్‌ను వదిలించుకోవడానికి ఇదే కలిసి వచ్చిన సమయమని వారు భావిస్తున్నట్టు సమాచారం. ఇంకెంతకాలం ఆయనను భరించాలని పలువురు నేతలు పార్టీ అధిష్ఠానం పెద్దల వద్ద ప్రస్తావించినట్టు తెల్సింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, సంస్థాగత వ్యవహారాల జాతీయ కార్యదర్శి తదితరులకు ఇదే విషయాన్ని రాష్ట్ర పార్టీ నివేదించినట్టు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కేంద్ర పార్టీకి ఒక లేఖను కూడా పంపినట్టు తెలిసింది. లేఖపై సంతకం చేసిన వారిలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు సహా ముఖ్య నేతలంతా ఉన్నట్టు చెప్తున్నారు. కేంద్ర నాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే స్పీకర్‌కు రాజాసింగ్‌పై పార్టీ నిర్ణయాన్ని వివరిస్తూ లేఖ రాయాలని నిర్ణయించినట్టు తెలిసింది. పార్టీ ఆదేశాలు వస్తే అప్పుడు స్పీకర్‌కు లేఖ ఇస్తామని బీజేపీకి చెందిన కీలక నేత ఒకరు వెల్లడించారు. ఒకవేళ బీజేపీ కేంద్ర నాయకత్వం సమ్మతిస్తే జూలై నెలాఖరులోపే రాజాసింగ్ వ్యవహారం తేలిపోతుందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. పార్టీతోపాటు అసెంబ్లీ స్పీకర్ కూడా ఆయన రాజీనామాను ఆమోదిస్తే గోషామహల్‌లో ఉప ఎన్నిక తప్పదని తెలుస్తున్నది. జూబ్లీహిల్స్‌తోపాటే గోషామహల్‌కు కూడా ఉప ఎన్నిక జరిగే అవకాశాలు ఉంటాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబర్‌లో షెడ్యూల్ విడుదల కానుంది. అప్పుడే రాష్ట్రంలోని ఈ రెండు నియోజకవర్గాలకు కూడా ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

# ఐవీఎఫ్ ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు



భువనగిరి (జనంసాక్షి) : ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు, వైయస్సార్ గార్డెన్స్ భువనగిరిలో 'గోరింటాకు సంబరాలు' ఎంతో ఘనంగా జరిగాయి. సుమారు 500 మంది మహిళలు హాజరయ్యారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఈనాటి ముఖ్యఅతిథి ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై మాట్లాడారు. గోరింటాకు సంబరాలు అంటే ఆషాడ మాసంలో మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని జరుపుకునే సంబరాలు అని, ఇది ఒక సంప్రదాయ పండగలగా తెలంగాణలో జరుపుకుంటారని, మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారని, అంటువ్యాధులను దూరం చేసుకుంటారని, ఈ సంబరాలు ఆషాడ మాసంలో ప్రత్యేకంగా మహిళలు జరుపుకుంటారని, ఈ గోరింటాకు సంబరాల కార్యక్రమాన్ని మహిళలు ఇంత పెద్ద ఎత్తున జయప్రదం చేసినందుకు, వారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఆయన అన్నారు. ప్రధాన కార్యదర్శి పాపా చంద్రశేఖర్ గుప్తా, అదనపు ప్రధాన కార్యదర్శి కటకం శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్, యూత్ ప్రెసిడెంట్ కట్ట రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, తదితరులు పాల్గొన్నారు. ఐవిఎఫ్ మహిళ చైర్ పర్సన్ ఉప్పల స్వప్న, ప్రధాన కార్యదర్శి లంకలపల్లి మంజుల, కోశాధికారి సేగు నళిని, చీఫ్ అడ్వైజర్ కలకొండ మణిమాల, ఐవిఎఫ్ నాయకురాలు పప్పా స్వప్న, పిఆర్ఓ సిద్ది స్వాతి, స్టేట్ పొలిటికల్ కమిటీ చైర్ పర్సన్ సరాబు తులసి, ఐవిఎఫ్ అధ్యక్షులు చీకటిమల్ల రాములు గుప్తా, ప్రధాన కార్యదర్శి బెజ్జాల శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి జంగాల హనుమంతరావు గుప్తా, భువనగిరి జిల్లా అధ్యక్షురాలు సముద్రాల కల్పన, వైస్ ప్రెసిడెంట్ లలిత, సేవాదళ్ గోలి సరిత, అడిషనల్ కోశాధికారి పూల అర్చన తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాబాయ్ దేశముఖ్ మహిళాసభ ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తులు

హైదరాబాద్, జూలై5 (జనంసాక్షి) : దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్ కేర్ మల్టీపర్పస్ వర్కర్ , ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, దయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవ తరగతి అని వివరించారు. రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్, పర్ఫ్యూజన్ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 15వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 6805895867 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
6 జూలై 2025
తెలంగాణ

# జీఎస్టీ మోసాలు

## సవాళ్లు, నివారణ చర్యలు




2017లో భారతదేశంలో వస్తు మరియు సేవల పన్ను (జీఎస్టీ) ప్రవేశపెట్టబడినప్పటి నుండి, దేశంలోని సంక్లిష్టమైన పన్ను వ్యవస్థను సరళీకరించడం, వ్యాపారాలకు సౌలభ్యం కల్పించడం, మరియు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం దాని ప్రధాన లక్ష్యంగా ఉంది. బహుళ పన్నులను ఒకే పన్ను విధానంతో భర్తీ చేసిన జీఎస్టీ, పారదర్శకత, సమర్థత, మరియు ఏకరూపతను పెంపొందించేందుకు రూపొందించబడింది. అయితే, ఈ విప్లవాత్మక వ్యవస్థలోని కొన్ని లొసుగులను కొందరు వ్యాపారవేత్తలు, సరఫరాదారులు, మరియు కొన్నిసార్లు కస్టమర్లు కూడా దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ సంపాదకీయం జీఎస్టీ మోసాల స్వభావం, వాటి ద్వారా లాభపడే వారు, నష్టపోయే వారు, వాటి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం, మరియు నివారణ చర్యలను విశ్లేషిస్తుంది.
జీఎస్టీ మోసాల స్వభావం

### జీఎస్టీ మోసాలు వివిధ రూపాల్లో.. :

**నకిలీ ఇన్వాయిస్‌లు:** కొందరు వ్యాపారవేత్తలు వాస్తవ లావాదేవీలు లేకుండానే నకిలీ ఇన్వాయిస్‌లను సృష్టించి, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్ చేస్తారు. ఇది ప్రభుత్వ ఆదాయానికి గణనీయమైన నష్టాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యాపారి నకిలీ సరఫరా ఇన్వాయిస్‌ను జారీ చేసి, దాని ఆధారంగా ఐటీసీ పొందుతాడు, అయితే వాస్తవానికి ఎటువంటి వస్తువులు లేదా సేవలు మార్పిడి జరగవు.

**షెల్ కంపెనీలు:** కొందరు మోసగాళ్లు ఖాళీ కంపెనీలను స్థాపించి, వాటి ద్వారా నకిలీ లావాదేవీలను చూపిస్తారు. ఈ కంపెనీలు కేవలం కాగితంపై మాత్రమే ఉంటాయి. వాటిని ఉపయోగించి పన్ను ఎగవేతకు పాల్పడతారు.

**అసలు లేని సరఫరా:** వస్తువులు లేదా సేవల సరఫరా జరగకపోయినా, ఇన్వాయిస్‌లు జారీ చేసి ఐటీసీని దుర్వినియోగం చేస్తారు. ఇది సరఫరా గొలుసులో పారదర్శకత లేకపోవడం వల్ల సాధ్యమవుతుంది.

**పన్ను రేటు దుర్వినియోగం:** తక్కువ పన్ను రేటు వర్తించే వస్తువులను అధిక పన్ను రేటు కింద చూపించడం లేదా రివర్స్ చేయడం ద్వారా అన్యాయమైన లాభాలను ఆర్జిస్తారు. ఉదాహరణకు, 5% పన్ను రేటు వర్తించే వస్తువును 18% రేటు కింద చూపించి, ఎక్కువ ఐటీసీ క్లెయిమ్ చేయవచ్చు.

**ఈ-వే బిల్ దుర్వినియోగం:** వస్తువుల రవాణా సమయంలో ఈ-వే బిల్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ, ఒకే బిల్‌ను బహుళ రవాణాలకు ఉపయోగించడం లేదా నకిలీ బిల్‌లను జనరేట్ చేయడం జరుగుతుంది. ఈ మోసాలు జీఎస్టీ వ్యవస్థలోని పారదర్శకతను దెబ్బతీస్తాయి, ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన హాని కలిగిస్తాయి.

### నివారణ చర్యలు

జీఎస్టీ మోసాలను నిరోధించడానికి కఠినమైన మరియు సమర్థవంతమైన చర్యలు అవసరం. కొన్ని సూచనలు:

**టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డేటా అనలిటిక్స్ ఉపయోగించి నకిలీ ఇన్వాయిస్‌లను మరియు అసాధారణ లావాదేవీలను గుర్తించవచ్చు. జీఎస్టీఎన్ పోర్టల్‌లో రియల్-టైమ్ ట్రాకింగ్ మరియు ఆటోమేటెడ్ అలెర్ట్ సిస్టమ్‌లను అమలు చేయడం ద్వారా మోసాలను తగ్గించవచ్చు.

**కఠినమైన శిక్షలు:** మోసాలకు పాల్పడే వారిపై భారీ ఆర్థిక జరిమానాలు, జైలు శిక్షలు, మరియు వ్యాపార లైసెన్స్ రద్దు వంటి కఠినమైన చర్యలను అమలు చేయడం ద్వారా భయాందోళన సృష్టించవచ్చు.

**జీఎస్టీఎన్ ధృవీకరణ:** లావాదేవీలకు ముందు జీఎస్టీఎన్ ధృవీకరణను తప్పనిసరి చేయడం ద్వారా షెల్ కంపెనీలను గుర్తించవచ్చు. బయోమెట్రిక్ లేదా ఆధార్ ఆధారిత ధృవీకరణ వంటి అదనపు భద్రతా చర్యలు కూడా ఉపయోగపడతాయి.

**అవగాహన కార్యక్రమాలు:** వ్యాపారవేత్తలు, సరఫరాదారులు, మరియు కస్టమర్లకు జీఎస్టీ నిబంధనలపై అవగాహన కల్పించడం ద్వారా మోసాలకు గురికాకుండా నిరోధించవచ్చు. ప్రభుత్వం మరియు పరిశ్రమల సంఘాలు సంయుక్తంగా వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, మరియు డిజిటల్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి.

**సరఫరా గొలుసు ట్రాకింగ్:** ఈ-వే బిల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా వస్తువుల సరఫరాను రియల్-టైమ్‌లో ట్రాక్ చేయవచ్చు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా సరఫరా గొలుసులో పారదర్శకతను పెంచవచ్చు.

**సమన్వయ చర్యలు:** కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం, అలాగే జీఎస్టీ అధికారులు, ఆదాయపు పన్ను విభాగం, మరియు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ మధ్య సహకారం ద్వారా మోసాలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

జీఎస్టీ వ్యవస్థ భారత ఆర్థిక వ్యవస్థకు ఒక విప్లవాత్మక ఆస్తిగా పరిగణించబడినప్పటికీ, దానిలోని లొసుగులను దుర్వినియోగం చేసే ప్రయత్నాలు దాని సామర్థ్యాన్ని మరియు విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. ఈ మోసాలు ఆర్థిక వ్యవస్థకు హాని కలిగించడమే కాక, చట్టబద్ధ వ్యాపారాలను మరియు సామాన్య పౌరులను కూడా ప్రభావితం చేస్తాయి. ప్రభుత్వం, వ్యాపారవేత్తలు, మరియు పౌరులు సమిష్టిగా ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి కృషి చేయాలి. టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలు, కఠినమైన చట్టపరమైన చర్యలు, మరియు అవగాహన కల్పించడం ద్వారా జీఎస్టీ వ్యవస్థను మరింత పటిష్టం చేయవచ్చు. ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో, న్యాయమైన, పారదర్శకమైన వ్యాపార వాతావరణాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జీఎస్టీ యొక్క నిజమైన సామర్థ్యాన్ని సాకారం చేయడానికి, ఈ మోసాలను సమర్థవంతంగా నిరోధించడం మరియు వ్యవస్థను నిరంతరం మెరుగుపరచడం అత్యవసరం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

### లాభపడే వారు

జీఎస్టీ మోసాల ద్వారా లాభపడే వారిలో ప్రధానంగా కొందరు వ్యాపారవేత్త లు, సరఫరా దారులు, మరియు మధ్యవర్తులు ఉన్నారు. నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా ఐటీసీ క్లెయిమ్ చేయడం వల్ల వారు తమ ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్మగలుగుతారు, ఇది వారికి మార్కెట్‌లో అన్యాయమైన పోటీతత్వ ప్రయోజ నాన్ని ఇస్తుంది. కొన్ని సందర్భాల్లో, కస్టమర్లు కూడా తక్కువ ధరల వల్ల ఆకర్షితులై, ఈ మోసాలకు పరోక్షంగా సహకరిస్తారు. ఉదాహర ణకు, నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా తక్కువ ధరలకు వస్తువులను కొనుగోలు చేసే వినియోగదారులు, తాము మోసపోతున్నారని తెలియకపోవచ్చు.

### నష్టపోయే వారు

జీఎస్టీ మోసాల వల్ల ప్రధానంగా ప్రభుత్వం ఆదాయ నష్టాన్ని చవిచూస్తుంది. ఈ నష్టం దేశంలోని సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక రంగాలకు నిధుల కొరతను కలిగిస్తుంది. ఉదాహరణకు, 2023లో జీఎస్టీ మోసాల వల్ల రూ. 20,000 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేయబడింది. చట్టబద్ధంగా వ్యాపారం చేసే వ్యాపారవేత్తలు కూడా నష్టపోతారు, ఎందుకంటే మోసగాళ్లు తక్కువ ధరలతో అన్యాయమైన పోటీని సృష్టిస్తారు. ఇది చిన్న మరియు మధ్య తరగతి వ్యాపారాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. చివరగా, సామాన్య పౌరులు కూడా పరోక్షంగా నష్టపోతారు, ఎందుకంటే ప్రభుత్వ ఆదాయం తగ్గడం వల్ల పన్ను భారం పెరిగే అవకాశం ఉంది లేదా సామాజిక సేవలు తగ్గిపోవచ్చు.

### ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

జీఎస్టీ మోసాలు ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. ప్రభుత్వ ఆదాయం తగ్గడం వల్ల బడ్జెట్ లోటు పెరుగుతుంది, ఇది ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది. అలాగే, మోసాలు మార్కెట్‌లో అసమానతలను సృష్టిస్తాయి, ఇది చట్టబద్ధ వ్యాపారాలను దెబ్బతీస్తుంది మరియు విదేశీ పెట్టుబడులకు ఆకర్షణను తగ్గిస్తుంది. జీఎస్టీ వ్యవస్థపై ప్రజల విశ్వాసం కూడా తగ్గుతుంది, ఇది దీర్ఘకాలంలో దాని సమర్థతను దెబ్బతీస్తుంది.







# గ్రూప్ -1 పరీక్షలోతెలుగుకు అవమానం!



ఈ ఏడాది మార్చిలో గ్రూప్- 1పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలపై అభ్యర్థులు పలు అనుమానాలు లేవనెత్తారు. దీంతో పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరపున అడ్వకేట్ రచన రెడ్డి గారి వాదన మేరకు టీజీపీఎస్సీ గ్రూప్-1 నియామకాలకు బ్రేక్ పడింది. మళ్లీ గ్రూప్ -1 పరీక్ష పై వరుసగా అయిదు రోజుల నుంచి వాదనలు జరిగాయి. ఈ క్రమంలో టీజీపీఎస్సీ తరపున సీనియర్ కౌన్సెల్ న్యాయవాది నిరంజన్ రెడ్డి గారు వాదనలో చేసిన వ్యాఖ్యలు బాధాకరంగా ఉన్నాయి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ గెలుపే లక్ష్యంగా పలు అభ్యంతరాలను చాకచక్యంగా పక్కదారి పట్టించారు. ముఖ్యంగా ప్రస్తుతం తెలుగు మీడియం విద్యార్థుల కర్మ, వారి పరిస్థితి అంతే అన్నట్టుగా మాట్లాడారు. తెలంగాణ విద్యార్థుల కంటే ఆంధ్ర ప్రాంత విద్యార్థులే తెలుగులో అద్భుతంగా రాస్తారు" అనే తీరులో మాట్లాడారు. ఇది భాషా ఆధిపత్యాన్ని, తెలంగాణ యాస, మాండలికం, విద్యా సామర్థ్యాలపై అవమానకరమైన ఆరోపణలను గుర్తుచేస్తోంది. ఇది ఒకరకంగా రాజ్యాంగహక్కుల ఉల్లంఘన అంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆంధ్ర పాలనలో జరిగిన భాషా అవహేళన, ఉద్యోగాల ఎంపికలో వివక్ష మరోసారి పునరావృతం అవుతున్నట్టు అనిపిస్తుంది. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పేద మధ్యతరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేస్తున్నట్టు కనబడుతుంది.

దాదాపు 21,000 పైచిలుకు అభ్యర్థులు గ్రూప్- 1 పరీక్ష రాసారు. ఇందులో 12,000 మంది అంటే 60 శాతం ఇంగ్లీష్ లో ఎగ్జామ్ రాసారు. ఎంపికైన వారిలో 90 శాతం ఆంగ్లంలో రాసిన విద్యార్థులే ఉన్నారు. అనగా 506 మందిని తెలుస్తుంది. తెలుగు మీడియంలో 8,000 మంది విద్యార్థులు అంటే 40 శాతం విద్యార్థులు పరీక్ష రాస్తే, కేవలం 10శాతంలోపే సెలెక్ట్ అయ్యారు. అనగా 56 మంది మాత్రమే. ఇక్కడ భాషా పరమైన వ్యత్యాసం స్పష్టంగా కనబడుతుంది. మొత్తంగా ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు అదనంగా 30 శాతంగా సెలెక్ట్ కాగా అదే స్థాయిలో తెలుగు మీడియం విద్యార్థులు నష్టపోయారు. ఉర్దూ మీడియం లో 9 మంది ఎగ్జామ్ రాసారు అంటే శాతం 0.1శాతం అనగా ఒకరు సెలెక్ట్ కావడం జరిగింది. ఈ గ్రూప్- 1 ఫలితాలను గమనిస్తే తెలుగు మీడియం వాళ్ళు చాలా నష్టపోయారని అర్థమవుతుంది. ఇప్పటివరకు గ్రామీణ పేద బడుగు బలహీన వర్గాలు గ్రూప్- 1 వంటి అత్యున్నత సర్వీస్ కు ప్రిపర్ కావాలని కలలు కనేవారు. ఇప్పుడు ఈ పరీక్ష ఫలితాలు చూస్తుంటే పలువురు గ్రామీణ పేద విద్యార్థులు దూరమయ్యే అవకాశం ఉంది. గ్రూప్ -1 సర్వీస్ కార్పొరేటీకరణ జరుగుతుందని అర్థమవుతుంది. వాస్తవంగా అభ్యర్థులు తెలుగు మాధ్యమంలో రాయడానికి అనేక రకాలుగా ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా మెటీరియల్, ఆంగ్ల విషయ పరిజ్ఞానాన్ని తెలుగులోకి అనువదించుకోవడం వంటి సమస్యలు ఎదుర్కొన్నారు. మరోవైపు గతంలో తెలుగు అకాడమీ పుస్తకాలను కూడా టీజీపీఎస్సీ ప్రామాణికం కాదని చెప్పింది. దీన్ని బట్టి తెలుగు విద్యార్థులు అటు చదవడానికి వనరుల కొరతతో పాటు సెలక్షన్ లో కూడా అన్యాయం జరగడం బాధాకరం.

వారికి ప్రత్యేకంగా పోస్టులు కేటాయించాల్సిందే!

ప్రభుత్వ సర్వీసులో ఉన్న అనేకమంది ఉన్నత అధికారులు మరియు రాజకీయ నాయకులు తెలుగు మీడియంలోనే చదివారు. ఈ క్రమంలో టీజీపీఎస్సీ అడ్వకేట్ తెలుగు భాషను తక్కువ అంచనా వేయడం గమనార్హం. గతంలో టీజీపీఎస్సీ అడ్వకేట్ ను జడ్జ్ గారు గ్రూప్- 1 మెయిన్స్ పేపర్లను దిద్దించే క్రమంలో ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ వాళ్ళకి వేరే వేరేకీ ( బ్లూ ప్రింట్ ) ఇచ్చారా? అని అడినప్పుడు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు నిరంజన్ రెడ్డి గారేమో కీ ఇచ్చామని చెప్పడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే అసలు మూల్యాంకనం సరిగ్గా జరిగిందా? జరగలేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలు నామమాత్రం రాసిన సగటు ఇంగ్లీష్ మీడియం అభ్యర్థికి వచ్చిన మార్కుల కన్నా ఎంతో విశ్లేషణాత్మకంగా రాసిన తెలుగు మీడియం అభ్యర్థులకు రాకపోవడం విస్మయం కలిగిస్తుంది. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులే తెలుగు మీడియంలో రాస్తుంటారు. వీరికి తీవ్ర అన్యాయం జరిగింది. మరోవైపు తెలుగు మీడియం అభ్యర్థుల పరిస్థితి అంతే అన్నట్టుగా టీజీపీఎస్సీ అడ్వకేట్ గారు వాదనలో కనబడుతుంది. టీజీపీఎస్సీ కేసు గెలవడం కోసం ఇంతా ఘోరంగా తెలుగు భాషను అవమానించాలా..? అని పలువు అభ్యర్థులు, మేధావి వర్గం ఆందోళన వ్యక్తం చేసింది. కావున తక్షణమే ప్రభుత్వం స్పందించి అభ్యర్థులకు న్యాయం చేయాలి. మళ్ళీ మెయిన్స్ నిర్వహించాలి. తెలుగు మీడియం విద్యార్థులకు ప్రత్యేకంగా కొన్ని పోస్టులు కేటాయించాలి. లేదంటే ఇక భవిష్యత్తులో గ్రూప్- 1ను తెలుగు మీడియంలో రాసి విద్యార్థులు ఇంకా ఉండరు. ఉన్నత అధికారులుగా వారిని చూడలేము. ఇది ఒక రకంగా మనం తెలుగును, తెలంగాణను అవమానించుకున్నట్టే.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7989579428

## ప్రజాస్వామ్య పరిరక్షణకు హజ్రత్ ఇమాం హుస్సేన్ త్యాగం ప్రేరణ కావాలి

'మొహర్రం' ఒక ప్రత్యేక ప్రాముఖ్యత కలిగినటువంటి మాసం. ఇస్లామ్ ధర్మంలో దీనికొక ప్రత్యేకత ఉంది. ఇస్లామీ క్యాలండరు ప్రకారం ఇది ముస్లిమ్ జగత్తుకు నూతన సంవత్సరం. ముహర్రం మాసంతోనే ఇస్లామీయ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. పూర్వచరిత్రలో కూడా దీనికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉండింది. ఇస్లామ్‌కు పూర్వం అప్పటి సమాజంలో కూడా 'ముహర్రం' నుండే కొత్తసంవత్సరం ప్రారంభమయ్యేది. ముహమ్మద్ ప్రవక్త(స) ముహర్రం మాసాన్ని అల్లాహ్ నెల అని అభివర్ణించారు. రమజాన్ రోజాల (ఉపవాసాలు) తరువాత అత్యంత శు భప్రదమైన రోజా ఆషూరా రోజానే. అంటే ముహర్రం పదవ తేదీన పాటించబడే రోజా అన్నమాట. రమజాన్ రోజులు విధిగా (ఫర్జ్ గా) నిర్ణయించబడక పూర్వం ఆషూరా రోజాయే ఫర్జ్ రోజు గా ఉండేది. కాని రమజాన్ రోజాలు విధిగా నిర్ణయించబడిన తరువాత ఆషూరా రోజా సఫిల్ గా మారిపోయింది. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) ప్రకారం, ఒకసారి ప్రవక్త మహనీయులు మదీనాకు వెళ్ళారు. ఆరోజు అక్కడి యూదులు రోజా పాటిస్తున్నారు. అది ముహర్రం పదవ తేదీ వారిని ప్రవక్త అడిగారు. ఏమిటి ఈరోజు విశేషం?' అని దానికి వారు, ఇది చాలా గొప్పరోజు. ఈ రోజే అల్లాహ్ మూసా ప్రవక్త(అ)ను, ఆయన జాతిని ఫెరౌన్ బారినుండి రక్షించాడు. ఫిరౌన్ ను, అతడి సైన్యాన్ని సముద్రంలో ముంచేశాడు. అప్పుడు మూసా ప్రవక్త, దైవానికి కృతజ్ఞతగా రోజా పాటించారు. కనుక మేముకూడా. ఆయన అనుసరణలో ఈరోజు రోజు పాటిస్తాము' అని చెప్పారు. అప్పుడు ప్రవక్తమహనీయులు, మూసా ప్రవక్త అనుసరణలో రోజా పాటించడానికి మీకంటే మేమే ఎక్కువ హక్కుదారులం అని చెప్పి, తమ అనుచరులకు, రోజా పాటించమని ఉపదేశించారు. ఆషూరా రోజా కేవలం యూదులే కాదు, క్రైస్తవులు కూడా పాటించేవారు. ఈ ఇదువర్గాలూ ముహర్రం పదవ తేదీన మాత్రమే రోజా పాటించేవి. కాని ప్రవక్తవారు, మీరు రెండురోజులు పాటించమని తన సహచరులకు బోధించారు. అంటే ముహర్రం మాసం 9,10 కాని, లేక 10,11 కాని రెండు రోజులు రోజాలను పాటించాలి. కాకతాళీయంగా 'కర్బలా" సంఘటన కూడా ఇదే రోజున జరగడం వల్ల దీని ప్రాముఖ్యత మరింతగా పెరిగిపోయింది. అంత మాత్రాన ముహర్రం మాసమంతా విషాద దినాలుగా పరిగణించడం, ఎలాంటి శు భకార్యాలూ నిర్వహించక పోవడం సరికాదు. ఎందుకంటే సత్యంకోసం, న్యాయం కోసం, ధర్మంకోసం, హక్కులకోసం, ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) అమరగతి పొందారు.

ధర్మయుద్ధంలో అమరుడుకావడం మానవ సహజ భావోద్రేకాల పరంగా బాధాకరం కావచ్చునేమోగాని, విషాదం ఎంతమాత్రం కాదు. ముహమ్మద్ ప్రవక్త (స) నిర్యాణం తరువాత తొలి నలుగురు ఖలీఫాలు: సారధ్యంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ జనరం జకమైన ప్రజాస్వామ్య పాలన పరిఢవిల్లింది. ఇస్లామీయ ప్రజాస్వా మ్యంలో మొట్టమొదటి సూత్రం, దేశం దైవానిది, దేశవాసులు ఆయన పాలితులు', అంతేకాని పాలకులు ప్రజలకు ప్రభు వులు ఎంతమాత్రం కాదు. ఇస్లామీయ రాజ్యానికి దైవభీతి, సచ్ఛీలత, జవాబుదారీతనం ప్రాణం లాంటివి. పాలకులు ఈ సుగుణాలకు ప్రతిరూపంగా, ఆదర్శంగా ఉ దేవారు అధికారులు, న్యాయమూర్తులు, సేనాపతులు, అన్నిశాఖల అధికారులు ఎంతో నిజాయితీ పరులుగా, న్యాయ ప్రేమికులుగా ఉండేవారు. అనుక్షణం దైవానికి భయపడుతూ, ప్రజాసేవలో ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్తపడేవారు. ప్రజలకు సమాధానం చెప్పుకునే విషయంలో కూడా వారు, 'ఎప్పుడైనా, ఎక్కడైనా తాము ప్రజలకు జవాబుదారులు మని భావించేవారు. ప్రతిరోజూ సమాజుల సమయంలో ప్రజల్ని కలుసుకొని, వారి అవసరాలు తీర్చేవారు. అవసరమైన సూచనలు, హితవులు చేసేవారు. కాని ఖలీఫాల తదనంతర కాలంలో పరిస్థితులు మారిపోయాయి.. దైవభీతి, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య భావనలకు భంగం ఏర్పడింది.

యజీద్ రాచరికం రూపంలో పురుడు పోసుకున్న దుష్పరిణామాలు ఇస్లామీయ ప్రజాస్వామ్య భావనను, ఆ సూత్రాలను తుంగలో తొక్కాయి. ఈవిధంగా కుటుంబ పాలన, చక్రవర్తుల పరంపర ప్రారంభమైంది. ఈ దురదృష్టకర పరిణామాల కారణంగా ముస్లిం సమాజం నేటి వరకూ ఇస్లామీయ ప్రజాస్వామ్య స్ఫూర్తికి దూరంగానే ఉండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణకు హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) కంకణ బద్ధులయ్యారు. లక్ష్యసాధన కోసం ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోడానికి సిద్ధపడ్డారు. విలువల పరిరక్షణ కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడలేదు. ప్రజాకంటకమైన రాచరిక వ్యవస్థను ఎదుర్కొన్న క్రమంలో సంభవించిన పరిణామ ఫలితాలు ఈనాడు. మనముందున్నాయి. ఇమామ్ హుసైన్ ఇంతటి ప్రమాదాన్ని కూడా లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి, ఇస్లామీయ ప్రజాస్వామ్య సంక్షేమరాజ్యాన్ని, దాని ప్రత్యేకతల్ని కాపాడుకోడానికి 'కర్బలా' సాక్షిగా ఒకవిశ్వాసి పోషించవలసిన పాత్రను ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆమహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అందుకే ప్రతియేటా 'మొహర్రం' పదవ తేదీన (యౌమె ఆషూరా) ఆయనగారి త్యాగాన్ని స్మరించుకుంటారు. ఈ నేపథ్యంలో చూసినప్పుడు హజ్రత్ ఇమామ్ హుసైన్ (ర) అమరత్వం ఆషామాషీ మరణంకాదు. సమాజంలో ప్రబలినప్పుడు, ఉన్మాదం జడలు విప్పినప్పుడు, విలువల హననం పోరాడి జరుగుతున్నప్పుడు, ప్రజాస్వామ్య వ్యవస్థ బీటలు వారుతున్నప్పుడు సమాజ శ్రేయోభిలాషులు, ప్రజాస్వామ్య ప్రియులు, న్యాయ ప్రేమికులు, పౌరసమాజం తక్షణం స్పందించాలి. న్యాయంకోసం, ధర్మం కోసం, మానవీయ విలువల -కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పరిధిలో శక్తివంచన లేకుండా. పోరాడాలి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన ప్రస్తుత తరుణంలో దాన్ని కాపాడుకోడానికి ప్రతి ఒక్కరూ నడుం గించాలి. విలువలప్రేమికులందరూ ఒక్కటిగా ముందుకు కదలాలి. దానికి ఇమామ్ స్ఫూర్తి ప్రేరణ కావాలి.

నేడు 10వ ముహర్రం యౌమే ఆషూరా సందర్భంగా ప్రత్యేక వ్యాసం

-ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్
మజ్లిస్ తహఫుజ్ ఖత్మె నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ అధ్యక్షుడు కరీంనగర్ ఉమ్మడి జిల్లా

## వారిని కలవాలంటే

వారు నిరంతరం శ్రమలో
తడిసి చెమట సుగంధాలు
సమాజానికి వెదజల్లుతారు.
వారు శాస్త్రవేత్తలై నిరంతరం
నిర్విరామ కృషిలో నిమగ్నమై
నీటిని ఒంటిపై పోసుకోవడం
కూడా మరిచిపోతారు.
వారి బట్టలు అవయవాలను
కప్పుకోవడానికి తప్ప
అలంకరణకు కాదు.
వారు మీ కావరపు కళ్ళకు
మురికి మనుషుల్లా కనబడితే ఎలా?
వారు తన శ్రమను నమ్ముకుని
బతుకుతున్న మూలవాసులు
వారు ఈ దేశపు నిర్మాణాలను
నిలబెట్టిన ఆసరా గోడలు
వారు ఈ దేశపు అభివృద్ధి
రథాలను నడిపిస్తున్న చక్రాలు
వారు ఈ దేశపు ధగధగల
వెలుగు జిలుగుకు
రంగులద్దిన కళాకారులు
అనువంత ఆలోచన చేయని
కుంచించుకుపోయిన మీ మెదళ్లకు
శుభ్రత లేని వారుగా కనబడితే ఎలా?
వారు మీ దుర్మార్గపు ధర్మాలకు
దగా పడి దూర్తులకు దూరంగా
ఉండాలని వెళ్లిపోయిన వారు.
వారు నీతిమాలిన
నికృష్టపు పాలకుల
నిర్లక్ష్యానికి గురై మోసపోయిన వారు
అలాంటి సాత్వికులను కలవాలంటే
సాధువుల వేశంలోపోతే కుదరదు
హృదయాన్ని శుద్ధిగా శుభ్రం చేసుకుని
సంకుచిత భావాలకు సమాధి కట్టి
విశాల హృదయంతో కలవాలి..

నెరువట్ల చైతన్య 9491370746

# ప్రజాస్వామ్యం కోసం ప్రాణాలొడ్డిన ముహర్రం వీరులు

"ఐరోపాలో సంభవించిన సాంస్కృతిక పునరుజ్జీవనం మొత్తం ప్రపంచాన్ని నూతన ఆలోచనల వైపుకు మళ్లించింది. రూసో ప్రతిపాదించిన ప్రజాసార్వభౌమాధికార సిద్ధాంతం ప్రపంచం నలుమూలలకూ పాకింది. స్వేచ్ఛ, సమత్వం,సౌభ్రాతృత్వం అంశాలుగా ఫ్రెంచ్ విప్లవం విజయవంతమయ్యింది."ఇదీ మనకు తరతరాలుగా యూరప్ చెప్తున్న చరిత్ర. మనమూ గుడ్డిగా నమ్ముతున్న చరిత్ర. ఆసియా,ఆఫ్రికా ఖండాల మహోన్నత చరిత్రను కాలరాసి తమది మహోన్నత చరిత్రగా,నాగరికతగా నిలబెట్టుకునే దుర్నీతి. ఆసియా ఖండంలో 1400 సంవత్సరాల క్రితమే ప్రజాస్వామ్యం కోసం, మానవహక్కుల కోసం జరిగిన మహత్తరమైన ముహర్రం విప్లవానికి చరిత్రలో సరియైన స్థానం లేకుండా చేసేందుకు యత్నించిన యూరప్ కాల్పనిక వాదుల కుట్ర. నిజం నిప్పులాంటిది. నివురు కమ్మినా చీల్చుకుని ప్రకాశిస్తూనే ఉంటుంది.

అరబ్బీ క్యాలండర్ లో ' ముహర్రం' మొదటి నెల. దాదాపు 1400 సంవత్సరాల క్రితం పాలకుడ్ని ప్రజలే ఎన్నుకోవాలనే ఇస్లామియా ప్రజాస్వామిక విలువలకు భిన్నంగా తన తండ్రి తరువాత తనే పాలకునిగా, రాజుగా ప్రకటించుకుంటాడు యజీద్. పాలకులు, పాలితులు అందరూ ముస్లింలే. ధార్మిక సంప్రదాయాల అనుసరణకు ఎటువంటి ఆటంకం లేదు. అయినా నాటి ధర్మవేత్తలు,ప్రజలు యజీద్ అధికారాన్ని వ్యతిరేకిస్తారు. అధికారం అనువంశిక వారసత్వం ఎంతమాత్రం కాదని ,నియంతృత్వానికి చోటే లేదని చాటి చెప్తారు. దీనిని దుష్టుడైన యజీద్ సహించలేకపోతాడు. రాజ్యంలో ప్రజల ప్రజాస్వామిక హక్కులు హరించివేయబడతాయి. రైతులపై పన్నుల భారం మోపబడుతుంది. ప్రశ్నించే ప్రతి పౌరుడ్ని దేశద్రోహ ముద్రలతో శిరచ్ఛేధనం విధించబడుతుంది. ప్రజల ఆక్రందన మహాప్రవక్త ముహమ్మద్(స)మనుమడైన హజ్రత్ ఇమామె హుసైన్(రజిఅన్)చెంతకు చేరుతుంది.

హజ్రత్ ఇమామె హుసైన్(రజిఅన్)గారి స్వస్థలం మదీనా. ప్రవక్త ముహమ్మద్(స)వారి కుమార్తె బీబి ఫాతిమా (రజిఅల్లాతాలన్హా), అల్లుడు హజ్రత్ అలీ (రజిఅన్)గార్ల కుమారుడు. హిజ్రీశకం 4 ,షాబాన్ నెల,3వ తారీఖున జన్మించారు. వీరి 57 వసంవత్సరంలో ఈ ఘటనలు చోటుచేసుకుంటాయి. యజీద్ రాజరికం క్రింద నలిగిపోతున్న ఇరాక్ ప్రజలు తమకు దిశానిర్దేశం చేయమని ఇమామె హుసైన్(రజి)గారికి వర్తమానం పంపుతారు. ఇది ఇస్లాం ప్రతిపాదించిన సోషలిస్టు, ప్రజాస్వామిక విలువలకు విరుద్ధంగా రాజరిక వ్యవస్థకు తిరిగి అంకురార్పణ చేసే తిరోగమన అంశంగా



భావించి ప్రజా చైతన్యానికి పిలుపిస్తారు ఇమామ్.. ప్రవక్త(స)గారి మనుమడికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తే ప్రజలు విప్లవిస్తారని భావించి పైకి నక్క వినయాలు నటిస్తూ ఆయనను హతమార్చాలని కుట్రలు పన్నుతుంటాడు యజీద్. ఇరాక్ ప్రజల కోరిక మేరకు ఇమామె హుసైన్(రజిఅన్)గారు తన కుటుంబ,అనుచర సమేతంగా 72 మందితో ఇరాక్ బయలుదేర్తారు. ఇమామ్ ఇరాక్ చేరితే ప్రజల ప్రజాస్వామిక పోరాటానికి నాయకత్వం వహిస్తారని భావించి ఆయనను దిగ్భంధించేందుకు యజీద్ సైన్యాన్ని పంపిస్తాడు. ఇరాక్ లోని కర్బలా అనే మైదానంలోకి ఇమామె హుసైన్(రజి)తన పరివారంతో అడుగుపెట్టగానే యజీద్ సైన్యం మైదానాన్ని చుట్టుముట్టారు. తన రాజరికాన్ని ఆమోదిస్తే సర్వసౌఖ్యాలు అనుభవించవచ్చని కబురంపిస్తాడు. ప్రజల హక్కుల కోసం,ప్రజాస్వామిక విలువల కోసం తుది రక్తపుబొట్టు వరకూ పోరాడతామే తప్ప ప్రాపంచిక సౌఖ్యాల కోసం లొంగేదే లేదని తెగేసి చెప్తారు హజ్రత్ ఇమామె హుసైన్(రజి). అన్నపానీయాలందకుండా దిగ్భంధించమని తన సైన్యాన్ని ఆదేశిస్తాడు. వెంటతెచ్చుకున్న ఆహారం,నీరు అయిపోతే ఇమామ్ లొంగుతారని,ఇమామ్ లొంగిపోయారని చూపి ప్రజలను లొంగదీయాలని యజీద్ ఆశ. ఒక వైపు ఆకలిదప్పులతో విలవిలలాడుతున్న తన కుటుంబం, మరోవైపు చుట్టుముట్టిన 4 వేల సైన్యం. కానీ హజ్రత్ ఇమామె హుసైన్ (రజి)సంకల్పబలం ముందు ఈ యాతనలన్నీ గడ్డిపోచలే. తను తన కుటుంబం ఏమాత్రం లొంగినా ప్రవక్త ముహమ్మద్(స)మనుమడు ఇమామె హుసైన్(రజి) రాజరిక, అనువంశిక విధానాలను ఆమోదించారని ప్రచారం చేసి ఇస్లామియా ప్రజాస్వామిక విలువలను మట్టుబెడ్తారని భావించిన ఇమామ్ పోరాటానికే సిద్ధపడ్తారు. ఈ సందర్భంలో ఇమామ్ పరివారంలోని స్త్రీలు, పిల్లలు, పరివారం చూపిన తెగువ, ధైర్యం యజీద్ సైన్యాన్ని నివ్వెరపరుస్తుంది. కానీ హజ్రత్ ఇమామె హుసైన్ (రజి) బుద్ధి కుశల త, దూరదృష్టి, త్యాగ గుణం యజీద్ సైనికుల ఊహలకు అందనివి. అది ముహర్రం నెల 10వ తేది యజీద్ సైన్యానికి,ఇమామ్ పరివారానికి మధ్య భీకర యుద్ధం. సరికొత్త త్యాగాల చరిత్రను లిఖించిన కర్బలా యుద్ధమది. వీరోచితంగా పోరాడుతూ ఇమామ్ పరివారంలోని ఒక్కొక్కరూ నేలకొరుగుతున్నారు. అయినా సరే మహా వీరుడైన హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజి)వీర విజృంభణ యజీద్ సైన్యానికి కంటక ప్రాయమైంది. ఇంతలో నమాజ్ సమయమైంది. నాటి యుద్ధ నీతి ప్రకారం నమాజ్ వేళలలో యుద్ధం నిషిద్ధం. తను నమాజ్ చేసుకునే వరకూ ఆగమని సైగ చేసి యుద్ధమైదానంలో నమాజ్ చేస్తూ దైవం ముందు మోకరిల్లారు ఇమామ్. నమాజ్ పూర్త యి తిరిగి కత్తి చేతబడితే ఇమామ్ ను నిలువరించటం అసాధ్యమని తలచిన యజీద్ మూక యుద్ధనీతిని ఉల్లంఘించి సజ్దాలో దైవం ముందు మోకరించి ఉంచిన ఇమామ్ శిరస్సును ఖండిస్తారు. కాలం విలవిలలాడింది. పకృతి రోదించింది. కసిదీరా యజీద్ సైనికులు ఇమామ్ శరీరాన్ని గుర్రాలతో తొక్కిస్తారు. ప్రజల్ని భయభ్రాంతులను చేసేందుకు ఇమామ్,ఆయన సహచరుల శిరస్సులను శూలాలకు గుచ్చి ఊరేగిం పులు చేస్తారు. అధికార మదంతో,ఐశ్వర్య మదంతో, సైన్య మదంతో తల బిరుసెక్కిన యజీద్ ఈ అమరుల శిరస్సులను ప్రదర్శనకు పెడ్తాడు. ప్రజాగ్రహం పెల్లుబికి రాజరిక వ్యవస్థను పెళ్లగించ టం తదనంతర చరిత్రగా మారుతుంది. కానీ మానవాళి చరిత్రలోనే అమరత్వపు సువాసనలు పూయించిన గొప్ప అమర చరిత్ర ఇది. తమ కోసం ,తమ కుటుంబాల కోసమో,ఐహిక అధికార సౌఖ్యాల కోసమో కాక ప్రజల కోసం,ప్రజల హక్కుల కోసం ,ప్రజాస్వామిక విలువల కోసం జరిగిన ఈ కర్బలా యుద్ధం అందించిన ప్రేరణ సదా మానవ ఇతిహాసపు చైతన్య దీపమై వెలుగుతూనే ఉంటుంది. చరిత్రెప్పుడూ అంతే. చీకట్లోనే ఉండదు. అన్ని చావులూ పరిమళాలు వెదజల్లవు. కొన్ని మాత్రమే ..అంతే...

కవి కరీముల్లా సామాజిక వ్యాసం

# విద్యార్థులకు మౌలిక వసతులు, నాణ్యమైన విద్యపై దృష్టి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, జూలై 5 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉత్తమమైన భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం మౌలిక వసతులు,నాణ్యమైన విద్యా వాతావరణంపై దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. శనివారం గద్వాల మండలంలోని దౌదార్‌పల్లి,పరుమాల సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి బాలికల పాఠశాలలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో ఎంతమంది విద్యార్థినిలు ఉన్నారు ?.. వారికి సరిపడా బెడ్స్, మరుగుదొడ్లు,స్నానపు గదులు ఉన్నాయా? లేదా ? అని ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు ఫలితాలు ఎలా వస్తున్నాయి అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినిలు నిద్రించే గదుల్లోకి వెళ్ళి బెడ్స్, ఆహార పదార్థాలు,వంట గదులు,మరుగుదొడ్లు, పాఠ్య పుస్తకాలు,తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని,అట్టి విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ప్రిన్సిపాల్ కి సూచించారు.విద్యార్థులు అన్ని క్రీడల్లో పాల్గొని ప్రతిభను అభివృద్ధి చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు.ఇందుకోసం పాఠశాలలో నాణ్యమైన క్రీడాసామగ్రి, అవసరమైన సౌకర్యాలు,అన్ని క్రీడలకు అనుకూలమైన మైదాన వాతావరణం ఉండేలా



చూడాలని సూచించారు.ప్రతి విద్యార్థి తప్పకుండా యూనిఫాం ధరించాలని తెలిపారు.అన్ని పుస్తకాలు ప్రతి విద్యార్థికి సమంగా అందేలా పంపిణీ చేయాలని సూచించారు.హాస్టల్లో డైట్ ప్లాన్ అమలును పరిశీలించి,విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో బాగా చదివి,మంచి స్థాయికి ఎదిగి,తాము చదువుకున్న పాఠశాలలు, కళాశాలలకు గౌరవం తీసుకురావడమే కాకుండా,తమ భవిష్యత్తు కోసం సహకరిస్తున్న ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అలివేలు, అనీల, పాఠశాల సిబ్బంది,విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# మొహర్రం పండుగ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- డీఎస్పీ నల్లపు లింగయ్య



**మక్తల్, జూలై 5 (జనంసాక్షి) :** మొహరం పండుగ సందర్భంగా ఉట్కూర్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. మొహరం పండుగ కు నారాయణపేట జిల్లా ఫోర్స్ తో పాటు ఉమ్మడి జిల్లా నుండి వచ్చిన మొత్తం 100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ఉట్కూర్ లోని రైతు వేదికలో బందోబస్తుకు వచ్చిన పోలీసులకు డిఎస్పీ నల్లపు లింగయ్య భద్రతాపరమైన సూచనలు ఇచ్చారు. ఉట్కూర్ టౌన్ లో బందోబస్తును మూడు సెక్టార్లుగా విభజించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది సంయమానం పాటించాలని, ఎవరికి ఎక్కడ కేటాయించిన స్థలంలో వారు అక్కడే ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. పీర్ల చావడి, మజీద్‌ల దగ్గర, ప్రధాన చౌరస్తాలో పోలీస్ పికేట్స్, పీర్ల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ డైవర్షన్, మొబైల్ పెట్రోలింగ్, ఫుట్ పెట్రోలింగ్ మొదలగు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున దొంగతనాలు జరగకుండా, ఆకతాయి నుండి మహిళల రక్షణ గురించి మఫ్టిలో పోలీసులను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలంతా కుల మతాల కతీతంగా ఉత్సాహంగా పండుగ శాంతింతంగా జరుపుకోవాలని, ప్రజలు పోలీసు వారికి సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. అలగే సోషల్ మీడియా పై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగింది అని ఇతరులకు ఇబ్బందులు కలిగే విధంగా ఎలాంటి అనుచిత పోస్టులు వైరల్ చేయరాదని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రామ్ లాల్, ఎస్ఐలు రమేష్, శివ శంకర్, మద్దయ్య, రేవతి, గాయత్రి, పోలీసు సిబంది తది తరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, జూలై 5 (జనం సాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గమే ధ్యేయంగా మణికొండ మున్సిపాలిటీని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం రూ.7.52 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి పనులను కమీషనర్ ప్రదీప్ కుమార్, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్ లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.మున్సిపల్ సాధారణ 42 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన 18వ వార్డు లోని శివ నగర్ కమ్యూనిటీ హాల్ ని ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ రూ. 1 కోటితో అల్కపూర్ పార్క్ 1 లో జరుగుతున్న వాల్ పెయింటింగ్స్ అభివృధి పనులు, రూ.75 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన 7వ వార్డు లోని స్పెక్ట్రం విల్లాస్ వద్ద ఏర్పాటు చేసిన బాక్స్ కలవాట్



ని ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ వెంకటేశ్వర కాలనీలో 50 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకి శంకుస్థాపన, రూ. 50 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన 6 వ వార్డు లోని అలిజాపూర్ రోడ్డులో సెంట్రల్ మీడియన్ని, రూ. 60 లక్షలతో 17వ వార్డు లోని తిరుమల హిల్స్ పార్క్ ని ప్రారంభించారు. రూ.125 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన 14 వ వార్డు లోని శివాజీ నగర్ కమ్యూనిటీ హాల్ని, రూ.250 లక్షల తో 13 వ వార్డు లోని మణికొండ మర్రిచెట్టు వద్ద ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మేరు జితేందర్, గుడిమల్కాపూర్, నార్సింగ్ ఏఎంసీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, కోట వేణు గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, శ్రీరాములు, ఏఎంసి డైరెక్టర్ లు ఏర్పుల కుమార్, లక్ష్మీ శ్రీ, నేతలు లక్ష్మీనారాయణ, కిరణ్, ముత్యాలు, శ్రీరాములు, శ్రవణ్, సాయి రెడ్డి, మేనేజర్ శ్రీధర్ ,డిఈ శివ సాయి,ఎఈఈ సంజయ్ ,మాజీ మహిళా కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను అకస్మిక తనిఖీ



**వెల్దండ, జూలై 5 (జనంసాక్షి) :** వెల్దండ మండలం లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియస్ స్కూల్లో నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్లోని పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టిక మరియు బాయ్స్ అండ్ గర్ల్స్ హాస్టల్ , బాత్రూం, వాష్ రూమ్ లను, పారిశుద్ధ్య నిర్వహణ మొదలైనవి పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసి ప్రిన్సిపల్ ని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ కోడం భాస్కర్, ఉపాధ్యాయులు రీనా,అనీషా, కీర్తి,రాహుల్,పర్వీన్, ఇమాదుద్దీన్, మల్లిక పాల్గొన్నారు.

# చినుకు పడితే చిత్తడే...

- జిల్లా కేంద్రంలో అధ్వాన్నంగా అంతర్గత రోడ్లు
- పట్టించుకోని అధికారులు



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 5 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న అంతర్గ త రోడ్ల పరిస్థితి వర్ణనాతీతం చినుకు పడితే చాలు రోడ్లు చిత్తడిఅవుతున్నాయి.అడుగుకో గుంత ఏర్పడి వర్షం నీరు నిలిచి ప్రజలు వాహన దారులు వెళ్ళడానికి నానా అవస్థలు పడుతున్నారు.పేరుకే మున్సిపాలిటీ అందునా జిల్లా కేంద్రం అయివుండి కూడా అంతర్గత రోడ్లు అధ్వా న్నంగా ఉండడం శోచనీయ మని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లు ఎస్పి కార్యాలయం నుంచి వీర సావర్కర్ చౌరస్తా అక్కడి నుంచి చిన్న పిల్లల ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి నుంచి పళ్ళా బ్రిడ్జి వరకు రోడ్లు అధ్వాన్నంగాఉన్నాయి.రోడ్డుపై నీరు నిలిచి ప్రధానంగా ఆస్పత్రుల ముందు దుర్వాస నతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.అలాగే ప్రధానమైన సరాఫ్ బజార్ నుంచి శివాజి నగర్ పళ్ల బ్రిడ్జి వరకు రోడ్డు అధ్వాన్నంగా మారి గుం తలు ఏర్పడి పజలు నానా అవస్థలుపడుతున్నారు. కాగా బహార్ పేట,పళ్ల,సింగార్ బేస్,అశోక్ నగర్ శ్రీనగర్ కాలని,పళ్ల,హరిజన వాడతో పాటు అన్ని వార్డుల్లో అంత ర్గత రోడ్లు అధ్వాన్నంగా తయారై ప్రజలుఇబ్బందులకు గురవుతున్నారు.గత పాలకు లు,అధికారుల నిర్లక్ష్యంతో రోడ్లు అధ్వాన్నంగా తయారై మరమ్మతులకు నోచుకోక అవస్థలు పడాల్సి వస్తోందనీ ప్రజలు వాపోతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలనీ ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

## అధికారులు నిర్లక్ష్యం వీడాలి



నారాయణపేట పట్టణంలో కురుస్తున్న చిన్నపాటి వర్షా లకే రోడ్లు అధ్వాన్నంగా తయారైనాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలనీ బిజెపి పట్టణ అధ్యక్షుడు పి.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.గత పాలకుల అవినీతి వల్ల రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని విమర్శిం చారు.దానికి తోడు అధికా రులు నిర్లక్ష్యంగా వ్యవహరిం చడాంతో కనీస మరమ్మ తులకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ ఆవేదనవ్యక్తంచేశారు.పట్టణంలో మిషన్ భగీరథ పైప్ లైన్ పనులు చేసి మరమ్మతు లు చేయక పోవడంతో గల్లిల్లో రోడ్లు అధ్వాన్నంగా మారి ప్రజ లు ఇబ్బందులు పడుతున్నా రన్నారు.వెంటనే పట్టణంలోని అంతర్గత రోడ్లు మరమ్మతులు చేయాలని జిల్లా కలె క్టర్ దృష్టి సారించాలనీ కోరారు.

**బిజెపి పట్టణ అధ్యక్షుడు వినోద్**

# గురుకులాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 5 (జనం సాక్షి) :** గురుకుల పాఠ శాలలు, కళాశాలలో విద్యార్థు లకు సరైన వసతి సౌకర్యా లను కల్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం చౌరస్తాలో గల గురుకుల బాలుర పాఠశాల, కళాశాల (దామరగిద్ద)ను ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు,ఉపాధ్యాయుల సంఖ్యా వివరాలను అడిగి తెలుసుకున్నారు.రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలో ప్రస్తుతం ఉన్న వసతులు, అవసరమైన సౌకర్యాల గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. అవసరమైన వసతి, సౌకర్యాల గురించి నివేదిక ఇవ్వాలని ఆదేశిం చారు.పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు.కార్య క్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత, వసతులపై నిరంతర నిఘా ఉంచాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**పటాన్‌చెరు, జూలై 5 (జనం సాక్షి) :** పటాన్చెరు మండలం, ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, హాస్టళ్ల పరిశుభ్రత, ఆహార నాణ్యత, బోధన విధానాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతోమాట్లాడారు. సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలు స్వయంగా తెలుసుకున్నారు.భవిష్యత్తు బాగుండాలి అంటే బాగా చదవాలి అన్నారు.విద్యార్థుల భద్రత, మౌలిక వసతుల మెరుగుదల కోసం నిరంతరం నిఘా ఉంచాలని, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా టాయిలెట్లు, భోజన శాల, వసతిగృహాలను పరిశీలించి అవసరమైన అభివృద్ధి పై అధికారులకు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా భద్రంగా ఉండేలా పాఠశాల వాతావరణం ఉండాలన్నారు. అధ్యాపకులు ఎప్పటికప్పుడు విద్యార్థులతో మాట్లాడుతూ వారిని పరిశీలిస్తూ ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పురాతనమైన మర్రి, తాటిచెట్లు నరికేసిన వ్యక్తులపై చర్యలు తప్పవు

- మేడ్చల్ జిల్ల అటవీ అధికారి రేణుక



**కాప్రా, జూలై 5 (జనం సాక్షి) :** జీవరాశులకు ఆవాసంగా ఉన్న వంద ఏళ్ళ నాటి పురాతనమైన మర్రి మహా వృక్షం చెట్టును నరికేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా అటవీ అధికారి రేణుక స్పష్టం చేశారు. కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్ లో నరికివేతకు గురైన ఏళ్ల కాలం నాటి మర్రి మహావృక్షాన్ని శనివారం జిల్లా అటవీ డిప్యూటీ రేంజర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా అటవీ అధికారి రేణుక సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహా మర్రి వృక్షం నరికివేతతో పక్షులు చనిపోయిన విషయాన్ని గుర్తించామన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి సంతకాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, శివ సాయి నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కొండగళ్ల అశోక్ బింగి భిక్షపతి గౌడ్, కందుల సత్యనారాయణ, షాబాద్ దామోదర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సరికొండ రమేష్, సత్యనారాయణ, గోపాలకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద




**కుత్బుల్లాపూర్, జూలై 5 (జనం సాక్షి) :** విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే విద్యతో పాటు ఏఐ, రోబోటిక్స్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ మార్గ్ లో గల చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ప్రగతి గదులను డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ నేటి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక అవగాహన పెంపొందించాలని సూచించారు. విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పాఠశాలలో విద్యాబోధన జరగాలని అభిప్రాయపడ్డారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్న చైతన్య విద్యానికేతన్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా విద్యాధికారిని ఐ విజయ్ కుమారి, క్రిస్మస్ రాష్ట్ర అధ్యక్షులు, చైతన్య స్కూల్ చైర్మన్ శివరాత్రి యాదగిరి, ప్రెస్ మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జే నాగరాజు, కోశాధికారి పరుశు రాం గౌడ్, శ్రీనివాసచారి, నర్సిరెడ్డి, శ్రీకాంత్, సుశీల్ కుమార్, కాశిరెడ్డి, సుబ్రహ్మణ్యం, షోయబ్, అంజన్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, దన్నాగర్, చిరుత డివిజన్ వి ఆర్ ఎస్ అధ్యక్షులు రుద్రా అశోక్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల ఆకస్మిక తనిఖీ

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కౌడిపల్లి, జూలై 5 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల బిసి సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను తెలంగాణ రాష్ట్ర గిరిజన బాలికల మినీ గురుకులం, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర అప్ గ్రేడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను సంబంధిత ప్రిన్సిపాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ అన్ని రెసిడెన్షియల్ గురుకులాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా, మౌలిక సదుపాయాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టితో ఈ తనిఖీలు చేపట్టామన్నారు. తరగతిగదుల్లో విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. అలాగే డార్మెటరీలు, అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలో నూతన మరుగుదొడ్లు నిర్మించేందుకు టాయిలెట్లు తదితర వసతులపై ఆరా తీశారు. అవసరమైన అభివృద్ధి పనులపై అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థుల భద్రత, అభ్యాసం, మౌలిక వసతుల మెరుగుదల కోసం తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, మెరుగైన సౌకర్యాల కల్పనకు సర్వే రిపోర్ట్ ను ప్రభుత్వానికి నివేదిస్తాం అని తెలిపారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు,



అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గదిలో చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడారు. "మీరు ఎలా చదువుతున్నారు?", "ఇక్కడ సౌకర్యాలు సరిపోయాయా?", "అధ్యాపకులు పాఠాలు బాగా చెప్తున్నారా?" వంటి ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు, విద్యార్థిని విద్యార్థులకు "మీరు దేశ భవిష్యత్తు. మీరు బాగా చదవాలి. ఏ సమస్యైన ధైర్యంగా చెప్పాలని, నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

# హబ్సిగూడలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఆవిష్కరణ

**ఉప్పల్, జూలై 5 (జనం సాక్షి) :** దార్శనికుడు, దేశంలో సమసమాజ స్థాపనకు కృషి చేసిన స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నేటి తరానికి ఆదర్శప్రాయుడని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. హబ్సిగూడ చౌరస్తా లో ఏర్పాటుచేసిన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహా ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ బాబూజీ అని ప్రేమగా పిలుచుకునే బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర సంగ్రామం తో పాటు, తదనంతరం ఏర్పడిన ప్రభుత్వాలలో మంత్రిగా పనిచేసి ఉత్తమ పరిపాలనదక్షుడిగా ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. ప్రధానంగా దేశంలోని షెడ్యూలు కులాలు, అనగారిన బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారని



కొనియాడారు. నేటితరం యువతరానికి, ప్రజాప్రతినిధులకు జగ్జీవన్ రామ్ ఆదర్శప్రాయుడని అన్నారు. అంతటి మహనీయుని విగ్రహం ఆవిష్కరణలో పాల్గొనడం తన అదృష్టమని అన్నారు. అనంతరం జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ అధ్యక్షులు గన్నారం విజయ్ కుమార్ ,ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్,మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ రెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు చింతల బాబు, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ నాయకులు హెచ్ ఆర్.మోహన్ ,డివిజన్ ప్రధాన-కార్యదర్శి ధర్మేంద్ర నాయక్(ధర్మా) ,హబ్సిగూడా డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసు నాయక్ , ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజన్న, ధర్మారాజు, రాజు, సాయి కిరణ్, విశాల్, జవీధ సాయి, తదితరులు పాల్గొన్నారు.

# త్యాగాల స్మరణం.. మొహర్రం..!

- ప్రారంభమైన మొహర్రం కార్యక్రమాలు
- మతసామరస్యానికి ప్రతీక మొహారం
- ఇస్లాంలో క్యాలెండర్‌లో మొట్టమొదటి నెల మొహర్రం
- ప్రవక్తల త్యాగాలను స్మరించుకోనున్న ముస్లింలు
- జిల్లా వ్యాప్తంగా నెడు మొహర్రం వేడుకలు



సంగారెడ్డి ప్రతినిధి, జూలై 5 (జనం సాక్షి) : ఇస్లాంలో న్యాయం, ధర్మం, సత్యం, త్యాగానికి ప్రాధాన్యత అధికం. ముస్లింలు దుదినాలు పాటించే మొహర్రం నెల ప్రవర్థం త్యాగనిరతికి ప్రతీకగా నిలుస్తుంది. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రంను ముస్లింలు వేడుకగా కాకుండా, సంతాప దినాలుగా, ప్రాణత్యా గాలు చేసిన ప్రవక్తలను స్మరించుకుంటూ. ప్రాపంచిక సుఖ సంతోషాలకు దూరంగా గడపటం మహనీయుల పట్ల వారికి ఉన్న భక్తిభావాలకు నిదర్శనం.సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మొహరం పండగ ఏర్పాటు పూర్తి చేశారు.

## ధర్మం, సత్యం కోసం..

మొహర్రం నెలలో యూప్రటీస్ నది ఒడ్డున కర్బలా మైదా సంలో ఇమామ్ హుసైకు, దుష్ట యజీద్ కు యుద్ధం జరిగింది.. యజీద్ కు సమానమైన బల సంపత్తి లేనప్పటికీ, ధర్మం, సత్యం, న్యాయాన్ని కాపాడేందుకు ఇమామ్ హుసైన్ తప్పనిసరి పరిస్థితుల్లో యుద్ధానికి తలపడతారు. హుసైన్ అనుచరులు, కుటుంబ సభ్యులు. సైనికులు యుద్ధంలో అసువులు వస్తారు. మహమ్మద్ ప్రవక్తకు ప్రతిరూపంలొ భక్తులు భావించి దర్శించుకునే హజరత్ అలీ అక్బర్ (హుసైన్ కుమారుడు), ఇమామ్ హసన్ 13 ఏళ్ల కుమారుడు హజర్ ఖాసీంలు యుద్ధంలో పోరాడి అమరులవుతారు. హుసైన్ తన ఆవేళ్ల కుమార్తె సకీనా దాహం తీర్చేందుకు హజరత్ అబ్బాస్ కు నదితీరా నికి పంపగా, పొదల చాటు నుంచి అబ్బాను యజీద్ సైన్యం అంతం చేస్తుంది. హజరత్ హుసైన్ చిన్నకుమారుడు ఆరు నెలల వయసున్న హజరత్ అలీ అస్గర్ ఏడురోజులుగా అన్నపానీయాలు లేక దాహంతో విలవిల్లాడుతుండగా 10వ రోజు తల్లిపాలు సైతం ఇంకిపోయిన దశలో తల్లి ఒడిలో రోదిస్తుండగా, పసికందును సైతం యజీద్ సైన్యం హతమార్చుతుంది. ఆ పసికందు కంఠం నుంచి కారుతున్న రక్తం భూమిపై పడబోతుండగా భూమి ఒక్కసారిగా ప్రతిధ్వనించి “హుసైన్ ఏ పాపం ఎరుగని ఆ పసికందు రక్తం నాపై పడితే ప్రపంచం అంతమయ్యేంత వరకు ఏ విధమైన ఆహార ధాన్యాలు నానుండి మొలకెత్తవు’ అని చెబుతుంది. ఆ రక్తాన్ని ఆకాశంవైపు వేయబోగా ఆకాశం కూడా ప్రతిధ్వనించి ఈ పసికందు రక్తం నావైపు వస్తే ప్రపంచం అంతమయ్యేంత వరకు నా నుంచి ఒక్క వర్షపు జల్లు కూడా కురవడు’ అని చెబుతుంది. నింగి, నేల నిరాకరించిన రక్తాన్ని ఇమామ్ హుసైన్ తన ముఖానికి పూసుకుంటారు హుసైన్ మొహర్రం నెల 10వ రోజు యుద్ధ విరామంలో ప్రార్ధనకు మోకరిల్లిన సమయంలో యజీద్ సైన్యం శిరస్సు ఛేదించి హతమార్చుతుంది. న్యాయం, ధర్మం పరిరక్షించేందుకు దైవం చూపిన మార్గంలో పయనించి రక్తం ధారపోసి ప్రాణాలు అర్పించిన హుసైన్ హసైన్‌ల త్యాగనిరతికి షియాలు రక్తతర్పణం కావించటం, సున్నీలు నిప్పులపై నడవటం ద్వారా వారి త్యాగాలను స్మరించుకుంటారు.

## క్యాలెండర్ రూపకల్పన..

ఇస్లామిక్ నెలల పేర్లు ముహమ్మద్ ప్రవక్త కంటే ముందే ప్రాచుర్యం పొందాయి. ముందు నుంచీ నెలల సంఖ్య పన్నెండే అని ఖురాన్ చెబుతోంది. కాకపోతే హజ్రత్ ఉమర్ (రజి) కాలంలో నూతన క్యాలండర్ ను రూపొందించే యోచన వచ్చింది. ప్రవక్త మహనీయులు (న అసం) మక్కా నుంచి మదీనాకు వలస వెళ్లిన ఏడాదిని మైలురాయిగా చేసుకొని నూతన క్యాలండర్లు రూపొందించారు. హిజ్రత్ కు ముందు సంవత్సరాలను శూన్యంగా పరిగణించి హిజ్రత్ చేసిన ఏడాదిని మొదటి సంవత్సరంగా పరిగణించారు. మొహర్రాన్ని మొదటి నెలగా నిర్ణయించారు. ఇంగ్లీషు క్యాలండర్ ప్రకారం ఏడాదిలో 365, 364 రోజులుంటాయి. కానీ హిజ్ క్యాలండర్ ప్రకారం ఏడాదిలో 354, 355 రోజులుంటాయి.. ప్రతీ నెలలో 29, 30 రోజులు. ఇస్లామిక్ నెలలన్ని నెలవంక దర్శ సంతోనే ప్రారంభమవుతాయి.

## బాసికం ఊరేగింపు..

మొహర్రం కార్యక్రమాలలో తొమ్మిదవ రోజుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆరోజు ఉదయం నుంచి మొక్కుబడులు ఉన్నవారు గంధం పీరు మకాన్ కు వచ్చి లంగర్లు సమర్పిస్తారు. తమ కోర్కెలు తీర్చాలని పీరును ప్రార్థిస్తారు. సంతానం పొందిన వారు మొక్కుబడులు చెల్లించు కుంటారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక పోతే ఎంతో ముఖ్యమైన గంధం పీరు బాసికం ఊరేగింపు కార్యక్రమం ఆరోజు రాత్రి ప్రారంభమవుతుంది. కళ్లు మిరిమిట్లు గొలిపేలా వివిధ రకాల బాణాసంచా పేలుళ్లు ఎంత గానో అలరిస్తుంది. పెద్ద పులుల వేషధా రణలు నిర్వహించే ప్రదర్శన ప్రత్యేక ఆక ర్షణగా నిలుస్తుంది. ఎంతో పవిత్రంగా భావించే బాసిక ఊరేగింపును తిల కించేందుకు జనం ప్రవాహంలా తరలివస్తారు. తెల్లవారుజామున గంధం పీరును ఊరేగిస్తారు

## ఆకట్టుకునే విద్యుత్ దీపాలంకరణ..

కళ్లు జిగేలుమనే వివిధ రకాల విద్యుత్ దీపాలను ఊరు ఊరంతా ఏర్పాటు చేస్తారు. పీర్ల మకాన్లను వివిధ రకాల అలంకారాలతో శోభాయమానం గా తీర్చిదిద్దుతారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చే బంధువులు, స్నేహితులు, పిల్లలతో ఇళ్లన్నీ కళక ళలాడుతుంటాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులతో ఊరంతా నిండిపోతుంది. ఎటుచూసినా బత్తిరాసాలు, మిఠాయి, బూంది, వంటి తినుబండారాల వెలుస్తాయి. పిల్లలకు సంబంధించిన బొమ్మలు, వివిధ రకాల ఆట వస్తువులు, రంగుల రాట్నాలు వంటివి ఎన్నో ఆకర్శిస్తాయి. ప్రతిరోజు నిర్వ హించే ఎన్నో విచిత్ర వేషధారణలు జనాన్ని విశే షంగా ఆకట్టుకుంటాయి. జిల్లా వ్యాప్తంగా మొహరం వేడుకలు..

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొహరం వేడుకలకు నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముక్యంగా జిల్లాలోని సదశివాపేట, కోహిర్, జహీరాబాద్, న్యాల్కల్, మునిపల్లి, నారాయణఖేడ్, జోగిపేట,పుల్కల్, వట్పల్లి, సంగారెడ్డి, కొండాపూర్, పఠాన్ చెరువు, నిజాంపేట్ తదితర మండలాలలో మొహరం వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

# ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాన్ని సాధించాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 5 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లాకు 2025 - 26 ఆర్థిక సంవత్సరా నికి గాను ఆయిల్ ఫామ్ సాగు కోసం నిర్దేశించిన 3500 ఎకరాల లక్ష్యాన్ని ఉద్యాన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధి కారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సమ న్వయంతో రైతులను గుర్తించి లక్ష్యసాధ నకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉద్యాన శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయిల్ ఫామ్ సాగుపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాకు నిర్దేశించిన 3500 ఎకరాల కు ఇప్పటి వరకు 54 ఎకరాలలో ఆయిల్ ఫామ్ తోటలను నాటడం జరిగింద ని తెలిపారు. ఆయిల్ ఫామ్ తోటల సాగుపై రాష్ట్ర ప్రభు త్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తే రాష్ట్రస్థాయి ఉన్నత అధి కారులు ఎప్పటికప్పుడు సమీ క్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాన్ని సాధిం చేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులను గుర్తిం చడంతోపాటు వారికి ఆయిల్ ఫామ్ తోటల సాగుతో వచ్చే లాభాల గురించి అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఒక్కో మండల వ్యవసా య అధికారికి 50 ఎకరాల టార్గెట్‌ను కలెక్టర్ నిర్దేశించారు. ఉద్యాన శాఖ పథకం అనుసంధానంతో మొక్కల సరఫరా, మొదటి 4 సంవత్స రాల అంతా పంటలకు, రసాయన ఎరువులకు సబ్సిడీ ఉంటుందని ఆమె చెప్పారు. వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ అధికారులు సమన్వ యంతో పనిచేసి వారానికి మూడు రోజుల చొప్పున రైతు వేదికలలో సమావేశాలు ఏర్పాటుచేసి రైతుల వద్ద నుంచి మొక్కలు, డ్రిప్ కొరకు రైతు వాటా డీ డీ కట్టించి జిల్లాకు కేటాయించిన ఆయి ల్ ఫామ్ తోటల సాగు లక్ష్యా న్ని వంద శాతం పూర్తి చేయా లని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు రామలక్ష్మి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ నుండి ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జిల్లా ఉద్యానవన పట్టు పురుగుల పెంపకం అధికారి సాయి బాబా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాక ర్,వ్యవసాయ శాఖ డీ డీ రాజరత్నం,అన్ని మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు, విస్తరణ అధికారులు, ఆయిల్ ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- మాగనూర్‌లో ఆటో డ్రైవర్ల ర్యాలీ




మాగనూర్, జూలై 5 (జనం సాక్షి) : ఆటో డ్రైవర్ సంక్షేమాన్ని కాపాడేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వహామీ మేరకు 12వేలు అర్థిక భృతి ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మండల తహాసిల్దార్ కార్యాల యం ముందు ధర్నా చేశారు. ధర్నా కార్యక్రమానికి సిఐటి యు జిల్లా ఉపాధ్యక్షులు పుంజనూర్ ఆంజనేయులు అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం, జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్రాజ్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం వలన ఆటో డ్రైవర్స్ తీవ్ర నష్టపోతున్నా రని ఆటో డ్రైవర్స్ కు ప్రభు త్వ హామీ మేరకు సంవత్సరానికి 12 వేల రూపాయల ఆర్థిక భృతి అందివ్వాలని డిమాండ్ చేశారు. పెరుగు తున్న పెట్రోల్, డీజిల్ ధరల వల్ల ఆటోల ద్వారా వచ్చే సంపాదన కుటుంబ పోషణ కు సరిపోవడం లేదని ఆందోళ న వ్యక్తం చేశారు. పెరుగు తున్న ధరలకు అనుగుణంగా కనీస అవసరాలు తీర్చుకోలే ని దుస్థితిలో ఆటో డ్రైవర్స్ ఉన్నారని అన్నారు.ఆర్టిఓ అధికారుల ,పోలీసు అధికా రుల వేధింపులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వేధింపులను ఆపాలన్నారు, ఆటో డ్రైవర్స్ కు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవే ర్చాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామనిహెచ్చరించారు . అనంతరం వివిధ డిమాండ్లతో వినతి పత్రాన్ని మండల తహాసిల్దార్ నాగలక్ష్మి కి అంద జేశారు.ఈ ధర్నాలో ఆటో యూనియన్ నాయకులు దండుబస్వరాజ్, రాజెందర్ గౌడ్, నామలి తిమ్మప్ప,డబ్బుడు వాబ య్య, దబ్బుడు శ్రీకాంత్, మేకలి వెంకటేష్, జంగిటి శ్రీకాంత్,డబ్బుడు శ్రీకాంత్, కె రవి ,భీమరాజ్, కుమ్మరి నర్సింలు, బల్దాస్ నరేష్, సగరం మారె ప్ప తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పెన్షన్ మంజూరు చేయాలి

**వికలాంగుల కార్పొరేషన్ బలోపేతం చేయాలి**

**వికలాంగుల హక్కుల జాతీయ వేదిక**




కృష్ణ, జూలై 5 (జనం సాక్షి) : వికలాంగులకు రావాల్సిన పెండింగ్ పింఛన్లు మంజూరు చేయాలని, వికలాంగుల కార్పొరేషన్ ను బలోపేతం చేయాలనీ, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కృష్ణ మండల అద్యక్షుడు కె కృష్ణ,ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం కృష్ణ మండల తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులు ఉన్నారనీ వికలాంగుల అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారనీ అన్నారు. చేయూత పెన్షన్ కోసం 24.85 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారనీ కానీ పెన్షన్ మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల కార్పొరేషన్ ను బలపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకునీ ప్రతి జిల్లాలో టిసిపిసి కేంద్రాల ను ఏర్పాటు చేయాలని కోరా రు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ తెలంగాణ మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేటివ్ చట్టాలను సవరణ చేసి స్థానిక పంచాయతీ మండల జిల్లా పరిషత్ మున్సిపాలిటీలలో వికలాంగుల ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రాతినిథ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నారు, అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో చట్టం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో. కే కృష్ణ ఎన్ పిఆర్ డి కృష్ణ మండల అధ్యక్షుడు, ఎస్ వెంకటేష్ మండల కార్యదర్శి, చంద్రశేఖర్ కోశాధికారి, హనుమంతు కమిటీ సభ్యులు, హేమలత, జగదీష్ ,తిమ్మప్ప, అంజప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

# నెరవేరనున్న లింగాయత్‌ల కల

- నేడు లింగాయత్ భవన నిర్మాణానికి భూమి పూజ
- హాజరు కానున్న ప్రముఖులు
- సమాజం జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు



సంగారెడ్డి, జూలై 5 (జనం సాక్షి) : గత కొన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న లింగాయత్ భవన నిర్మాణ కల నెరవేరనుంది. ఈనెల 6 ఆదివారం సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని కాశీపూర్‌లో లింగాయత్ భవన నిర్మాణానికి భూమి పూజ చేనున్నారు. ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా శనివారం సంగారెడ్డిలో వీరశైవ లింగాయత్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న లింగాయత్ భవన నిర్మాణానికి ఈనెల 6 ఆదివారం భూమి పూజ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ , జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డిలకు ఆహ్వానించినట్లు తెలిపారు వారి తో పాటు రాజకీయ ప్రజాప్రతినిధులు , వీరశైవ లింగాయత్ సమాజం పెద్దలు హాజరుకానున్నట్లు తెలిపారు. లింగాయత్ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి జిల్లాలోని వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు, మహిళా నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు, కార్యనిర్వాహక అధ్యక్షులు పట్లోల చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ నాగరాజు, అంతప్ప గూడెం శివకుమార్, సూపరిడెంట్ పట్లోల అశోక్, యువజన అధ్యక్షులు బుగనగారి మల్లికార్జున్, నవీన్ రామోజీ, మహిళ అధ్యక్షురాలు పట్లొల్ల అరుణ , కార్యదర్శి గొర్రెగట్టు శారద తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో మారిన మార్కెట్ యార్డ్ రూపురేఖలు

- గత ప్రభుత్వంలో మార్కెట్ యార్డులు నిర్వీర్యం
- రెండోసారి రైతులకు సేవ చేసే భాగ్యం నా అదృష్టం
- మార్కెట్ పాలకవర్గం వార్షికోత్సవ వేడుకల్లో చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



వనపర్తి బ్యూరో, జూలై 5 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు మార్కెట్ యార్డుల రూపు రేఖలు మార్చడం జరిగిందని గత టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మార్కెట్ యార్డులు నిర్వీర్యం అయ్యాయని వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ గా తనకు రెండోసారి అవకాశం రైతులకు సేవ చేసే భాగ్యం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం వనపర్తి మార్కెట్ యార్డు పాలకవర్గంవార్షికోత్సవ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మార్కెట్ యార్డ్ పాలక వర్గ సభ్యులను రైతులు. మార్కెట్ యార్డ్ వ్యాపారస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2007 నుంచి 2010 వరకు మార్కెట్ కమిటీ చైర్మన్ గా పని చేయడం జరిగిందని తిరిగి ఇటీవల వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి చొరవతో రెండవసారి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా తాను బాధ్యతలు స్వీకరించడం రైతులకు జీవితాంతం రుణపడి పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రైతు సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి రైతుల సంక్షేమం కోసం 80,000 కోట్ల రూపాయలను రుణమాఫీ. రైతు భరోసా. వరి ధాన్యం కొనుగోలు. ఇతర అవసరాలకు ఖర్చు పెట్టిన ఏకైక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో మిగిలిందని అన్నారు. వనపర్తి మార్కెట్ యార్డ్ కమిటీ ఏర్పడి సంవత్సరకాలం పూర్తవుతున్న సందర్భంగా ఈ వార్షికోత్సవమని జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా తాను బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఆవిష్కృతంగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పెండింగ్ లో ఉన్న అనేక సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడం జరిగిందని మార్కెట్ యార్డులో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రైతులకు పూర్తి రక్షణ కల్పించడం జరుగుతుందని అదేవిధంగా రైతుల కోసం త్రాగునీటి సౌకర్యం మరుగుదొడ్లు. ఇతర వసతులను కల్పిస్తూ మార్కెట్ యార్డులో అధ్వానంగా ఉన్న సిసి రోడ్లు ప్లాట్ ఫారాలు నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం అసమర్థత వల్ల మార్కెట్ యార్డులో వర్షపు నీరు నిండుకొని రైతులు పండించిన పంట నీటిపాలు అయిందని ఈ విషయంపై చైర్మన్ తన బాధ్యతను నిర్వర్తిస్తూ వర్షపు నీరు నిల్వ లేకుండా గుంతలు గుంతలు ఉన్న మార్కెట్ యార్డ్ ప్రాంతం సుందరవణంగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం మార్కెట్ యార్డ్ నిర్మాణం కోసం 43 కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని దీనితోపాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం 9.50 లక్షల కోట్లు గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసి అప్పు చేసిందని ఆరోపించారు. రైతుల సంక్షేమం కోసం మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా తాను శక్తి వచ్చిన లేకున్న కృషి రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తూ రైతులు పండించిన పంటకు బాధ్యత భరోసా కల్పిస్తూ మార్కెట్ యార్డులో తగిన వసతులతో పాటు గిట్టుబాటు ధర. వరి ధాన్యానికి బోనస్ చెల్లించడం ధాన్యము కొనుగోలు కేంద్రాల పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి. పాలకవర్గ సభ్యులు. కొత్త గొల్ల కృష్ణయ్య. చీపుర్ల శ్యాంసుందర్ రెడ్డి. రాములు నాయక్. గోపాల్ నాయక్. ఉమేష్ కుమార్. సురేష్ ఆగు పోగుల. లతీఫ్ హుద్దీన్. బండారు రాజేందర్. సదుర్ల శారద. తోపాటు వనపర్తి మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకులు బి. కృష్ణ. కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకుల సతీష్. దళిత నాయకుడు వెంకటేష్. కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ధనలక్ష్మి.ఎస్ ఎల్ ఎన్. రమేష్. యాపర్ల రాంరెడ్డి. మాజీ కౌన్సిలర్ బ్రహ్మం. కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్. కాంగ్రెస్ పార్టీ నాయకులు అచ్యుతాపురం తిరుపతయ్య. రైతులు వ్యాపారస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 48 మంది లబ్దిదారులకు 22 లక్షల రూపాయల చెక్కుల పంపిణీ



పటాన్‌చెరు, జూలై 5 (జనం సాక్షి) : నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిది ఆపన్నహస్తంగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, డివిజన్లకు సంబంధించిన 48 మంది లబ్ధిదారులకు మంజూరైన 22 లక్షల 10 వేల రూపాయల విలువైన చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డిసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్ రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ప్రమోద్ గౌడ్, వెంకటేష్, ఆంజనేయులు, జనార్ధన్, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నకిలీ పత్రాలు, నకిలీ స్టాంపులు తయారు చేస్తున్న

# కుంభకోణం గుట్టురట్టు

**కంప్యూటర్, స్కానర్, హార్డ్ డిస్క్‌లు స్వాధీనం**




**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి):** ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ పలు శాఖలకు సంబంధించిన నకిలీ పత్రాలు, నకిలీ స్టాంపులు తయారు చేసే తండ్రీకొడుకుల పై జిల్లా పోలీస్ యంత్రాంగం పక్క సమాచారంతో దాడి చేసి వారి నకిలీ దందాలను గుట్టు రట్టు చేశారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో వారిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏ1 లద్వే రాహుల్ కుమార్ కొన్ని నెలలుగా ఆదిలాబాద్ పట్టణంలోని వివిధ శాఖలకు సంబంధించిన టువంటి పత్రాలను స్టాంపులను నకిలీవి సృష్టించి ప్రజలను మోసం చేస్తున్న సందర్భంలో పక్కా సమాచారంతో గత రాత్రి ఇంటి పై దాడి చేసి పలు పత్రాలను, స్టాంపులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ కు సంబంధించినటువంటి సర్వే నెంబర్ 170 లోని ప్లాటు పత్రాలను మండల రెవెన్యూ అధికారి కేటాయించినట్లుగా పత్రాలను సృష్టించారని తెలిపారు. మున్సిపాలిటీ కి సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ పత్రాలను సృష్టించడం అదేవిధంగా పోలీస్ డిపార్ట్మెంట్ కు సంబంధించినటువంటి ఆర్టీవో వాహన రిలీజ్ పత్రాన్ని సృష్టించడం ఆధార్ కార్డులను నకిలీ వి సృష్టించడం గ్రామపంచాయతీ కార్యాలయం నుండి బిల్డింగ్ పర్మిషన్లను సృష్టించడం మున్సిపల్ కౌన్సిల్ ద్వారా 1991 వ సంవత్సరం లో ఇతరులకు కేటాయించి నట్టు గా ఉండే నకిలీ ప్రొసీడింగ్ పత్రాలను సృష్టించడం. వివిధ హాస్పిటల్ కి సంబంధించినటువంటి నకిలీ డాక్యుమెంట్లను స్టాంపులను తయారుచేసి ప్రభుత్వం ద్వారా లబ్ధిని పొందడం. అంతే కాకుండా నకిలీ బర్త్ సర్టిఫికెట్లు, డెత్ సర్టిఫికెట్లను సృష్టించడం. ఆర్టీవో ద్వారా వెహికల్ రిలీజ్ సర్టిఫికెట్లను సృష్టించడం. నకిలీ వివాహ సర్టిఫికెట్లను సృష్టించడం. మహాలక్ష్మి మాన్ పవర్ అండ్ ప్లేస్మెంట్స్ సర్వీసెస్ ద్వారా నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇలా అనేకం నకిలీవి తయారు చేయడం జరిగిందన్నారు. వీరి వద్ద నుండి నకిలీ స్టాంపులు, స్టాంపులకు తయారుచేసే రసాయనాలు, ఎక్రేస్ పేపర్లు, స్టాంపుల పరికరాలు, కంప్యూటర్, హార్డ్ డిస్క్‌లు, వివిధ జిల్లాల్లో వివిధ శాఖలక సంబంధించినటువంటి తయారు చేసిన నకిలీ స్టాంపులు, అధికారుల సంతకాలతో కూడిన నకిలీ స్టాంపులు, నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పత్రాలను సృష్టించి నిజమైన భూ యజమానులకు మరియు నకిలీ యజమానులకు మధ్య గొడవలు వచ్చే విధంగా పత్రాలను సృష్టించడం జరిగిందని తెలిపారు. నకిలీ పత్రాలు ద్వారా ప్రభుత్వ స్కీములలో లబ్ధి పొందిన వారి వివరాలను సేకరించి, ప్రభుత్వ స్థలాలను నకిలీ పత్రాలను సృష్టించి కబ్జా చేసిన వారి వివరాలను పట్టుకోవడానికి ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. డాక్యుమెంట్ రైటర్ ముసుగులో ఫేక్ పత్రాలను తీసుకున్న వీరిపై కఠినమైన చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. దర్యాప్తులో పూర్తి వివరాలను విశ్లేషించి కుంభకోణంలో ఇతర వ్యక్తుల పాత్రపై విశ్లేషణ జరుగుతుందని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేసి ఫేక్ పత్రాలను ద్వారా లబ్ధి పొందిన వారిపై తగు చర్యలను తీసుకోబడతాయని తెలిపారు. ఈ కుంభకోణం బట్టబయలులో కీలక పాత్ర పోషించిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, వన్టౌన్ సీఐ బి సునీల్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ రూరల్, జూలై 5 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిదని మొక్కలు నాటి పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని పురస్కరిం చుకుని ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు శనివారం నిర్మల్ పట్టణంలోని దివ్య నగర్ పార్కులో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, మహిళలు, కాలనీ వాసులతో కలిసి జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరిది బాధ్యతగా మొక్కలు నాటడమే కాదు, వాటిని రక్షించడంలో కూడా ప్రతి ఒక్కరు చొరవ చూపాలని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ కోసం ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని, క్రమం తప్పకుండా నీరు పోయాలని, అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భాగ్యనగర్, శాంతినగర్ ప్రాంతాల్లోని పార్కులను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఉపయోగించని పార్కులను అభివృద్ధి చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి పి.రామారావు, నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, బైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, మెప్మా పీడీ సుభాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ కార్మికులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిది

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**





**సారంగాపూర్, జులై 5(జనం సాక్షి) :** వనమహోత్సవాన్ని పురస్కరించుకుని సారంగాపూర్ మండలంలోని చించోలి గ్రామ పంచాయతీలో శనివారం సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఇతర అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, మొక్కలు నాటడమే కాక, వాటిని పరిరక్షించడంలోనూ ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ కోసం ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ లక్ష్మీకాంతం, ఇతర అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## యువ కౌలురైతు ఆత్మహత్య

**భూపాలపల్లి, జూలై 5 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాచారం గ్రామానికి చెందిన యువ కౌలు రైతు బండారు దేవేందర్ అప్పుల బాధతో మందు తాగి ఆత్మహత్య చేసుకున్న దురదృష్టకర సంఘటన జిల్లాలో చోటు చేసుకుంది. బండారు దేవేందర్ తనకు ఉన్న నాలుగు ఎకరాల భూమిని అమ్మకాని పెట్టి అప్పులు తీరుస్తూ వచ్చారు. అయినా అప్పుల భారాన్ని తట్టుకోలేక చివరికి కౌలు వ్యవసాయంలో నష్టపోయి, ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది అని గ్రామస్తులు అన్నారు. వారి కుటుంబ సభ్యుల వివరాలు భార్య, ముగ్గురు పిల్లలున్నట్టు సమాచారం. కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, నాచారం గ్రామానికి వెళ్లి దేవేందర్ కుటుంబాన్ని పరామర్శించారు. దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందజేశారు. స్థానికులతో కలిసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ కుటుంబం ప్రస్తుతం ఎంతో కష్టాల్లో ఉంది. ఎవరైనా దాతలు ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో విష్ణు, సమ్మయ్య, సంపత్, భాస్కర్, పాల్గొన్నారు.

### ప్రదర్శనలో ప్రథమస్థానంలో నిలిచిన జాగిలం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగానికి చెందిన జాగిలం ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ నెల 2, 3 తేదీలలో రామగుండం కమీషనరేట్ పరిధిలో జరిగిన జోనల్ డ్యూటీ మీట్ లో జిల్లా పోలీస్ యంత్రాంగానికి చెందిన జాగిలం ఉత్తమ ప్రతిభ కనబరిచడంతో, జాగిలం బ్రేవో, దాని హేండిలర్ పి.రమేష్ లు స్టేట్ డ్యూటీ మీట్‌కు ఎంపికయ్యారు. పేలుడు పదార్ధాలను గుర్తించే విభాగంలో జోన్ -1లో ఈ జాగిలం ప్రథమ స్థానంలో నిలవడం పట్ల ఆపరేషన్స్ ఆర్ఐ కిరణ్ అభినందనలు తెలియజేశారు.

## సిర్పూర్ నియోజక వర్గానికి స్టడీ సర్కిల్ మంజూరు చేయిస్తా..!

**మంత్రి సీతక్క**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జులై 5 (జనం సాక్షి) :** సిర్పూర్ నియోజకవర్గం లో పేద విద్యార్థుల కోసం స్టడీ సర్కిల్ మంజూరు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. ఈ మేరకు శనివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాదులో మంత్రి సీతక్కను కలిశారు. చింతలమానే పల్లి మండలం డబ్బా గ్రామంలో జరిగిన బహిరంగ సభలో సిర్పూర్ నియోజకవర్గం లో బీసీ ,ఎస్టీ ,ఎస్సీ, మైనారిటీ విద్యార్థుల కోసం స్టడీ సర్కిల్ ను ఏర్పాటు చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. త్వరలోనే ప్రభుత్వ నుంచి స్టడీ సర్కిల్ ఏర్పాటు ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు వివరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని పటిష్టపరిచి మెజార్టీ స్థానాల్లో సర్పంచులు ,ఎంపిటీసీలు, జెడ్పిటిసిలు, మున్సిపల్ కౌన్సిలర్లను గెలిపించాలని నాయకులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు చేస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని గడప గడపకు తీసుకెళ్లి ప్రచారం చేయాలని మంత్రి కోరారు. మంత్రికి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ సిడాం గణపతి, కాగజ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గజ్జిరామయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్, బెజ్జూరు మండల అధ్యక్షులు రాచకొండ శ్రీ వర్ధన్, కొడప విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి గురైన సామాగ్రి ప్రత్యక్షం



**బెల్లంపల్లి, జులై 5 (జనంసాక్షి) :** బెల్లంపల్లి మండలం గురిజాల రైతు వేదికలో గురువారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్, సౌండ్ బాక్స్ లు చోరీకి గురైన విషయం విధితమే. కాగా చోరీ విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పోలీసులకు పిర్యాదు చేశారు. శనివారం ఉదయం రైతు వేదిక వద్దకు వచ్చి చూసే సరికి చోరికి గురైన మొత్తం సామాగ్రి దర్శనం ఇచ్చింది. చోరికి గురైన సామాగ్రి ప్రత్యక్షం కావడం వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. బెల్లంపల్లి రూరల్ సీఐ ఆఫ్జలోద్దీన్, తాళ్ల గురిజాల ఎస్సై రమేష్, బెల్లంపల్లి ఏడిఏ రాజ నరేందర్, బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్, ఏఈఓ కాసిపేట తిరుపతి రైతు వేదికను సందర్శించారు. రైతు వేదిక బయట వదిలిపెట్టిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్, సౌండ్ బాక్స్ లను పరిశీలించారు. తదుపరి దర్యాప్తు కొనసాగిస్తామని బెల్లంపల్లి రూరల్ సీఐ ఆఫ్జలోద్దీన్ తెలిపారు.

### పోడు రైతుల జోలికి వస్తే

## ఎంతకైనా తెగిస్తాం

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్**



**నెరడిగొండ జూలై5 (జనంసాక్షి):** పోడు భూములను సాగుచేస్తున్న అమాయక రైతులకు ఇబ్బందులు పెడితే సహించబోమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ పేర్కొన్నారు. శనివారం రోజున ఇచ్చొడ మండలంలోని కేశవ్ పట్నం, బాబ్జి పెట్ పోడు రైతులను అటవీ అధికారులు గత కొన్ని రోజులుగాఇబ్బందులు పెడుతున్న విషయం రైతులు ఎమ్మెల్యే అనిల్ జాధవ్ దృష్టికి తీసుకెళ్లారు. బాబ్జి పెట్ గ్రామానికి ఎమ్మెల్యే అనిల్ జాధవ్ స్వయంగా రైతులతో రోడ్డుపై బైఠాయించారు. కేసీఆర్ ప్రభుత్వమే రాగానే అందరికి పోడు పట్టాలు అందిస్తామని అన్నారు. పోడు రైతులను ఇబ్బందులు పెడితే సహించబోమని అవసరం అయితే రైతుల కోసం ఎంతకైనా తెగిస్తామని అన్నారు. వెంటనే రైతులను ఇబ్బందులు పెట్టడం మానేసి వెనక్కి వెళ్లిపోవాలని మందలించారు. అటవీ అధికారులు వినని యెడల రోడ్డుపైనే ఎమ్మెల్యే బైఠాయించారు. రైతుల కోసం రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యేపై పోడు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

**ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి జులై 5 (జనంసాక్షి) :** ప్రభుత్వ శాఖల అధికారులు ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి ఆయా కార్యాలయాల రిజిస్టర్లు, రికార్డులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరు పట్టికలు, ఆయా కార్యాలయాల పరిధిలో కొనసాగుతున్న పనుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు పనిచేస్తాయని, ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు ప్రజలకు చేరువలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, ఇబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారీగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# యూరియా కొరత రైతుల గోస

**రైతులను రోడ్డుకీడ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**ఎరువు ల కోసం పాదరక్షల లైన్**



**కొత్తగూడ జూలై 5 (జనంసాక్షి) :** సమైక్యాంధ్ర పాలన తలపిస్తున్న కాంగ్రెస్ పాలన.... సరిగ్గా 2014 ముందు రైతులు ఎరువుల కోసం చెప్పులు లైన్లో పెట్టిన దుస్థితి తెలిసిందే... ఎండ వాన అనే తేడా లేకుండా రైతు తన పొలం పని వదులుకొని లైన్లో ఉంటే గాని రెండు బస్తాలు ఇచ్చేవారు. అలాంటి రోజులు ఇదే పోగుళ్ళ పల్లి సొసైటీ గతాన్ని తలపిస్తుంది. ఇది వాస్తవం కాదా... ఆనాడు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ పాలనలో ఎరవుల కోసం చెప్పుల లైన్..నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన లో అదే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కనీసం రైతులకు ఎరువులు అందించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్ మండిపడ్డారు. రైతులను ధగ చేయడమే కాంగ్రెస్ పార్టీ ఎజెండాన అని ప్రశ్నించారు.

**అందరికి సరిపడా అందించాలని రైతుల వేడుకోలు...**

**చెన్నారావుపేట, జూలై 5(జనం సాక్షి):** యూరియా కోసం రైతులు బారులు తీరారు. శనివారం కోనాపురం సొసైటీ గోదాం వద్దకు లారీ యూరియా లోడ్ 444 బస్తాలు రావడంతో విషయం తెలుసుకున్న రైతులు గోదాం వద్దకు పెద్ద ఎత్తున చేరుకొని బారులు తీరి నిలబడ్డారు. దీంతో సొసైటీ ఫీల్డ్ ఆఫీసర్ ఒక్కొక్క రైతుకు రెండు బస్తాల చొప్పున అందించాడు. దీంతో యూరియా అందని రైతులు నిరాశతో వెనుదిరిగి వెళ్ళిపోయారు. యూరియా కొరత లేకుండా అందరికీ సరిపడా తెప్పించి అందించాలని రైతులు కోరుతున్నారు.

### ఈవీఎం గోదాములను పరిశీలించిన

# కలెక్టర్ డాక్టర్ సత్యశారద

**వరంగల్ ప్రతినిధి, జులై 5 (జనంసాక్షి):** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
06 జూలై 2025

# 11 కేజీల గంజాయి సీజ్

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- జిల్లా సీసీఎస్, కోదాడ రూరల్ పోలీసుల సంయుక్త రైడ్
- గంజాయి సరఫరా, అమ్మకం, వినియోగం చట్టరీత్యా నేరం

గంజాయిని రూపుమాపేందుకు కృషి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 5 (జనంసాక్షి) :** రూ.2.8 లక్షల విలువ గల 10 కేజీల గంజాయి, 2 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్న కేసు వివరాలను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పి నరసింహ వెల్లడించారు. ఈ కేసులో మొదటి నిందితుడైన అడప రాకేష్ ఇంటర్మీడియట్ చదివే సమయంలోనే తన స్నేహితుల ద్వారా గంజాయి సేవించడం అలవాటు చేసుకున్నాడని తెలిపారు. 2023వ సంవత్సరంలో కోదాడ రూరల్ పోలీస్ వారు ఇతని వద్ద గంజాయి పట్టుబడి చేసి కేసు నమోదు చేసి జైలుకు పంపించగా, జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత కొద్ది రోజులు గంజాయి సేవించడం మానివేశాడన్నారు. గత 10 రోజుల క్రితం కోదాడ రూరల్ పీఎస్ గంజాయి కేసులో వాయిదాకు హాజరుకావడానికి సూర్యాపేట కోర్టుకు వెళ్లగా అక్కడ కోర్టు వాయిదా గురించి ఒడిస్సా రాష్ట్రం నుండి వచ్చిన ఒక వ్యక్తి పరిచయమయ్యాడని, అతను కూడా గంజాయి కేసు వాయిదా గురించి వచ్చాడని తెలుసుకున్న తర్వాత రాజేష్ తనకు గంజాయి తాగటానికి, అమ్మటానికి కావాలని ఆతనిని అడగగా అతను జూన్ 29న ఒడిస్సా రాష్ట్రంలోని కలిమెళ్ళలో శివ మందిర్ గుడి వద్దకు రమ్మని చెప్పాడన్నారు. అతను చెప్పినట్లుగా జూన్ 28న రాజేష్ ఒడిస్సా లో అతను చెప్పిన అడ్రస్ కలిమెల శివ మందిర్ గుడి వద్దకు వెళ్ళి జూన్ 29న ఉదయం అతనిని కలిసి అతని వద్ద నుండి సుమారు 11 కేజీల గంజాయి 6 ప్యాకెట్లను రూ.11 వేలకు కొనుగోలు చేసుకొని అక్కడి నుండి జూన్ 30న దొరకుంట గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. ఈ గంజాయి తన ఇంట్లో పెడితే తన అమ్మ తిడుతుందని, పోలీసు వారు పట్టుకుంటారని గంజాయిని దొరకుంట గ్రామ శివారులో గల ఇండస్ట్రియల్ ఏరియాకి వెళ్ళే దారిలో ఐచర్ ట్రాక్టర్ షోరూం వెనుక ఖాళీ స్థలంలో చెట్ల పొదల మధ్య దాచిపెట్టినట్లు తెలిపారు. తరచూ గంజాయి కొనుగోలు చేసే రెండవ నిందితుడైన వనపర్తి సాయి కుమార్ కు ఈ నెల 2న ఫోన్ చేసి గంజాయి తీసుకొని వచ్చిన విషయం చెప్పాడన్నారు. ఈ నెల 4న మధ్యాహ్నం రెండవ నిందితుడైన వనపర్తి సాయి కుమార్ గంజాయి కొనుగోలు చేయడానికి రాగా వారిద్దరూ కలిసి గంజాయి దాచిన చోటుకు వెళ్ళి రాకేష్ అట్టి గంజాయిలో నుండి సుమారు ఒక కేజీ గంజాయిని వనపర్తి సాయి కుమార్ కు ఇవ్వగా, అదే సమయంలో పోలీసు వారు వారిద్దరినీ పట్టుబడి చేసి మొదటి నిందితుడైన ఆడప రాకేష్ వద్ద నుండి 5 ప్యాకెట్ల గంజాయి మొత్తం బరువు 9 కేజీల 900 గ్రాములు, ఒక సెల్ ఫోన్, రెండవ నిందితుడైన వనపర్తి సాయి కుమార్ వద్ద నుండి 925 గ్రాముల గంజాయి, ఒక సెల్ ఫోన్ ను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ గంజాయి విలువ సుమారుగా రూ.2.80 లక్షలు వరకు ఉంటుందన్నారు. వీరిని కోర్టు నందు హాజరు పర్చడం జరుగుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వం నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. దీని కోసం జిల్లా పోలీస్ శాఖ పటిష్టంగా పనిచేస్తుందని అన్నారు. గంజాయి రవాణా వినియోగం, అమ్మకం లాంటి కేసుల్లో ఉన్న వారి అందరికీ కౌన్సిలింగ్ లు ఇస్తున్నట్లు తెలిపారు. యువత దీని నుండి అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అలవాటు చేయాలని ప్రయత్నిస్తే అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని కోరారు. గంజాయి సరఫరా, వినియోగం, రవాణాకు పాల్పడుతున్న వారి సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని, ఇలాంటి వారిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, షీట్స్ ఓపెన్ చేసి నిరంతర నిఘా ఉంచుతామని తెలిపారు. ఈ స్పెషల్ టాస్క్ లో బాగా పని చేసిన సీఐ జి.రజితా రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ హరికృష్ణ, సిసిఎస్ సిబ్బంది శ్రీనివాస్, కరుణాకర్, ఆనంద్, మల్లేష్, సతీష్, శివ కృష్ణ, ప్రభాకర్, మహిళా హోమ్ గార్డ్ మంజుల, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది జానీ, లక్ష్మయ్య, రూరల్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లింగరాజు, కానిస్టేబుల్ ప్రవీణ్ ను అభినందించి రివార్డ్స్ అందజేశారు.

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తా..

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్



**కుత్బుల్లాపూర్, జూలై 5 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ లో 47 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు డివిజన్ కార్పొరేటర్ కోలుకుల జగన్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపుగా అభివృద్ధి చేయడమే తన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, బాబు గౌడ్, శశి, సయ్యద్ సాజిద్, ఇందిరాగౌడ్, త్రివేణి, నాని, పాపులు గౌడ్, మజ్జి శ్రీను, జయ కృష్ణ, మనోజ్, ముంతాజ్, గిరి, బండా మహేందర్, బ్రహ్మానంద చారి, హనుమంతు, సత్యనారాయణ, గణేష్, వెంకటేష్, మహమూద్, అంజయ్య నగర్ బి బ్లాక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్, ఉపాధ్యక్షులు సోమేశ్, ప్రధాన కార్యదర్శి కిరణ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుచ్చిబాబు,, లక్ష్మారెడ్డి, వీరేశం, సంజీవరెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, జంగారెడ్డి, నందకుమార్, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన కళాకారులను ప్రభుత్వం గుర్తించాలి

- రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కు కళాకారులు వినతి



**హుజూర్‌నగర్, జూలై 5 (జనంసాక్షి) :** అర్హులైన కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు శనివారం హుజూర్ నగర్ కళాకారులు వినతి పత్రం అందించారు. రంగస్థలం సంక్షేమ సంఘం హుజూర్నగర్ వ్యవస్థాపక అధ్యక్షులు దొంతగాని సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుని రవీంద్ర భారతిలోని సాంస్కృతిక శాఖ కార్యాలయంలో హుజూర్‌నగర్ కళాకారులు కలసి కళాకారుల సమస్యల గురించి వివరించారు. గుర్తింపు కార్డులు, పెన్షన్లు, ప్రదర్శన ఇవ్వడానికి కావలసిన ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. మంత్రి కృష్ణారావు స్పందిస్తూ తప్పనిసరిగా కళాకారుల కోరికలు నెరవేరుస్తానని, అర్హులైన వారికి గ్రామాల వారీగా సమీకరణ చేసి నిజమైన అర్హులైన కళాకారులకు పెన్షన్, గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని హామి ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు దొంతగాని సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కస్తాల వీరబాబు, నమ్మాలి శ్రీనివాస్, బెల్లంకొండ సైదులు, బెల్లంకొండ రామ జోగి, బత్తిని మల్లయ్య, కే భద్రాచలం, ఎం శీను, రెక్కల రామిరెడ్డి, లాజర్, ఇట్టిమల్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ చట్టాలపై విస్తృత ప్రచారం



**మెదక్, జులై 5 (జనం సాక్షి) :** జిల్లాలో బాలల సంరక్షణ చట్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా అదుపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ప్లాన్ ఇండియా, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం సంయుక్తంగా బాలల సంరక్షణ మరియు చట్టపరమైన అవగాహన కార్యక్రమంలో భాగంగా, మొబైల్‌వాన్ ఆదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా లోనీ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 6 రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని , ఈ కార్యక్రమం ద్వారా బాలల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై, రిపోర్టింగ్ అండ్ సపోర్టింగ్ మెకానిసిమ్స్ గురించి అవగాహన ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ఏసీడీపీఓ పద్మలత , జిల్లా చైల్డ్ హెల్ప్లిన్ కోఆర్డినేటర్ గంగాధర్, ప్లాన్ ఇండియా నుండి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాహుల్, ప్రాజెక్ట్ ఆఫీసర్స్ సుజాత రాజ్, వెంకటేశ్వర్లు, సోషల్ వర్కర్స్ మంజుల , భార్గవి, రవి, విమెన్ ఎంపవర్మెంట్ హబ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే ఉద్యోగాల భర్తీని చేపట్టాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లోపే ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలి
- నిరుద్యోగులు సంఘటితం కావాలి
- బడుగు బలహీనవర్గాల నాయకత్వంలో ప్రభుత్వాలు రావాలి



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 5 (జనంసాక్షి) :** నిరుద్యోగులు సంఘటితమై శాంతియుత పోరాటం ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు,రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపకులు, తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ పృధ్వీరాజ్ యాదవ్, అశోక అకాడమీ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పాలకూరి అశోక్ అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల సాధనకై అనుములపురి జనార్ధన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్ లో శనివారం ఏర్పాటు చేసిన నిరుద్యోగ విద్యార్థి మహాసభకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సూర్యాపేట ప్రాంతం ఎంతో చైతన్యవంతమైందని, గతంలో తెలంగాణ మహాసభ ఇక్కడి నుంచే ప్రారంభమైందని పేర్కొన్నారు. బండి యాదగిరి లాంటి వాళ్ళు ఈ ప్రాంతం వారేనని గుర్తు చేశారు. నిరుద్యోగ విద్యార్థి మహాసభ కూడా ఇక్కడి నుంచే నాంది పలకటం హర్షనీయమన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పరంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు నిరుద్యోగులకు కల్పించి, ఉద్యోగ కల్పనకు స్కిల్ డెవలప్మెంట్ కొరకు ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే రిటైర్మెంట్ కాల పరిమితిని 61 నుంచి తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లోపే అన్ని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ నోటిఫికేషన్ లను విడుదల చేయాలని కోరారు. భవిష్యత్తులో బడుగు బలహీన వర్గాల ప్రభుత్వాలు వచ్చినప్పుడే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఓబీసీలకు కేవలం 22 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే నిరుద్యోగ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని, మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. నిరుద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతరం పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపకులు సంజీవ్ నాయక్, ఓయూ జేఏసీ నాయకులు వేణు కుమార్, చామకూరి రాజు, జివి గౌడ్, ఇంద్ర నాయక్, అర్జున్, దామోదర్ రెడ్డి, నరసింహ నాయక్, ఎల్.నాగేశ్వరరావు నాయక్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- గురుకుల టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలి
- తపస్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి హనుమంతరావు



**ఇబ్రహీంపట్నం, జూలై 5 (జనం సాక్షి) :** సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం తపస్ మంచాల మండల శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలను సందర్శించారు ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ,ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేసి, పిఆర్సి ని అమలు చెయ్యాలని, గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, గురుకుల పాఠశాల సమయం ఉదయం 9 గంటల నుండి ప్రారంభించాలని, గురుకుల టీచర్లకు మరియు మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని అన్నారు. ఉపాధ్యాయుల మరియు విద్యా రంగ సమస్యలను పరిష్కరించడానికి తపస్ సంఘం కట్టుబడి ఉందని అన్నారు. పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ, మంచాల మండల శాఖ అధ్యక్షులు రావుల శివ కుమార్ , ప్రధాన కార్యదర్శి మాధవరం రవీందర్ రావు , మండల నాయకులు వెంకటేష్, బాలరాజ్, యాదగిరి, ఐలయ్య, నర్సింహా పాల్గొన్నారు.

## జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**హయత్‌నగర్, జూలై 5 (జనం సాక్షి) :** వనస్థలిపురంలో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామావత్ సక్రు నాయక్ హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామావత్ సక్రు నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల చట్టం ప్రకారం 25వేల రూపాయలు ఇవ్వాలి, మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికు లను పర్మినెంట్ చెయ్యాలని డిమాండ్ వారు చేశారు. పనిచేస్తున్న కార్మికులకు ఇచ్చే కిట్లు, సబ్బులు, షాంపులు, నూనెలు, చీపురులు, చెప్పులు, బూట్లు,సాక్సులు, బట్టలు, బ్లౌజులు, మాస్కులు, కుట్టుకుళ్ళు ఇవ్వాలి, కానీ గత సంవత్సరం నుంచి ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికు లకు వారంతరపు సెలవులు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా జరగబోయే సమ్మెలో కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అనసూయ, యాదమ్మ, సునీత, అలివేల, నాగమ్మ, శాంతమ్మ, సులోచన, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త మా కుటుంబసభ్యులే..

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్‌నగర్, జూలై 5 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త మా కుటుంబ సభ్యులే అని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై తిరుగు ప్రయాణంలో హుజూర్ నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండలం చెన్నై పాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుర్రి శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందగా, తెలంగాణ రాష్ట్ర మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం నకిరేకల్ ప్రభుత్వ హాస్పిటల్ కు చేరుకొని కుర్రి శ్రీనివాస్ పార్థివ దేహం పై పూలమాలలుతో ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. తక్షణ సహాయం కింద పది లక్షల రూపాయలను అందజేసి, వారి పిల్లల విద్య కోసం, భార్యకు ఉద్యోగ అవకాశం కోసం ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# ప్రజలను విభజించి పాలించడమే బీజేపీ లక్ష్యం

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

**ఖమ్మం రూరల్, జూలై 5 (జనం సాక్షి) :** దేశంలోని ప్రజలను విభజించి పాలించడమే బిజెపి లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పల్లెగూడెం పంచాయతీ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామం వద్ద గల ఓ ఫంక్షన్ హాల్ లో ఖమ్మం రూరల్ మండల సీపీఎం శ్రేణులకు రాజకీయ శిక్షణా తరగతులు రెండు రోజుల్లో భాగంగా మొదటి రోజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని సీనియర్ కామ్రేడ్ గుంతేటి నాగయ్య ఆవిష్కరించారు. సీపీఎం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి ప్రిన్సిపాల్ గా వ్యవహరించిన క్లాసులో నున్నా నాగేశ్వరరావు రాజకీయ తీర్మానం అనే క్లాస్ బోధించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ...ప్రపంచ దేశాలు సైన్స్ వైపు పయనిస్తుంటే భారతదేశ మాత్రం తిరోగమనంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చదివిస్తూ విదేశాల్లో ఉద్యోగ, వ్యాపారాలు చేపిస్తున్న బిజెపి నాయకులు దేశంలో పేద పిల్లలు ఇంగ్లీష్ భాష చదవవద్దంటూ ఇంగ్లీషు భాషను హేళన చేస్తూ విమర్శిస్తున్నారన్నారు. దేశంలో ఏం జరుగుతుందో తెలియక అమాయక ప్రజలు గందరగోళంలో ఉన్నారని వివరించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజించి తమ పబ్బం గడుపుకోవడమే బిజెపి విధానమన్నారు. ప్రజలను మతం పేరుతో విభజించే మూడుసార్లు అధికారంలోకి వచ్చారని, ప్రజలు ఇప్పటికైనా కళ్లు తెరిచి రాబోయే ఎన్నికల్లో బిజెపికి గట్టి బుద్ధి చెప్పాలని కోరారు. దేశ స్వాతంత్ర పోరాటంలో ఎటువంటి సంబంధం లేని ఆర్ఎస్ఎస్, జన సంఘ్ నాయకులు నేడు దేశభక్తి వల్లేవేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, చరిత్రను వక్రీకరిస్తూ ప్రజలకు నిత్యం అబద్ధాలు వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. రాముడు పేరుతో రాజకీయాలు చేస్తూ వేరే మతస్తులను శత్రువులుగా చిత్రీకరిస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ప్రజలంతా రాజకీయాలను అధ్యయనం చేయాలని కోరారు. పాలేరు డివిజన్ సీపీఎం కార్యదర్శి బండి రమేష్ క్లాస్ బోధించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ...సీపీఎం కార్యకర్తలు నిరంతరం అధ్యయనం చేస్తూనే పోరాటాలు చేయాలని తెలిపారు. సైద్ధాంతికంగా బలంగా ఉన్నప్పుడే శత్రువుకు సరైన రీతిలో సమాధానం చెప్పగలమన్నారు. ప్రతి ఒక్కరు నవతెలంగాణ, మార్క్సిస్ట్ పత్రికను అధ్యయనం చేయాలని సూచించారు. ప్రపంచ రాజకీయాలను అధ్యయనం చేయాలన్నారు. రాజకీయాల్లో సీపీఎం పార్టీ




విధానం, ఎత్తుగడలు, ప్రజా సమస్యలపై పోరాటాలు, ఆందోళనలు,గత చరిత్ర, భవిష్యత్తులో చేయబోయే పోరాటాలను కార్యకర్తలకు వివరించారు. కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ క్లాసుల్లో సీపీఎం నాయకులు నంద్ర ప్రసాద్, పొన్నెకంటి సంగయ్య, పీ.మోహన్ రావు, నందిగామ కృష్ణ, పెండ్యాల సుమతీ, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, వద్లమూడి నాగేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, శాఖ సభ్యులు పాల్గొన్నారు.




# ఆఖర్లో లాభాలు

దిగ్గజ కంపెనీల షేర్లల్లో కొనుగోళ్ల ప్రభావం
ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.760.11 కోట్లు
డీఐఐ విక్రయాలు.. రూ.1,028.24 కోట్లు

**జనంసాక్షి:**అధిక ఒడుదొడుకుల మధ్య మన స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. బ్యాంకింగ్ సహా సూచీల్లో అధిక వాటా ఉన్న కొన్ని దిగ్గజ కంపెనీల షేర్ల రాణింపు ఇందుకు దోహదం చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 15 పైసలు పెరిగి 85.40 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.87% నష్టంతో 68.16 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.97,000 కోట్లు పెరిగి రూ.461.23 లక్షల కోట్ల (5.40 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.మధ్యాహ్నం వరకు నష్టాల్లోనే..: సెన్సెక్స్ (క్రితం ముగింపు 83,239.47తో పోలిస్తే) స్వల్ప లాభంతో 83,306.81 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుని 83,015.83 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని




చేరింది. అక్కడ నుంచి సూచీ బలంగా పుంజుకుని, లాభాల్లోకి వచ్చింది. చివరకు 193.42 పాయింట్ల లాభంతో 83,432.89 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 55.70 పాయింట్లు పెరిగి 25,461 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,470.25 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,331.65 పాయింట్ల వద్ద నష్టాన్ని నమోదు చేసింది.ట్రెంట్‌కు అమ్మకాల ఒత్తిడి..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 10 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. టాటా గ్రూపునకు చెందిన ట్రెంట్ షేరు 11.93% నష్టపోయింది. కంపెనీకి చెందిన ఫ్యాషన్ విభాగానికి సంబంధించి, సమీప కాల వృద్ధి అంచనాలు నిరాశపర్చడం ఇందుకు కారణం. టాటా స్టీల్ 1.72%, టెక్ మహీంద్రా 1.07%, మారుతీ సుజుకీ 0.81%, అదానీ పోర్ట్స్ 0.44%, మహీంద్రా అండ్ మహీంద్రా 0.41% చొప్పున తగ్గాయి. బజాజ్ ఫైనాన్స్ 1.6%, ఇన్ఫోసిస్ 1.36%, హిందుస్థాన్ యునిలీవర్ 1.19%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.15%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.9% పెరిగాయి.

# రోబో ఇసుక..
## ఇప్పుడిదే ప్రత్యామ్నాయం



**జనంసాక్షి:**నది ఇసుక కొరత, అధిక ధరల కారణంగా గ్రేటర్ నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం పడింది. ఇసుక రవాణా దారులు రేట్లు పెంచడం నిర్మాణ రంగానికి మరింత భారంగా పరిణమించింది.మహానగరంలో ఇసుక దొరకడం గగనమవడంతో బిల్డర్లు ప్రత్యామ్నాయంగా రోబో ఇసుక వినియోగాన్ని పెంచారు.ఇప్పటికే కాంక్రీట్ మిక్సింగ్ యూనిట్లలో రోబో ఇసుక (క్రష్డ్ రాక్ సాండ్)ను వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. ఇసుక రేట్లతో పోలిస్తే దీని ధర ఎంతో తక్కువ. అయితే రోబో ఇసుక విరివిరిగా దొరక్కపోవడం.. ప్రత్యేకంగా కొన్ని క్రషర్లలోనే ఇలాంటి ఇసుకను ఉత్పత్తి చేస్తుండటంతో సాధారణ గృహ నిర్మాణాల్లో దీని వినియోగం తక్కువగా ఉంది. అలాగే రోబో ఇసులాగే మెటల్ క్రషింగ్ స్టోన్ డస్ట్ కూడా ఉండటం వీటిలో నాణ్యమైన ఇసుకను గుర్తించడం కష్టంగా మారుతోంది. నగర శివార్లలో విరివిగా లభ్యమయ్యే గ్రనైట్ శిలలతో రోబోశాండ్‌ను ఉత్పత్తి చేయవచ్చు. మెటల్ క్రషర్స్‌లో మిగిలిన వ్యర్థ శిలలను 2ఎంఎం, 1ఎంఎం పరిమాణంలో క్రష్ చేసి జల్లెడ పడితే ఈ ఇసుక తయారవుతుంది. తక్కువ సమయంలో నాణ్యత కలిగిన ఇసుకను తయారు చేయవచ్చన్నది నిపుణుల మాట




# పాకిస్థాన్‌లో మైక్రోసాఫ్ట్ కార్యాలయం మూసివేత

ప్రపంచ టాప్ టెక్ కంపెనీలో ఒకటైన మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్ కార్యాలయానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌లో తన కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది.ఆ దేశంలో 25 సంవత్సరాలుగా సర్వీసులు అందిస్తున్న కంపెనీ తాజాగా తీసుకున్న నిర్ణయంతో స్థానికంగా తన సర్వీసలను ముగించినట్లయింది. కంపెనీ గ్లోబల్ వర్క్‌ఫోర్స్ తగ్గింపు వ్యూహంలో భాగంగా పాక్‌లో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.ఇప్పటికే స్థానికంగా ఉన్న క్లయింట్లకు క్షేత్రస్థాయిలో సర్వీసులు అందించేందుకు కంపెనీ ప్రాంతీయ కేంద్రాలు, అధీకృత రీసెల్లర్ల ద్వారా రిమోట్ సేవలు అందిస్తామని పేర్కొంది. ప్రస్తుత కస్టమర్ ఒప్పందాలు, సేవలు ప్రభావితం కాకుండా కొనసాగుతాయని తెలిపింది. ఆయా కంపెనీలకు నిత్యం మద్దతుగా నిలుస్తామని కంపెనీ హామీ ఇచ్చింది. పాకిస్థాన్‌లో కంపెనీ తీసుకున్న నిర్ణయం వల్ల స్థానికంగా కేవలం కొద్దిమంది ఉద్యోగులు మాత్రమే ప్రభావితం చెందినప్పటికీ అక్కడి వ్యాపార, సాంకేతిక వర్గాల్లో ఆందోళనలు మొదలయ్యాయి .భారతదేశంలో మాదిరిగా కాకుండా మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్‌లో అభివృద్ధి లేదా ఇంజినీరింగ్ సర్వీసులు స్థాపించేం దుకు ఎప్పుడూ ఆసక్తి చూపలేదు. కేవలం అక్కడి యూనిట్ ద్వారా తన ప్రోడక్ట్‌లను ఇతర కంపెనీలతో అనుసంధానం చేసేందుకు, అమ్మకాల కార్యకలాపాలకే పరిమితం చేసింది. మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా భారీ ఉద్యోగాల కోతకు అనుగుణంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఇటీవల మొత్తంగా కంపెనీలో పని చేస్తున్న 9,000 పైగా ఉద్యోగాలను తగ్గించింది. ఈ విస్తృత సంస్థాగత పునర్నిర్మాణమే సంస్థ పాకిస్థాన్ నుంచి నిష్క్రమిం చేందుకు కారణమని ఆ దేశ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పేర్కొంది. వాస్తవానికి మైక్రోసాఫ్ట్ ఇప్పటికే పాక్ లైసెన్సింగ్, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ వంటి ప్రధాన విధులను కొన్ని సంవత్సరాలుగా ఐర్లాండ్‌లోని తన యూరో పియన్ హబ్‌కు మారుస్తోంది.అంతర్జాతీయంగా చాలాదేశాల్లో పాకిస్థాన్ ఉగ్రవాదానికి సంబంధించి వ్యతిరేకత ఉంది. స్థానికంగా పేదరికం పెరుగు తోంది. పాక్ ఆర్థిక వ్యవస్థ ఏటా దారుణంగా క్షీణిస్తోంది. దాంతో చాలా కంపెనీలు తమ కార్యకలాపాలను పరిమితం చేస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద కంపెనీ ఇలా మొత్తంగా తన కార్యాలయాన్ని షట్‌డౌన్ చేయడం అక్కడి టెక్ వర్గాలకు ఆందోళన కలిగిస్తోంది.

# మనీ కంట్రోల్ మంత్ర



**జనంసాక్షి:**డబ్బు లేదని బాధపడడం కంటే దాన్ని ఎలా వశం చేసుకోవాలనే దాని గురించి ఆలోచించేవారి సంఖ్య తగ్గుతుంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు తమ ఆర్థిక పరిమితులు ఇంతేనని..తమ జీవితాలు ఏం చేసినా బాగోవు..అనే ధోరణికి వచ్చేస్తున్నారు. ఇందుకు బదులుగా పాజిటివ్ దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మధ్యతరగతివారు ఆర్థిక అంశాలపట్ల తమ నమ్మకాలను పరిమితంగా ఉంచుకుంటారని ఇన్వెస్టర్, పోర్ట్‌ఫోలియో స్ట్రాటజిస్ట్ శ్యామ్ శేఖర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆ మనస్తత్వం నుంచి ఎలా బయటపడాలో కనీసం ఆలోచించేందుకు సైతం వారు నిరాకరిస్తున్నారని చెప్పారు.శ్యామ్ శేఖర్ ఎక్స్‌లో తెలిపిన వివరాల ప్రకారం..'మధ్యతరగతి కుటుంబాలు తమ మనస్తత్వం మార్చుకోవు. అందుకే ఆర్థికంగా ఎదగలేవు. కనీసం ఆ దిశగా ఆలోచించడానికిసైతం నిరాకరిస్తారు. ఇంట్లో ఎయిర్ కండీషనర్, కారు ఉండాలని కలలు కనే మధ్యతరగతి కుటుంబాలు చాలా ఉన్నాయి. అయితే ఈ అవసరాలు నిజంగా తమ సామర్థ్యాలతో పోలిస్తే చాలా తక్కువ. అయితే ఉన్న పరిధిలో ఆర్థికంగా పుంజుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయరు. కాబట్టి ఈ అవసరాలే వారికి పెద్ద లక్ష్యాలుగా తోస్తాయి' అన్నారు.'డబ్బు సంపాదనను కాంపౌండింగ్ దృష్టితో చూడాలి. దీర్ఘకాలంలో భారీ సంపద చేకూర్చే మార్గాలను కనుగొనాలి. ఇలాంటి ఆలోచనలతో మీరు జీవితాన్ని చాలా భిన్నంగా చూడటం ప్రారంభిస్తారు. రూ.కోటి చేరువలో ఉన్న వ్యక్తి రూ.20 కోట్లకు సులువుగా చేరుకోవచ్చు. కాంపౌండింగ్‌తో ఇది సాధ్యమే. దీర్ఘకాలంలో మంచి రాబడినిచ్చే సంపదను సృష్టిస్తే తరాలు అది కొనసాగుతోంది. పర్సనల్ ఫైనాన్స్‌పై పరిమిత ఆలోచనల నుంచి బయటకురావాలి' అన్నారు.

# ఉద్యోగుల్లో వేతన సంక్షోభం

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జీడీపీల్లో భారత్ ఒకటిగా నిలవడం ఆశావాదానికి అద్దం పడుతోంది. అయితే దేశంలోని కార్పొరేట్ కంపెనీల లాభాలు కొత్త శిఖరాలకు చేరుకుంటున్నప్పుడు అందులో పని చేసే ఉద్యోగుల జీవితాలు, జీతాల్లో మాత్రం మార్పు ఉండడంలేదు.కార్పొరేట్ లాభాలను ఆయా యాజమాన్యాలు వ్యక్తిగతంగా ఎదగడానికి మాత్రమే ఖర్చు చేస్తున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. దీన్ని 'ది గ్రేట్ ఇండియన్ శాలరీ క్రైసిస్' అని పిలుస్తున్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని చంకలు చరిచేలోపే.. శ్రామిక శక్తి ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలు నివ్వెర పరుస్తున్నాయి.దేశంలో ఆర్థిక పురోభివృద్ధి ఉన్నప్పటికీ సగటు కార్మికుడి పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా, వేతనాలు స్తబ్దుగా ఉన్నాయి. వారి సంపాదనకు, ఖర్చులకు ఏమాత్రం పొంతన లేకుండా ఉంది. ఉద్యోగుల శ్రమకు తగిన ప్రతిఫలం ఉండకపోవడంతో వారి ఆర్థిక ప్రణాళికలు అస్తవ్యస్తంగా మారి ప్రధాన నగరాల్లోని నిపుణులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. భారత జీడీపీ విస్తరిస్తున్నప్పటికీ జీతాల వృద్ధి మాత్రం గణనీయంగా మందగించింది. 2023 లో సగటు వేతన పెరుగుదల కేవలం 9.2% మాత్రమే ఉండడం దీనికి నిదర్శనం. ఈ పెంపు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా లేదు. ద్రవ్యోల్బణం రేట్లు ముఖ్యంగా ఆహారం, ఇంధనం, ఇతర నిత్యావసరాల ధరలు వేతనాల పెరుగుదలను మించిపోయాయి. కంపెనీలు రికార్డు లాభాలను నమోదు చేసేందుకు దోహదపడే ఉద్యోగుల వేతన పెంపుపై యాజమాన్యాలు మొండి వైఖరి అనుసరిస్తున్నాయి. సంపన్నులు, సగటు కార్మికుడి మధ్య ఆర్థిక అంతరం విస్తృతంగా పెరుగుతోంది. అధిక వేతనం పొందే రంగాల్లో కొంతమంది ఎన్నో ప్రయోజనాలను పొందుతున్నారు. తక్కువ ఆదాయ వర్గాల్లో ఎక్కువ మంది ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్కువ ఆదాయ వర్గాల్లో ఎక్కువ మంది ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.నోయిడా, ఢిల్లీ, చెన్నై, పుణె, బెంగళూరు, హైదరాబాద్.. వంటి ప్రధాన పట్టణ కేంద్రాల్లో నివసిస్తున్న వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. జీవన వ్యయం అదుపు తప్పడంతో నగరంలోని ఉద్యోగులు అధిక అద్దెలు, ఈఎంఐలు, ఆరోగ్య సంరక్షణ ఖర్చులతో సతమతమవుతున్నారు. ఓ పాతికేళ్ల కిందట మోస్తారు ఖర్చులతో కాలం వెళ్లదీసుకొచ్చినవారికి ఇప్పుడు అవే ఖర్చులు ఊపిరి పీల్చుకోనివ్వకుండా చేస్తున్నాయి.

## గుడ్ల ధరలు


| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.60 | ₹ 5.62 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 90,600 (22 క్యారెట్లు) | ₹ 98,830 (24 క్యారెట్లు) |
| --- | --- |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,20,000

# నైపుణ్యాలను పెంచుకోవాల్సిందే!




**జనంసాక్షి:**కృత్రిమ మేధ కొత్త పుంతలు తొక్కుతోంది. తయారీ, వ్యాపార నిర్వహణ, ఆరోగ్యం, విద్య, కస్టమర్ సర్వీసెస్ తదితర అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. దీంతో.. భారత్ సైతం ఈ సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని ఓ నివేదిక చాటిచెప్పింది. ప్రపంచంలోనే అతిపెద్ద శ్రామిక శక్తిని కలిగి ఉన్నప్పటికీ.. ప్రభావవంతమైన, అందుబాటులో ఉన్న ఏఐ నైపుణ్యాలను వారికి వెంటనే అందించాల్సిన అవసరం ఉందని తెలిపింది.గూగుల్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ)ల సహకారంతో ఏవీపీఎన్ అనే సంస్థ 'ఏఐ ఫర్ ఆల్: బిల్డింగ్ ఆన్ ఏఐ-రెడీ వర్క్‌ఫోర్స్ ఇన్ ఆసియా-పసిఫిక్' పేరిట ఓ నివేదికను రూపొందించింది. కృత్రిమ మేధ రంగంలో భారత్‌కు ఉన్న అవకాశాలు, సవాళ్లను ఇందులో పొందుపర్చింది.నివేదిక ప్రకారం.. 2030 నాటికి 'ఆసియా-పసిఫిక్' ప్రాంత జీడీపీకి కృత్రిమ మేధ 3 ట్రిలియన్ డాలర్ల వరకు ఆదాయం ఆర్జించగలదు. యువశక్తి, వేగంగా అభివృద్ధి చెందుతున్న జనాభా కలిగిన భారత్ ఇందులో కీలక పాత్ర పోషించగలదు.ఏఐ ఆధారిత ఆటోమేషన్‌లో పురోగతిని లెక్కలోకి తీసుకుంటే.. డేటా ఎంట్రీ, షెడ్యూలింగ్, కస్టమర్ సర్వీస్ వంటి అడ్మినిస్ట్రేటివ్, సపోర్ట్ రంగాల్లోని ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉంది. ఈ తరహా ఉద్యోగాల్లో మహిళలు, అసంఘటిత కార్మికులు, డిజిటల్ అక్షరాస్యతలో వెనుకబడినవారే ఎక్కువగా ఉన్నారు.తయారీ, టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెద్దమొత్తంలో అసంఘటిత కార్మికులు ఉన్నారు. ఈ రంగాలను ఏఐ, ఆటోమేషన్‌లు తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఏఐ స్కిల్స్‌ను అందిపుచ్చుకోని క్రమంలో వీరు ఉద్యోగ మార్కెట్‌లో వెనుకబడిపోయే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది.దేశ యువతలో చాలామంది ప్రస్తుతం తమ మొదటి ఉద్యోగ వేటలో ఉన్నారు లేదా మెరుగైన అవకాశాల కోసం నైపుణ్యాలను పెంచుకోవాలని ఆశిస్తున్నారు. నివేదిక ప్రకారం.. యువత పొందుతున్న నైపుణ్య శిక్షణకు, సంస్థలు ఆశిస్తున్న వాటిమధ్య సంబంధం లేనట్లు కనిపిస్తోంది.అభ్యర్థుల విషయంలో కొన్నేళ్ల క్రితం ఉన్నవాటితో పోలిస్తే చాలా భిన్నమైన ప్రొఫైల్‌లను నేడు సంస్థలు కోరుకుంటున్నాయి. కేవలం డిగ్రీలే కాకుండా.. క్రిటికల్ థింకింగ్, అవసరానికి తగినట్లు తమనుతాము మార్చుకోవడం, ఏఐ టూల్స్‌ను సమర్థంగా ఉపయోగించడం వంటి నైపుణ్యాల కోసం చూస్తున్నాయి.భారత్‌లో 'ఏఐ'ను అందిపుచ్చుకునే విషయంలో డిజిటల్ యాక్సెస్ కూడా ప్రధాన అడ్డంకి. అనేక గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇప్పటికీ స్మార్ట్‌ఫోన్‌లు, ఇంటర్నెట్ సదుపాయం లేదు. ఉజ్వల ఏఐ భవిష్యత్తు కోసం ఈ డిజిటల్ అంతరాలను తగ్గించాలని నివేదిక సిఫార్సు చేసింది.దేశ శ్రామిక శక్తిలో దాదాపు 35 శాతం మహిళలే. ఆటోమేషన్ ముప్పు పొంచి ఉన్న ఆఫీస్ సపోర్ట్, రిటైల్ సేవల వంటి రంగాల్లో వీరి ప్రాతినిధ్యమే అధికం. కుటుంబ బాధ్యతల కారణంగా చాలా మంది మహిళలు ఉద్యోగాల నుంచి వైదొగులుతున్నారు. తిరిగి వచ్చే క్రమంలో.. వేగంగా మారుతున్న ఉద్యోగ మార్కెట్ నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మహిళల కోసం అనువైన, సందర్భోచిత ఏఐ నైపుణ్య కార్యక్రమాలను రూపొందించాలని సూచించింది. 2024లో దేశంలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు కూడా ఉద్యోగ అవకాశాల కోసం ఇబ్బంది పడ్డారని ఓ వార్తాసంస్థ కథనాన్ని ఈ నివేదిక ఉటంకించింది. దీని ప్రకారం.. 15 లక్షల మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 10 శాతం మందికే ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగ డిమాండ్లకు అనుగుణంగా శిక్షణను అందించాల్సిన అవసరం ఉందని నివేదిక తెలిపింది. ఏఐ నైపుణ్యాలు కలిగిన శ్రామిక శక్తి పెంపు కోసం దోహదపడే అనేక చర్యలను నివేదిక సిఫార్సు చేసింది.ఫ్రెషర్లు, అసంఘటిత కార్మికులు, మహిళలు, డిజిటల్ అక్షరాస్యతలో వెనుకబడినవారు.. ఇలా ఉద్యోగార్థుల వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలి. సర్వేలో పాల్గొన్న వారిలో 40 శాతం మంది నిజ జీవితంలో ఉపయోగపడే, పరిస్థితులకు తగిన శిక్షణను కోరుకున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాక్టికల్ నైపుణ్యాలపై దృష్టి సారించాలి.సర్వేలో పాల్గొన్నవారిలో కేవలం 15 శాతం మంది మాత్రమే ఏఐ నైపుణ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారత్‌లో ఈ సంఖ్య మరింత తక్కువ! ఈ నేపథ్యంలో ఏఐ శిక్షణపై మరింత అవగాహన, భాగస్వామ్యం అవసరం.భారత్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాలు 90 శాతానికి పైగా ఉన్నాయి.




# 'మీ భార్య మిమ్మల్ని వదిలివేస్తుంది'

- వివేక్ రామస్వామిపై అమెరికన్ల ట్రోలింగ్
- ఇండియాకు వెళ్లిపోవాలంటూ విద్వేషం

**జనంసాక్షి:**'అమెరికాతో మీకేం సంబంధం ఉంది. భారత దేశానికి తిరిగి వెళ్లిపోయి ముంబై, గుజరాత్‌లతో సంబరాలు చేసుకోండి. మీ భార్య మిమ్మల్ని వదిలేస్తుంది' అంటూ భారత సంతతికి చెందిన రిపబ్లికన్ పార్టీ నాయకుడు వివేక్ రామస్వామిపై అమెరికన్లు విరుచుకుపడుతున్నారు. వివేక్ రామస్వామిపై అమెరికన్లు జాత్యాహంకార వ్యాఖ్యలు చేయడం కొత్తేమీ కాదు. ఒహియో గవర్నర్ పదవికి పోటీ పడుతున్న ఆయనపై సోషల్ మీడియా వేదికగా అమెరికా పౌరులు విద్వేషం వెళ్లగక్కుతున్నారు. తాజాగా ఎక్స్‌లో షేర్ చేసిన ఫొటోపై తీవ్రంగా ట్రోలింగ్ చేస్తున్నారు.జూలై 4న అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భార్యా, పిల్లలతో దిగిన ఫొటోను వివేక్ రామస్వామి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. 'చిన్న పిల్లలు ప్రతి సంవత్సరం పెద్దవుతున్నారు. హ్యాపీ ఫోర్త్!' అంటూ క్యాప్షన్ జోడించారు. దీనిపై అమెరికన్లు జాతి విద్వేష వ్యాఖ్యలతో ఆయనను ట్రోలింగ్ చేస్తున్నారు. 'మీరు మీ కుటుంబంతో గుజరాత్ లేదా ముంబైలో జరుపుకోవాలి' అంటూ ఒకరు కామెంట్ చేశారు. 'మీరు ఫ్రీడమ్ ఫైస్‌ని, యాంకర్ బేబీ పౌరసత్వాన్ని తిరిగి పొందారా' అంటూ మరొకరు ప్రశ్నించారు.ఒకరైతే వివేక్ రామస్వామి భార్య ఆయనను వదిలి వెళ్లిపోతుందంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'ట్రంప్ పాలనలో మీ కుటుంబం లేదా స్నేహితులు ఎవరైనా బహిష్కరించబడతారా అని నేను ఆశ్చర్యపోతున్నాను? బహుశా మీ భార్య కుటుంబ సభ్యులను బహిష్కరిస్తే ఆమె మిమ్మల్ని వదిలివేస్తుంది' అని మరో అమెరికన్ ట్రోల్ చేశారు.అయితే వివేక్ రామస్వామిపై జాతి వివక్ష వ్యాఖ్యలు కొత్తేం కాదు. మే నెలలో తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఎక్స్‌లో షేర్ చేసిన ఫొటో పైనా కూడా ఆయన వ్యతిరేకులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఇండియాకు తిరిగి వెళ్లిపోవాంటూ తిట్టిపోశారు. వివేక్ సతీమణి డాక్టర్ అపూర్వ తివారి కూడా భారత సంతతికి చెందిన వారే. ఆమె కూడా అమెరికాలోనే జన్మించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేసిన తర్వాత వివేక్ రామస్వామిపై కొత్త ద్వేషం మొదలైంది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టక ముందు.. అమెరికాలో జన్మించిన ఎవరికైనా ఆటోమేటిక్‌గా పౌరసత్వం దక్కేది. అయితే ఇది అందరికీ ఉద్దేశించింది కాదని, అందుకే ఈ నియమాన్ని మార్చాలనుకుంటున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ఈ వివాదాస్పద నిర్ణయాన్ని న్యాయస్థానాల్లో సవాల్ చేయడంతో దీని అమలుపై సందిగ్ధం కొనసాగుతోంది. మరోవైపు వివేక్ రామస్వామిని యాంకర్ బేబీ అంటూ అమెరికన్లు ట్రోల్ చేస్తున్నారు. ఎందుకంటే సిన్సినాటిలో వివేక్ పుట్టేటప్పటికి ఆయన తల్లికి అమెరికా పౌరసత్వం లేదు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. తాను పుట్టిన తర్వాత తన తల్లి పౌరసత్వ పరీక్ష రాసిందని, తన తండ్రి కూడా అప్పటికి అమెరికా పౌరుడు కాదని ఒప్పుకున్నారు. అయితే తన తల్లిదండ్రులు చట్టబద్ధంగా అమెరికాకు వలస వచ్చారని చెప్పారు. చట్టవిరుద్ధంగా అమెరికాలోకి ప్రవేశించిన తల్లిదండ్రుల పిల్లలకు జన్మతః పౌరసత్వం వర్తించన్నారు.

# పూర్తిగా మహిళా ఉద్యోగులతో ఇన్సూరెన్స్ బ్రాంచ్

**జనంసాక్షి:**జీవిత బీమా సంస్థ ఆదిత్య బిర్లా లైఫ్ ఇన్సూరెన్స్ (ఏబీఎస్ఎల్ఐ) తాజాగా హైదరాబాద్‌లో పూర్తిగా మహిళా సిబ్బందితో బ్రాంచీని ప్రారంభించింది.ఈ ఏడాది ప్రారంభంలో ముంబైలో ఈ తరహా ఆల్-ఉమెన్ బ్రాంచీని ప్రారంభించగా, ఇది రెండోదని వివరించింది.దీనితో హైదరాబాద్‌లో తమ శాఖల సంఖ్య 7కు, దేశవ్యాప్తంగా 433కి చేరిందని కంపెనీ ఎండీ కమలేష్ రావు తెలిపారు. మహిళా అడ్వైజర్లకు సహాయకరంగా ఉండేలా ఈ శాఖలో కిడ్స్ రూమ్‌లాంటి సదుపాయాలు కూడా ఉంటాయని వివరించారు. ఆదిత్య బిర్లా గ్రూప్ (ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ ద్వారా), కెనడా ఆర్థిక సేవల దిగ్గజం సన్ లైఫ్ ఫైనాన్షియల్ మధ్య జాయింట్ వెంచర్‌గా 2000 ఆగస్టులో ఆదిత్య బిర్లా లైఫ్ ఇన్సూరెన్స్ ఏర్పాటైంది. 2001 జనవరిలో కార్యకలాపాలను ప్రారంభించిన ఈ సంస్థ దేశంలోని టాప్ ప్రైవేట్ జీవిత బీమా కంపెనీల్లో ఒకటిగా ఎదిగింది.




## ఆట బొమ్మల ఉత్పత్తికి ప్రోత్సాహం..
# త్వరలో కొత్త పథకం
### వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



**జనంసాక్షి:**పరిశ్రమతో సంప్రదింపుల అనంతరం దేశంలో ఆట బొమ్మల ఉత్పత్తిని (టాయ్స్) పెంచేందుకు త్వరలోనే ఓ పథకాన్ని ఖరారు చేయనున్నట్టు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.టాయ్స్ తయారీకి, ఎగుమతులకు భారీ అవకాశాలున్నట్టు చెప్పారు. టాయ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఏఐ) ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మంత్రి గోయల్ మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చే పథకం ఎగుమతులకు ప్రోత్సాహకాల రూపంలో ఉండదని.. దేశీయంగా తయారీని పెంచేందుకు, ఉపాధి కల్పనకు ఊతమిస్తుందన్నారు. డిజైన్ సామర్థ్యాలు, నాణ్యతతో కూడిన తయారీ, బ్రాండ్ నిర్మాణానికి మద్దతు రూపంలో ఈ పథకం ఉంటుందని చెప్పారు. ఒకప్పుడు ఆట బొమ్మల కోసం దిగుమతులపైనే పూర్తిగా ఆధారపడగా.. ప్రస్తుతం దేశీయంగానే పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడంతోపాటు, 153 దేశాలకు ఎగుమతులు చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. విధానపరమైన మద్దతు చర్యలు, నాణ్యతా ప్రమాణాల అమలు, స్థానిక తయారీ క్లస్టర్లను బలోపేతం చేయడం ద్వారా ఇది సాధ్యమైనట్టు వివరించారు.140 కోట్ల జనాభా కలిగిన దేశం కావడంతో తయారీ కార్యకలాపాల విస్తరణతో సహజ ప్రయోజనం కలుగుతుందన్నారు. ఆట బొమ్మల ఎగుమతులను పెంచుకునేందుకు చక్కని బ్రాండింగ్, ఆకర్షణీయమైన ప్యాకింగ్, బలమైన డిజైన్‌పై దృష్టి సారించాలని పరిశ్రమకు గోయల్ సూచించారు. వినూత్నమైన ఆట‌'మ్మల నమూనాలను అభివృద్ధి చేసిన స్టార్టప్‌లకు పీఎం ముద్రాయోజన కింద పెద్ద ఎత్తున నిధుల మద్దతు అందించినట్టు చెప్పారు.

# మమ్దానీకి విమర్శల తాకిడి

**జనంసాక్షి:**న్యూయార్క్ నగరంలో ఆర్థిక అసమానతలను రూపుమాపుతానంటూ సోషలిస్ట్ తరహా వాగ్దానాలు చేస్తున్న డెమొక్రటిక్ పార్టీ మేయర్ అభ్యర్థి జొహ్రాన్ ఖ్వామీ మమ్దానీ(33)పై విమర్శల దాడి పెరిగింది. భారతీయ మూలాలున్న మమ్దానీ తల్లిదండ్రులు మీరా నాయర్, మహమూద్ మమ్దానీల ఆస్తిపాస్తుల వివరాలనే అస్త్రాలుగా మార్చుకున్న విమర్శకులు.. ఆయనకు సోషలిజం గురించి మాట్లాడే అర్హత లేదని దెప్పి పొడుస్తున్నారు. మమ్దానీ కుటుంబ నేపథ్యానికి, ఆయనిస్తున్న వాగ్దానాలకు పొంతనే లేదంటున్నారు.జొహ్రాన్ మమ్దానీకి ఉగాండాలో ఉన్న నాలుగెకరాల ప్లాట్ విలువే 2.50 లక్షల డాలర్ల ఖరీదుంటుందని, ఖరీదైన మన్‌హట్టన్ ప్రాంతంలో విలాస వంతమైన నివాస భవనముందని చెబుతున్నారు. మమ్దానీ కుటుంబానికి 10 లక్షల డాలర్ల దాకా విలువైన ఆస్తులున్నాయని ట్రంప్ తరపున లారా లూమర్, మెఘన్ మెక్‌కెయిన్ తెలిపారు.ఉన్నత విద్య, పలుకుబడి కలిగిన కుటుంబం నుంచి వచ్చిన జొహ్రాన్ మమ్దానీకి సగటు ఉద్యోగికి ఉండే ఇబ్బందులేమీ లేవని, ఇటువంటి వ్యక్తి సామాన్యుల ఇబ్బందులను ఎలా తీరుస్తాడని వారు ప్రశ్నిస్తున్నారు. న్యూయార్క్ మేయర్ ఎన్నికలు మరో నాలుగు నెలలుండగా, మమ్దానీపై విమర్శలు ఇప్పటికే తీవ్ర రూపం దాల్చడం గమనార్హం.

## ట్రంప్ ఒత్తిడికి మోదీ మోదీ తలొగ్గుతారు..
### ఇది నిజం...రాసి పెట్టుకోండి:రాహుల్

ఆభరణాలు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. అయితే ఈ సడలింపులను ఆమోదిస్తే, మన దేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. వాణిజ్య చర్చల నిమిత్తం ఇటీవల అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగివచ్చింది. దీంతో అమెరికా-భారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



## ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్లు ప్రారంభం

**ఎన్నికల వరకే రాజకీయాలు ఎన్నికల తర్వాతే అభివృద్ధి మా ధ్యేయం**

**కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి : బండి సంజయ్ కుమార్**

**వీణవంక జూలై 5( జనం సాక్షి) :** వీణవంక మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 78 లక్షల వ్యయం నిధులతో నిర్మించిన సిసి రోడ్లను కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ హుజురాబాద్ స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో కలిసి శనివారం రోజున ప్రారంభించారు.బండి సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ. ఎన్నికల వరకే రాజకీయాలు ఎన్నికల తర్వాత అభివృద్ధి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని స్థానిక ఎమ్మెల్యేలతో, ఎమ్మెల్సీలతో, ప్రజాప్రతినిధితో కలిసి పనిచేస్తున్నా. ఎందుకంటే అందరం కలిసి సమిష్టిగా పని చేస్తే ప్రజలకు మరింత మేలు చేయొచ్చని ఉద్దేశంతోనే పార్టీలతో కచ్చితంగా పనిచేస్తున్నా. అందరు సహకరించాలని అభిమానం చేసి గెలిపించిన ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలని కోరుతున్నా.దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం రోడ్లకు అత్యధిక ప్రాధాన్యత నిస్తుందని నేను కరీంనగర్ ఎంపీగా, కేంద్ర సహాయ మంత్రిగా ఉంటూ ఎక్కువ నిధులు కరీంనగర్ పార్లమెంటుకు తీసుకొస్తున్నా. అంటే అవి రోడ్ల కోసమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు,బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి నరసింహ రాజు, మడిగిరి సమ్మిరెడ్డి, ఆదిరెడ్డి, పెద్ది మల్లారెడ్డి, ఎనగంటి శ్రీనివాస్ యాదవ్,మారముల్ల కొమురయ్య, ఎండి అఖిల్, దాసారపు రాజు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాడ సాధవ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, రాయిశెట్టి లతా శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి,తోపాటు ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించాలి

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 05 (జనం సాక్షి) :** ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అట్రాసిటీ కేసులను త్వరితగతిన తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని సమావేశ మందిరంలో శనివారం ఆయన కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యల ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులతో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డు కులాలు, తెగల వారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై బాధితుల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పెట్టకుండా చూడాలన్నారు. నిధులు దుర్వినియోగం అయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేయాలని అధికారులకు హితవు పలికారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఎస్సీ ఎస్టీల సమస్యల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం జూలై మాసం నుండి కార్యాచరణ రూపొందించుకొని, ప్రతి నెల చివరి శనివారం పౌర హక్కుల దినాన్ని నిర్వహించి తహసిల్దార్, పోలీస్ అధికారి తప్పనిసరిగా హాజరు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. జిల్లాలోని సమస్యలను తెలుసు కునేందుకు వీలుగా మూడు మాసాలకు ఒకసారి డివిఎంసి సమావేశాలు నిర్వహించి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మూడు నమ్మకాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన చట్టాలపై, అవి అందరికీ సమానమనే విషయాన్ని అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు స్థిరమైన న్యాయం జరిగేలా అంకిత భావంతో పని చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పక్కాగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, స్వయం ఉపాధి కార్యక్రమాలలో కూడా వాటాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు లబ్ది చేకూరేలా చూడాలన్నారు. కార్పొరేషన్ల ద్వారా వచ్చే పథకాలు అర్హులైన పేదలకు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురి చేసే వారి పట్ల కమిషన్ కఠిన చర్యలు చేపడుతుందని అన్నారు. కాగా, అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నోట్ బుక్కులు, టెక్స్ట్ బుక్కులు, ఏకరూప దుస్తులు అందేలా చూడాలన్నారు. అంతకుముందు ఐడీఓసీ కి చేరుకున్న కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. కమిషన్ చైర్మన్, జిల్లా అధికారులు భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, జిల్లా శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారిణి రజిత, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పోషాల రవికుమార్ గౌడ్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :** అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కురెళ్ళ వేములయ్య గౌడ్ చేతుల మీదుగా పోషాల రవి కుమార్ గౌడ్ కు నియామక పత్రాలను అందజేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పోషాల రవి కుమార్ గౌడ్ ని అధికారకంగా నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మిద్దెల మల్లేశం గౌడ్, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లారపు శ్రుతి రాణి గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అయిలి మల్లికార్జున్ గౌడ్, పాండాల దశరథ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు దంతూరి రాములు గౌడ్ తదితరులు పాల్గొని నియామక పత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కురెళ్ళ వేములయ్య మాట్లాడుతూ... రాబోయే కాలంలో గౌడ సామాజిక వర్గానికి సంబంధించిన గీత కార్మికులను, యువతను విద్యావంతులుగా తీర్చిదిద్దే విధంగా ప్రోత్సహిస్తూ వారికి వెన్నంటే ఉంటూ సహాయ సహకారాలు అందిస్తూ అఖిల భారత గౌడ సంఘం నియమ నిబంధనలకు కట్టుబడి, గౌడ సామాజిక వర్గంతో కలిసికట్టుగా ఉంటూ అభివృద్ధి పదంలో నడిపించే విధంగా ఉండాలని తెలిపారు.



### బీకాంలో ఆర్జేసి
## విద్యార్థికి ఖమ్మం ఫస్ట్

**ఖమ్మం (జనం సాక్షి) :** కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో ఖమ్మం ఆర్జేసి కళాశాల విద్యార్థి మానస ప్రతిభ కనబరిచి 8.62 సీజీపీఏ పాయింట్లతో బీకాం లో ఖమ్మం ఫస్ట్ సాధించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు గతంలో పలువురు వివిధ రంగాల్లో ఉన్నత మైన స్థితిలో స్థిర పడ్డారని తెలిపారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విద్యార్దులకు దీటుగా క్యాంపస్ ప్లేస్ మెంట్‌లలో విజయం సాధించి ఉద్యోగాలు సాధించడం గర్వకారణం అన్నారు. గతంలో కూడా బీకాంలో ఖమ్మం ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. దీనికి తమ కళాశాల విద్యార్థులపై అధ్యాపకుల పర్యవేక్షనే కారణమని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. భవిష్యత్లో కూడా తమ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిం చేలా యాజమాన్యం కార్యాచరణ రూపొందించి ందని వివరించారు. అనంతరం మానసను అభినం దించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎ.లింగయ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలల్లో నమోదు పెంచాలి

- విద్యార్థుల హాజరు పర్యవేక్షించాలి
- కాలేజీలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జూలై 05 (జనంసాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని, కాలేజీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ప్రతి విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చేలా ప్రోత్సహించాలని, వారి తల్లిదండ్రులతో మాట్లాడి అడ్మిషన్లు పెంచాలని, కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాల్లో జూనియర్ కాలేజీ విద్యార్థుల వసతి అంశాన్ని పరిశీలిస్తామని, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారికి అవసరమైన మెటీరియల్ ను జిల్లా యంత్రాంగం నుండి సమకూరుస్తామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు తదుపరి ఉన్నత విద్యలో ఉచితంగా ప్రవేశాలు, అనేక అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి వెసులుబాట్లను తెలియజేసేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలు ఉన్నచోట్ల ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ అంశాన్ని అధికారులతో చర్చిస్తామని తెలిపారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్ దరఖాస్తు మార్గదర్శకాలకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి.గంగాధర్, ఓపెన్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

## ఓటర్ లిస్టు నుండి మాజీ ఎమ్మెల్యే పేరు తొలగింపు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 5 (జనంసాక్షి)** వేములవాడ మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు పేరును ఓటర్ లిస్టు నుండి ఓటు హక్కును తొలగిస్తూ ఆయన నివాసానికి ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి సిబ్బంది శనివారం నోటీసులు అతికించారు.గత కొన్నీ రోజుల క్రితం పౌరసత్వ వివాదం కేసులో ఉన్నత న్యాయస్థానం భారతదేశ పౌరుడు కాదని జర్మనీ పౌరుడు అని నిర్ధారించింది.2009 లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చెన్నమనేని రమేష్ బాబు భారతీయుడు కాదని అతను అక్రమ మార్గాల ద్వారా ఓటర్ జాబితాలో ఆయన పేరు నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాడని దానిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా వారు విచారణ చేపట్టి రమేష్ బాబు భారతీయ పౌరుడు కాదని జర్మనీ పౌరుడని తీర్పు ఇచ్చారు.గతంలో 2013 లో హైకోర్టు రమేష్ బాబు ఓటర్ జాబితాలో అక్రమంగా తన పేరును నమోదు చేసుకున్నట్లుగా తీర్పు చెప్పింది.రాష్ట్ర హైకోర్టు చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడైనని నిర్ధారించినందున ఎన్నికల ఓటర్ జాబితా నుండి ఫామ్ 7 ప్రకారం పేరును తొలగిస్తామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే జూలై 2 లోపు సమాధానం ఇవ్వాలని వేములవాడలోని ఆయన నివాసానికి రెవెన్యూ అధికారులు నోటీస్ అంటించారు. ఆయన అట్టి నోటీసులపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో శనివారం ఓటర్ జాబితా నుండి పేరును తొలగిస్తూ రమేష్ బాబు నివాసానికి రెవెన్యూ అధికారులు నోటీస్ అంటించారు.

## మినార్‌పల్లిలో భర్తను హతమార్చిన భార్య

**బోధన్, జనంసాక్షి :** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం మినార్ పల్లిలో శుక్రవారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా నివసించే దేశ్య నాయక్ మరియు అతని భార్య సాలుబాయి మధ్య వివాదం చెలరేగింది. ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో సాలుబాయి తన భర్త దేశ్య నాయక్‌ను గొంతుకోసి హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలం నుండి దేశ్య నాయక్ అరుపులు, కేకలు విన్న స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ సమయంలో దేశ్య నాయక్ తీవ్ర గాయాలతో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా, వెంటనే అతన్ని బోధన్ ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ఆయన మృతిచెందినట్లు బోధన్ రూరల్ పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనపై బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోపిణి సాలుబాయి, ఆమె కుమారుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఈ హత్యకు గల కారణాలు మరియు ఇతర వివరాలను లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## హిందువుల ఐక్యతే రక్ష : కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 05,(జనంసాక్షి) :** పెహల్గాం ఘటన తర్వాత హిందువుల ఆలోచనల్లో సానుకూల మార్పు వచ్చిందని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి మరియు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. హిందువులంతా ఐక్యంగా ఓటు బ్యాంకుగా మారితేనే రక్షణ సాధ్యమని, సంఘటిత శక్తిగా ఎదిగితే హిందూ సమాజం బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కరీంనగర్‌లో జరిగిన శ్రీ జగన్నాథ రథయాత్రలో బండి సంజయ్ పాల్గొని, బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి దర్శనం చేసుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఈ యాత్రలో మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు బసవ లక్ష్మీనారాయణ తదితరులు కూడా పాల్గొన్నారు. టవర్ సర్కిల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులకు బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో నిర్వహితమైన నాల్గవ జగన్నాథ రథయాత్ర వేలాది మంది హిందువుల భక్తితో అద్భుతంగా కొనసాగిందన్నారు. ఈ యాత్రలో పాల్గొనడం ద్వారా కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకమని, భజనలు, కీర్తనలతో భక్తి హెూరు నడుస్తోందని తెలిపారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొనడం హర్షదాయకమన్నారు. కరీంనగర్‌లో జగన్నాథ ఆలయ నిర్మాణానికి నిర్వాహకులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. హిందూ ఐక్యతపై ఉద్ఘాటన: పెహల్గాం ఘటనను ఉదహరిస్తూ, హిందువులపై జరిగిన దాడులు సమాజంలో చైతన్యాన్ని రేకెత్తించాయని సంజయ్ వ్యాఖ్యానించారు. "పేరు, మతం అడిగి హిందువులను హతమార్చిన ఘటన మనమంతా చూశాం. ఆపరేషన్ సింధూర్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన చర్యలు హిందువులను సంఘటితం చేశాయి," అని ఆయన అన్నారు. హిందువులు ఓటు బ్యాంకుగా మారాలని, కష్టనష్టాల్లో కలిసికట్టుగా ఉండాలని, 'సర్వేజన సుఖినోభవంతు' సిద్ధాంతాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ రథయాత్రకు అశేష జనం తరలివచ్చిన దృశ్యం హిందూ ఐక్యతకు నిదర్శనమని, రాబోయే రోజుల్లోనూ హిందువులు సంఘటిత శక్తిగా ఉండాలని ఆకాంక్షించారు. అందరికీ జగన్నాథ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు బండి సంజయ్ తెలిపారు.

## మంథని రూపురేఖలు మార్చుతాం






- అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం..!
- రాబోయేది అంతా ఏఐ, డిజిటల్ యుగం
- తదనుగుణంగా విద్యా శాఖలో మార్పులకు కృషి
- మంథనిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :** మంథని పట్టణ రూపురేఖలు మార్చుతాం! అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం. అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. రాబోయేది అంతా ఏఐ, డిజిటల్ యుగం అని తదనుగుణంగా విద్యా శాఖలో మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి కృషి చేస్తామని తెలిపారు. శనివారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.మంథని జూనియర్ కళాశాల మైదానంలో 35 లక్షల నిధులతో చేపట్టిన సింథటిక్ టెన్నిస్ కోర్టు, 10 లక్షలతో చేపట్టిన చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులకు, 4 కోట్ల 5 లక్షల 50 వేల రూపాయలతో చేపట్టిన రావుల చెరువు బ్యూటిఫికేషన్ పనులకు , 2 కోట్ల 99 లక్షల రూపాయలతో చేపట్టిన అయ్యగారి చెరువు బ్యూటిఫికేషన్ పనులకు , గంగపురి వద్ద 2 కోట్ల 55 లక్షల రూపాయలతో చేపట్టిన 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. మంథని పట్టణంలోని బోయిన్ పేట వద్ద 12 లక్షల రూపాయలతో నిర్మించిన చిల్డ్రన్ పార్క్, పోచమ్మ వాడ పాల కేంద్రం వద్ద ఉష ఇంటర్నేషనల్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మహిళ కుట్టు శిక్షణ కేంద్రాన్ని , సీతారామ సేవా సదన్ సౌజన్యంతో మంత్ర పురి పరిసర గ్రామ ప్రజలకు బ్రహ్మ తీర్థం ముక్తి దామం (గ్యాస్ ఆధారిత జ్వ లన యంత్రం) , జిల్లా ప్రజా పరిషత్ బాలికల పాఠశాలలో సీడ్స్ ఎన్.జి.ఓ ద్వారా 58 లక్షలతో నిర్మించిన అధునాతన డిజిటల్ క్లాస్‌లు, లైబ్రరీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విద్యా, వైద్యం రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని అన్నారు. పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని నమ్మకం కలిగిస్తూ బడి బాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. మంథని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 25 మంది కొత్త విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుంచి వచ్చి చేరడం చాలా సంతోషకరమని అన్నారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందని అన్నారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులకు తన వంతు ప్రయత్నం చేస్తానని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహించి నూతనంగా 10 వేల పైగా ఉపాధ్యాయ పోస్టులను మనం భర్తీ చేశామని అన్నారు. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే భర్తీ చేశామని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఎక్కడ ఎటువంటి ఆరోపణలు రాకుండా పారదర్శకంగా పూర్తి చేసామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నూతన సాంకేతికతను నేర్పించాలనే లక్ష్యంతో మంథని బాలికల పాఠశాలలో 58 లక్షలతో డిజిటల్ క్లాస్ రూమ్ లను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ మన విద్యార్థులకు అందుబాటులో ఉందని అన్నారు. భవిష్యత్తులో వచ్చే సాంకేతికతను అలవాటు చేసుకుంటూ పోటీ ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాలని అన్నారు.

మంథని పాఠశాలలో టీచర్లకు డిజిటల్ స్టాఫ్ రూమ్ ఏర్పాటు చేస్తామని అన్నారు. మంథని పట్టణంలో చిన్న సాఫ్ట్ వేర్ కంపెనీ ఏర్పాటు చేశామని, 30 మంది యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. స్థానిక యువతకు, విద్యార్థులకు నైపుణ్యాలు పెంచితే పరిశ్రమలు కూడా ఇక్కడ అధికంగా వస్తాయని అన్నారు. పాఠశాలలో ఉన్న మిగిలిన క్లాస్ రూమ్ లను కూడా డిజిటల్ చేయాలని, డిజిటల్ పాఠశాలగా మంథని జడ్పీహెచ్ఎస్ ను తీర్చిదిద్దాలని మంత్రి ఆదేశించారు. పిల్లలు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలని, పెరుగుతున్న సాంకేతికతను ఉపయోగించాలని, దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఆర్.డి.ఓ సురేష్, మున్సిపల్ కమిషనర్, మండల స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోడు పట్టాలిప్పించి రైతులను ఆదుకోండి

- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, కామారెడ్డి ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతి
- పలు సమస్యలపై కాంగ్రెస్ బాన్సువాడ మండల ప్రధాన కార్యదర్శి సంజీవులు విజ్ఞప్తి



**హైదరాబాద్, జూలై 05 (జనంసాక్షి) :** బాన్సువాడ మండలంలోని పలు గ్రామాల్లో పోడు రైతులు పట్టాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అటవీ అధికారుల చర్యలతో ఆర్థికంగా చితికిపోతున్నారని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ మండల ప్రధాన కార్యదర్శి ఆర్ సంజీవులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్కను సెక్రటేరియట్‌లోని చాంబర్‌లో కలిసిన కాంగ్రెస్ నాయకు లు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవులు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ హయాంలో పట్టాదార్ పాసుపుస్తకాలు ఇచ్చారనీ, కానీ బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో పోడు భూముల్లో సాగు చేసుకోనివ్వకుండా వేధించారని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో హన్మాజిపేట రైతులు జక్కబైలు ప్రాంతంలో పంటలు వేసుకోగా అటవీ అధికారులు పంటలను ధ్వంసం చేశారని వాపోయారు. దీంతో కొందరికి వేలల్లో, మరికొందరి లక్షల్లో పెట్టుబడి నష్టం జరిగింద న్నారు. ఈ నేపథ్యంలో మానవతా దృక్పథంతో స్పందించి పోడు పట్టాలిప్పించాలని, భూ భారతి చట్టం కింద న్యాయం చేయాలని, రైతు కుటుంబాలను ఆదుకోవాలని మంత్రిని కోరగా.. ఆమె పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా జీపీలకు నిధులు, పారిశుధ్య కార్మికులకు వేతనాలు విడుదల చేయాలని, జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కరించేలా చూడాలని కోరారు.స్పందించిన మంత్రి సీతక్క.. సంబంధిత అధికారులతో సంప్రదించి తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అంతకుముందు జూబ్లీహిల్స్‌లోని మంత్రి కొండ సురేఖ నివాసంలో పోడు భూముల సమస్య, అటవీ అధికారుల చర్యలపై మంత్రికి వినతి అందజేసినట్టు సంజీవులు తెలిపారు. అరవై ఎకరాల్లో పెట్టిన ప్లాంటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని, అక్కడ మొక్కల పెంపకానికి అనువైన స్థలం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 30 ఏండ్లుగా పంటలు పండిస్తున్న రైతుల సాగుకు అనుమతిచ్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ మేరకు మంత్రి సురేఖ స్పందిస్తూ.. పోడు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీనివ్వడంతో రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆదివారం
6 జూలై 2025
తెలంగాణ

జనంసాక్షి
www.janamsakshi.org

JANAMSAKSHI DAILY



# కెప్టెన్ డిక్లేర్

- గిల్ రికార్డు సెంచరీతో భారత్ ఆధిపత్యం
- ఇంగ్లండ్‌కు 608 పరుగుల లక్ష్యం
- డబ్ల్యూటీసీ రికార్డ్ బ్రేక్ చేసిన టీం ఇండియా
- బుమ్రా లేకపోతే వికెట్లు తీస్తా : మహమ్మద్ సిరాజ్



**ఎడ్జ్‌బాస్టన్, జూలై 5, (జనంసాక్షి) :** అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 427/6 వద్ద డిక్లేర్ చేసింది, ఇంగ్లండ్ ముందు 608 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (129 బంతుల్లో 161, 14 ఫోర్లు, 8 సిక్సర్లు) అద్భుత సెంచరీతో చెలరేగగా, రవీంద్ర జడేజా (69 నాటౌట్) మరియు రిషబ్ పంత్ (61) అర్ధసెంచరీలతో జట్టును ఆధిపత్య స్థానంలో నిలిపారు. మొదటి టెస్టులో లీడ్స్‌లో ఓటమి చవిచూసిన టీమిండియా, ఎడ్జ్‌బాస్టన్‌లో ఆకట్టుకునే పుంజుకోవడంతో డ్రైవర్ సీట్‌లో కొనసాగుతోంది. నాలుగో రోజు తొలి సెషన్‌లో కొత్త బంతితో ఇంగ్లండ్ బౌలర్లు కట్టడి చేసినప్పటికీ, కేఎల్ రాహుల్ (55) సంయమనంతో ఆడుతూ స్కోర్‌బోర్డును ముందుకు నడిపించాడు. బ్రైడన్ కార్సే కరుణ్ నాయర్ (26)ను ఔట్ చేసి బ్రేక్ ఇవ్వగా, జోష్ టంగ్ రాహుల్‌ను క్లీన్ బౌల్డ్ చేసి ఇంగ్లండ్ శిబిరంలో ఉత్సాహం నింపాడు. అయితే, రిషబ్ పంత్ (61) క్రీజులోకి వచ్చిన తర్వాత బజ్‌బాల్ తరహాలో విధ్వంసక బ్యాటింగ్‌తో ఇంగ్లండ్ బౌలర్లను హడలెత్తించాడు. గిల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి, భారత ఆధిక్యాన్ని 350 దాటించాడు. లంచ్ సమయానికి భారత్ 177/3తో ఉండగా, విరామం తర్వాత గిల్ టంగ్ ఓవర్‌లో సిక్స్, రెండు ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. పంత్ కూడా టంగ్ ఓవర్‌లో సిక్సర్‌తో ఫిఫ్టీ సాధించి, ఆధిక్యాన్ని 400 దాటించాడు. షోయబ్ బషీర్ పంత్‌ను ఔట్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు.

### ఆరు వికెట్లతో మహమ్మద్ సిరాజ్ అదరగొట్టాడు

ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ (6/70) అద్భుత ప్రదర్శనతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను 407 పరుగులకు కుప్పకూల్చాడు, భారత్‌కు 180 పరుగుల భారీ ఆధిక్యాన్ని అందించాడు. ఈ ప్రదర్శనపై సిరాజ్ సంతోషం వ్యక్తం చేస్తూ, ఇది తనకు చాలా ప్రత్యేకమైన ఘనత అని, ఇంగ్లండ్ గడ్డపై తొలిసారి ఐదు వికెట్లు సాధించడం సంతోషకరమని తెలిపాడు. సరైన లెంగ్త్‌లో క్రమశిక్షణతో బౌలింగ్ చేయడం వల్లే ఈ 6 వికెట్లు సాధ్యమయ్యాయని, బాధ్యత తీసుకోవడం మరియు ఛాలెంజ్‌లను స్వీకరించడం తనకు ఇష్టమని అన్నాడు.

### అంపైర్‌తో బెన్ స్టోక్స్ వాగ్వాదం!

మూడో రోజు టీమిండియాకు యశస్వి జైస్వాల్ రూపంలో ఒకే ఒక దెబ్బ తగిలింది. రెండో ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ 22 బంతుల్లో 28 పరుగులు చేసి ఔటయ్యాడు. అయితే యశస్వి జైస్వాల్ ఔటైన బంతికి ఆయన డీఆర్ఎస్ కూడా తీసుకున్నాడు. దీనిపై ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ సమయంలో బెన్ స్టోక్స్ అంపైర్లతో వాగ్వాదానికి కూడా దిగారు. అసలు విషయమేమిటంటే.. ఇంగ్లండ్ తరఫున జోష్ టంగ్ 8వ ఓవర్ వేస్తున్నాడు. నాలుగో బంతి యశస్వి జైస్వాల్ ప్యాడ్‌కు తగిలింది. దీంతో ఇంగ్లండ్ గట్టిగా అప్పీల్ చేసింది. అంపైర్ యశస్వి జైస్వాల్‌ను ఔట్‌గా ప్రకటించారు. అయితే యశస్వి నాన్-స్ట్రైక్‌లో ఉన్న కేఎల్ రాహుల్‌తో చర్చించి డీఆర్ఎస్ తీసుకున్నారు. నిజానికి ఏ జట్టుకైనా 15 సెకన్లలోపు డీఆర్ఎస్ తీసుకోవాలి, కానీ ఇక్కడ యశస్వి జైస్వాల్ డీఆర్ఎస్ తీసుకోవడంలో కాస్త ఆలస్యం చేశాడు. అయినప్పటికీ అంపైర్ సమయానికి గమనించలేకపోయారు, కాబట్టి జైస్వాల్ డీఆర్ఎస్ కాల్‌ను అంగీకరించారు. కానీ ఇదంతా చూసిన బెన్ స్టోక్స్ ఆగ్రహానికి గురయ్యారు. సమయం ముగిసిన తర్వాత కూడా అంపైర్ డీఆర్ఎస్ ఇచ్చినందున ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ నేరుగా అంపైర్‌ల వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. కానీ అంపైర్లు స్టోక్స్ మాట వినలేదు. డీఆర్ఎస్ తీసుకున్నప్పటికీ యశస్వి జైస్వాల్ తన వికెట్‌ను కాపాడుకోలేకపోయాడు. థర్డ్ అంపైర్ కూడా యశస్వి జైస్వాల్ ను ఎల్బీడబ్ల్యూగా ప్రకటించారు.

టీ సెషన్ తర్వాత రవీంద్ర జడేజా దూకుడు పెంచి, కెరీర్‌లో 33వ అర్ధసెంచరీ సాధించాడు. జో రూట్ ఓవర్‌లో సిక్సర్‌తో 150కి చేరువైన గిల్, బషీర్ ఓవర్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్‌కు చేరాడు. ఆ దశలో ఐదో వికెట్‌కు 175 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. నితీశ్ రెడ్డి (1) మరోసారి నిరాశపరిచగా, వాషింగ్టన్ సుందర్ (12 నాటౌట్) జడేజాతో కలిసి ధనాధన్ ఆటతో ఆధిక్యాన్ని 600 దాటించాడు. గిల్ ఇన్నింగ్స్‌ను 427/6 వద్ద డిక్లేర్ చేయడంతో, ఇంగ్లండ్‌పై 608 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు.గిల్ ఈ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 269 పరుగులతో రికార్డు సృష్టించగా, రెండో ఇన్నింగ్స్‌లో 161తో రాణించి, రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు సాధించిన మూడో భారత కెప్టెన్‌గా నిలిచాడు. ఈ ఆధిపత్య ప్రదర్శనతో భారత్ సిరీస్‌లో బలమైన స్థానంలో నిలిచింది.

### టీమిండియా డబ్ల్యూటీసీ రికార్డు బద్దలు

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమిండియా అద్భుత రికార్డులను నమోదు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 587 పరుగుల భారీ స్కోరు సాధించి, డబ్ల్యూటీసీ చరిత్రలో విదేశీ గడ్డపై తమ అత్యధిక స్కోరుగా నిలిపింది, ఇంగ్లండ్‌లోనూ భారత్ సాధించిన అత్యధిక టెస్ట్ స్కోరుగా రికార్డు సృష్టించింది. ఈ స్కోరుతో 2022 డిసెంబర్‌లో రావల్పిండిలో పాకిస్థాన్ (579 పరుగులు) సాధించిన డబ్ల్యూటీసీలో అత్యధిక విదేశీ స్కోరు రికార్డును భారత్ అధిగమించింది. అంతకుముందు, డబ్ల్యూటీసీలో భారత్ విదేశాల్లో సాధించిన అత్యధిక స్కోరు 2024లో పెర్త్‌లో ఆస్ట్రేలియాపై 487/6 (డిక్లేర్డ్) ఉండేది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 387 బంతుల్లో 269 పరుగులు (30 ఫోర్లు, 3 సిక్సర్లు) సాధించి, ఇంగ్లండ్‌లో భారత బ్యాటర్‌గా అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు నెలకొల్పాడు, విరాట్ కోహ్లీ (254* x దక్షిణాఫ్రికా, 2019) మరియు సచిన్ టెండూల్కర్ (241* x ఆస్ట్రేలియా, 2004) రికార్డులను అధిగమించాడు. గిల్ ఈ ఇన్నింగ్స్‌లో 93.28% కంట్రోల్ రేట్‌తో ఆడాడు, ఇది 2006 నుంచి ఇంగ్లండ్‌లో సెంచరీ సాధించిన బ్యాటర్లలో అత్యధిక కంట్రోల్ రేట్లలో ఒకటిగా నిలిచింది.

# సూర్యవంశీ వైభవం

## యూత్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ



**వోర్సెస్టర్, జులై 5, (జనంసాక్షి) :** ఇంగ్లాండ్ గడ్డపై భారత అండర్-19 జట్టు తరఫున ఆడుతున్న 14 ఏళ్ల టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ యూత్ వన్డే క్రికెట్ చరిత్రలో సరికొత్త రికార్డును నెలకొల్పాడు. ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్‌లో నాలుగో మ్యాచ్‌లో అతను 52 బంతుల్లో సెంచరీ సాధించి, యూత్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డును నమోదు చేశాడు. ఈ క్రమంలో 2013లో పాకిస్థాన్ బ్యాటర్ కమ్రాన్ గులామ్ (53 బంతుల్లో సెంచరీ) మరియు భారత్ తరఫున రాజ్ అంగద్ బవా (2022లో ఉగాండాపై 69 బంతుల్లో సెంచరీ) పేరిట ఉన్న రికార్డులను వైభవ్ అధిగమించాడు. శనివారం వోర్సెస్టర్‌లోని న్యూ రోడ్ గ్రౌండ్‌లో జరిగిన నాలుగో యూత్ వన్డేలో వైభవ్ సూర్యవంశీ 78 బంతుల్లో 13 ఫోర్లు, 10 సిక్సర్లతో 143 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు, వైభవ్ దూకుడైన బ్యాటింగ్‌తో 28 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. కెప్టెన్ ఆయుష్ మాత్రేతో (5 పరుగులు) కలిసి ఓపెనింగ్‌కు దిగిన వైభవ్, మొదటి నుంచి ఆక్రమణాత్మక ఆటతీరుతో ఇంగ్లాండ్ బౌలర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఆయుష్ విఫలమైనప్పటికీ, విహాన్ మల్హోత్రా తో కలిసి 219 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. కేవలం 24 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన వైభవ్, 52 బంతు ల్లో సెంచరీ సాధించాడు. అతని ధాటికి చెలరేగిన భారత జట్టు రన్‌రేట్ ఎనిమిది పరుగులకు పైగా నమో దైంది. అయితే, బెన్ మెయెస్ వేసిన బంతిని క్యాచ్ ఔట్‌గా వైభవ్ పెవిలియన్‌కు చేరాడు.

వైభవ్ ఔటైన తర్వాత రాహుల్ కుమార్ (0), హర్వన్ష్ పంగాలియా (0) డకౌట్‌లతో భారత ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. అయినప్ప టికీ, విహాన్ మల్హోత్రా మరియు అభిజ్ఞాన్ కుండు ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపిస్తున్నారు. ఈ సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నాడు. మొదటి మ్యాచ్‌లో 19 బంతుల్లో 48 (5 సిక్సర్లు), రెండో మ్యాచ్‌లో 34 బంతుల్లో 45, మూడో మ్యాచ్‌లో 31 బంతుల్లో 86 (9 సిక్సర్లు) పరుగులు చేసిన వైభవ్, మూడు ఇన్నింగ్స్‌లలో 179 పరుగులతో సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. అతని స్ట్రైక్ రేట్ 213.09గా ఉంది, ఇది అతని ఆక్రమణాత్మక బ్యాటింగ్ శైలిని సూచిస్తోంది.

ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో జరిగిన మూడో మ్యాచ్‌లో వైభవ్ 9 సిక్సర్లతో భారత అండర్-19 ఆటగాడిగా ఒకే మ్యాచ్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన రికార్డును సృష్టించాడు, మందీప్ సింగ్ రికార్డును అధిగమించాడు. 2025 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్, 35 బంతుల్లో సెంచరీతో పురుషుల టీ20 క్రికెట్‌లో అత్యంత చిన్న వయసులో సెంచరీ సాధించిన ఆటగాడిగా నిలిచాడు. వైభవ్ సూర్యవంశీ ఈ అద్భుత ప్రదర్శనలతో భారత క్రికెట్ భవిష్యత్తు నక్షత్రంగా గుర్తింపు పొందుతున్నాడు. ఈ సిరీస్‌లో భారత జట్టు 2-1 ఆధిక్యంలో ఉంది, మరియు వైభవ్ ప్రదర్శన సిరీస్ గెలుపులో కీలక పాత్ర పోషిస్తోంది.



# ఉత్కంఠ పోరులో భారత మహిళల జట్టు ఓటమి

## 5 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ విజయం

లండన్, జులై 6, (జనంసాక్షి) : లండన్‌లోని ది ఓవల్ వేదికగా ఇంగ్లాండ్ మహిళల జట్టుతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు 5 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు పైచేయి సాధించింది.

ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు సాధించింది. ఓపెనర్లు సోఫియా డంక్లీ (53 బంతుల్లో 75) మరియు డానీ వ్యాట్-హాడ్జ్ (42 బంతుల్లో 66) అద్భుతంగా రాణించి 15.2 ఓవర్లలో 137 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. భారత బౌలర్లలో అరుంధతీ రెడ్డి మరియు దీప్తి శర్మ తలో 3 వికెట్లు, శ్రీ చరణి 2 వికెట్లు, రాధా యాదవ్ 1 వికెట్ సాధించారు. 172 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు మాత్రమే చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (49 బంతుల్లో 56) అర్ధసెంచరీ, షఫాలీ వర్మ (27 బంతుల్లో 47) దూకుడుగా ఆడారు. జెమీమా రోడ్రిగ్స్ (20) మరియు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (17 బంతుల్లో 23) కొంత పోరాడినప్పటికీ విజయం సాధించలేకపోయారు. చివరి రెండు ఓవర్లలో 20 పరుగులు అవసరమైన సమయంలో 19వ ఓవర్‌లో 8 పరుగులు రాగా, చివరి ఓవర్‌లో 12 పరుగులు అవసరమయ్యాయి. ఇంగ్లాండ్ పేసర్ లారెన్ బెల్ అద్భుతంగా బౌలింగ్ చేసి, తొలి ఐదు బంతుల్లో 6 పరుగులు మాత్రమే ఇచ్చింది. చివరి బంతికి 6 పరుగులు అవసరమైన సమయంలో హర్మన్‌ప్రీత్ కౌర్ క్యాచ్ ఔట్ కావడంతో భారత్ ఓటమిని చవిచూసింది.

ఇంగ్లాండ్ బౌలర్లలో లారెన్ ఫైలర్ 2 వికెట్లు, సోఫీ ఎకిల్‌స్టోన్ మరియు ఇస్సీ వాంగ్ తలో వికెట్ సాధించారు. ఈ సిరీస్‌లో భారత్ ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లలో విజయం సాధించి 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచి ఉంటే సిరీస్‌ను కైవసం చేసుకుని ఉండేది. నాలుగో టీ20 మ్యాచ్ జులై 9, 2025న మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జరగనుంది.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో

# మౌలిక వసతులను పరిశీలించండి

### ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్ జులై 5 (జనం సాక్షి) :** డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాలలో మౌలిక వసతులను పరిశీలించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన డబుల్ బెడ్ రూమ్‌ల సముదాయాలు వద్ద మౌలిక వసతుల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం లోని అన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలను అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా మంజీరా నీటి సౌకర్యం, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు తదితర వసతులను కల్పించాలని అన్నారు. కరెంటు బిల్లులను జిహెచ్ఎంసి పేరుమీద ఇవ్వకుండా లబ్ధిదారుల పేరు మీద నేరుగా ఇవ్వడానికి మార్పులను చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణను చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అందరికీ ఉపయోగపడే విధంగా ఆరోగ్య కేంద్రంతో పాటు మహిళా, శిశు, గర్భిణీ స్త్రీలకు ఉపయోగపడే అంగన్వాడి సెంటర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు సాబేర్ అలీ, వెంకటేష్ నాయక్, హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ రవీందర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, బిఆర్ఎస్ నాయకులు బాలాజీ నాయక్, జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల శ్రీనివాస్, సునీల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాసర ఐఐఐటిలో సీటు సాధించిన

# బీసీ గురుకుల విద్యార్థులు

- అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంజేపి సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల పాఠశాలలో చదివి బాసర ఐఐఐటి లో సీటు సాధించిన విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సెక్రటరీ శ్రీధర్, ఎంజేపి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. చార్మినార్ బీసీ గురుకుల బాలికల పాఠశాలలో పదోతరగతి చదివిన దేవికా నందిని, రామగుండం నుంచి శ్రీతేజ, నిజామాబాద్ జిల్లా నుంచి జయశ్రీ, ప్రవీణ, ఎం. అరవింద్, నవాబ్ పేట నుంచి కె. జగదీష్, జె. రవి, ఖానాపూర్ నుంచి లిప్సా, సంగారెడ్డి జిల్లా నుంచి ఎం. అశ్విని, కె. ప్రసన్న, కరీంనగర్ జిల్లా ఆర్. సిరి, జె. రామేశ్వరి, మోక్షిత్, శీను నాయక్, శ్రీ చరణ్, సిహెచ్ విజయకుమార్, వంశీకృష్ణ, మెదక్ నుంచి నవ్యశ్రీ, జాగృతి మరికొందరు విద్యార్థులు ఐఐఐటీ బాసరకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు . ఈ ఏడాది పదోతరగతి, ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు అత్యుత్తమ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యలో సీట్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు. బీసీ గురుకుల విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ఉన్నత విద్యా సంస్థల లో ప్రవేశం కోసం అవసరమైన శిక్షణను అందిస్తున్నామని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

### కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన వ్యక్తి

**సకాలంలో హాస్పిటల్ తరలించి ప్రాణాలు కాపాడిన పోలీస్ కానిస్టేబుల్ బి.జాషువా**

**తలకొండపల్లి జూలై 05(జనంసాక్షి):** కుటుంబ కలహాలతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌పల్లి గ్రామా నికి చెందిన దర్వుల మచ్చేందర్ అనే వ్యక్తి ఇంట్లో గొడవపడి,ఇంటి నుంచి వెళ్లి పోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. దాంతో తలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఆశ్రయించగా ఎస్సై ఏ.శ్రీకాంత్ ఆదేశా ల మేరకు కానిస్టేబుల్ బి.జాషువా దర్వుల మచ్చేందర్ సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతని ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు.వెంటనే ప్రదేశానికి వెళ్లి చూడగా అంతకుముందే పురుగుల మందు సేవించడంతో నోటి నుంచి నురగలు రావటం గమనించిన కానిస్టేబుల్ జాషువా, కుటుంబ సభ్యులు సహాయంతో వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు చికిత్స అందించి మచ్చేందర్ ప్రాణాలను కాపాడారు.ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ జాషువా,ను ఆమనగల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ వి.జానకిరామ్ రెడ్డి,ఎస్సై ఏ.శ్రీకాంత్ మరియు గ్రామస్తులు అభినందించారు.

# లారీని 'ఢీ'కొన్న టూరిస్ట్ బస్సు.. నలుగురు మృతి

- బీజాపూర్ హైవే రంగాపూర్ వద్ద ఘటన
- 26 మందికి గాయాలు పదిమంది పరిస్థితి విషమం
- మెరుగైన వైద్యం కోసం వివిధ ఆసుపత్రిలకు తరలింపు
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన స్పీకర్, సీఎం, చేవెళ్ల పరిగి ఎమ్మెల్యేలు
- క్షేత్రగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం
- సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పరిగి పోలీసులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో మే 20 (జనం సాక్షి) :** పెండ్లి వారి ఇంట్లో సందడి సంతోషం ఎంతోసేపు నిలవలేదు. మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో వారిని కబళించి వేసింది. బంధువులంతా వివాహ విందు ముగించుకొని తిరుగు ప్రయాణంలో ఈ దుర్ఘటన జరిగింది. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం అర్ధరాత్రి రంగాపూర్ వద్ద ఆగిఉన్న లారీని పెండ్లి టూరిస్టు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు . వీరంతా రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన వెల్లి గ్రామానికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు. వీరంతా వివాహ విందు ముగించుకొని తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యంలో ఈ సంఘటన జరిగింది. ఈ దుర్ఘటనలో షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన మంగలి మల్లేష్(35) సోలిపేటకు చెందిన బాలమ్మ(60) చేవెళ్ల మండలం రావులపల్లి కి చెందిన హేమలత(32) ఫరూక్నగర్ మండలం రేగన్ నగర్ కు చెందిన సందీప్(28) ఈ దుర్ఘటనలో మృతి చెందారు. మరో 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో పది మంది పరిస్థితి విషమంగా ఉంది. పెండ్లి బంధువుల ద్వారా సమాచారం అందుకున్న పరిగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను పరిగి దవాఖానకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం వారికి మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ జిల్లా దవాఖానకు తరలించారు. పలువురిని హైదరాబాద్ ఉస్మానియా హాస్పిటల్‌కు రెఫర్ చేశారు.బాధితులంతా సోమ వారం రాత్రి పరిగిలో జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో రంగాపూర్ వద్ద ఆగిఉన్న లారీని బస్సు ఢీకొట్టింది. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారని పోలీసులు తెలిపా రు. ఈ సంఘటనలో పలువురికి కాళ్లు, చేతులు విరిగినట్లు పోయాయి. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను పరిగి ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం శవాలను బంధువులకు అప్పగించారు.

### స్పీకర్, సీఎం ఎమ్మెల్యేల దిగ్భ్రాంతి

కాగా ఈ సంఘటనపై తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెంది . తీవ్రంగా గాయపడిన పెండ్లి వారి బంధువులకు సానుభూతి తెలియజేశారు. జరిగిన సంఘటనపై విచారణకు ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన క్షేత్రగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అంత్యక్రియల కోసం మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శుభకార్యం జరిగిన ఇంట్లో అశుభకార్యం జరగడం తో చందనవెల్లిలో విషాద ఛాయలు అములుకున్నాయి.



# సర్పన్‌పల్లి ప్రాజెక్టులో పడవ బోల్తా

## ఇద్దరు మహిళల మృతి

- బీహార్ రాష్ట్రానికి చెందినవారుగా గుర్తింపు
- వెల్దర్ నెస్ రిసార్ట్స్ నిర్లక్ష్యం కారణంగా ఘటన మృతుల బంధువుల ఆరోపణ

**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై6 (జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా సర్పన్‌పల్లి ప్రాజెక్టులో శనివారం సాయంత్రం జరిగిన దుర్ఘటనలో విహార యాత్రకు వచ్చిన ఒక కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. బోటింగ్ సమయంలో పడవ బోల్తా పడటంతో ఇద్దరు మహిళలు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మృతులు బీహార్ రాష్ట్రం అనిషాబాద్‌కు చెందిన రీటా కుమారి (55) మరియు పూనమ్ సింగ్ (56)గా గుర్తించారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉంటున్న బంధువులను సందర్శించడానికి వచ్చిన ఈ కుటుంబం, విహార యాత్ర కోసం సర్పన్‌పల్లి ప్రాజెక్టుకు చేరుకుంది. బోటింగ్ చేస్తుండగా, భారీ వర్షం మరియు ఈదురుగాలుల కారణంగా పడవ ఒక్కసారిగా బోల్తా పడింది. పడవలో ఐదుగురు వ్యక్తులు ఉండగా, వీరిలో ఇద్దరు పిల్లలు, ముగ్గురు పెద్దవారు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఐదుగురూ నీటిలో మునిగారు, ఇందులో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు వెంటనే స్పందించి, ఇద్దరు పిల్లలతో పాటు మరొక వ్యక్తిని రక్షించారు. రక్షించిన వారు అధికంగా నీరు మింగడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు, అయితే స్థానికులు కడుపులోని నీటిని తొలగించి, వారిని వికారాబాద్ లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు కోలుకుంటున్నట్లు తెలుస్తోంది. వెల్దర్ నెస్ రిసార్ట్స్ యాజమా న్యం కనీస భద్రతా నిబంధనలు పాటించకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని మృతుల బంధువులు ఆరోపించారు. టూరిస్టులకు తగిన భద్రతా వసతులు లేకపోవడం, లైఫ్ జాకెట్లు, లైఫ్‌గార్డ్‌లు లేకపోవడం వంటి నిర్లక్ష్యాలను ఎత్తిచూ పారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి, రిసార్ట్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు.



# వేధింపులు తాళలేక భర్తను హత్య చేసిన భార్య

## సహజ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం

**కుత్బుల్లాపూర్ (జనంసాక్షి) :** వేధింపులు తాళలేక భర్తను హత్య చేసి సహజ మరణంగా చిత్రీకరి ంచేందుకు యత్నించి పోలీసులకు పట్టుబడిన సంఘటన బాచు పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలు గులోకి వచ్చి ంది. ఈ సంఘటనకు సంబంధి ంచిన వివరాలు బాచుపల్లి పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్ నగర్ జిల్లా రామ కృష్ణయ్యపల్లి గ్రామానికి చెందిన అంజిలప్ప, 2014 సంవత్సరంలో రాధ అనే మహిళని వివాహం చేసుకోగా వీరికిద్దరు పిల్లలు. భార్యాభర్తలు ఇరువు రు జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్, ముంబైలలో కూలి పని చేస్తూ ఉండేవారు. గత కొద్ది నెలల క్రితం దంపతులు బాచుపల్లి లోని ప్రతీక్ కన్స్ట్రక్షన్స్ వారు నిర్వహిస్తున్న నిర్మాణంలో కూలీలుగా చేరారు. కాగా అంజిలప్ప నిత్యం మద్యం సేవించి అనుమానంతో భార్యను వేధిస్తూ ఉండేవాడు. ఆ వేధింపులు భరించలేని రాధ, గత నెల 22వ తేదీన రాత్రి అంజిలప్ప మద్యం మత్తులో ఉండగా గొంతు నిలిమి హత్య చేసింది. 23వ తేదీ ఉదయం తన భర్త సహజంగానే మరణించాడని తాను పనిచేస్తున్న తోటి కార్మికులను నమ్మించి శవాన్ని అంత్యక్రియల నిమిత్తం అంజిలప్ప స్వగ్రామానికి తరలించింది. స్వగ్రామంలో అంజిలప్ప గొంతుపై చారలు ఉండటంతో అతని సోదరుడు అనుమానంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న పోలీసులు శవ పరీక్ష నిర్వహి ంచి అంజిలప్ప హత్యకు గురైనట్లుగా గుర్తించి ఎఫ్ఐఆర్ ను బాచుపల్లి పోలీసులకు బదిలీ చేయడం జరిగింది. బాచుపల్లి పోలీసులు అనుమానం తో రాధను అదుపులోకి తీసుకొని విచారించగా తానే ఈ నేరం చేసినట్లు అంగీకరించింది. నిందితురాలి వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్న బాచుపల్లి పోలీసులు నిందితురాలని కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించారు.

# మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం

**ఒకేవేదికను పంచుకున్న ఠాక్రే సోదరులు**

**దాదాపు 20 ఏళ్ల తరవాత ఒక్కటైన వేళ**

**ఇక కలిసే సాగుతామని ఇద్దరూ ప్రకటన**



**ముంబై, జూలై5 (జనంసాక్షి) :** మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. థాక్రే సోదరులు ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రే మళ్లీ కలిశారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదిక పంచుకున్నారు. ఇకపై ఇద్దరం కలిసే ఉంటామని ఈ సందర్భంగా సోదరులు స్పష్టం చేశారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత విడిపోయిన అన్నదమ్ములు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే శనివారంనాడు ఒకే వేదకను పంచుకోవడం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. కుటుంబ సమేతంగా ఈ ఇరువురు నేతలు పాల్గొన్నారు. తమను ఒకచోట చేర్చడం ఎవరికీ సాధ్యం కాలేదని, బాల్ ఠాక్రే సైతం చేయలేకపోయిన పనిని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ రాష్ట్రానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడం ద్వారా చేశారని రాజ్ ఠాక్రే ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం ఆసక్తిగా మారింది. త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఉపసంహరించు కున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇవాళ ముంబైలో 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే, మహారాష్ట్ర నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ థాక్రే ఇద్దరూ కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. 2005లో విడిపోయిన ఈ ఇద్దరు అన్నదమ్ములు 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ కలుసుకోవడం మహా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. అన్నదమ్ముల కలయికపై ఇరు పార్టీల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వల్లే తాము కలిశామని రాజ్ థాక్రే వ్యాఖ్యానించారు. సీఎం రాష్ట్రానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయమే తమని కలిపిందన్నారు. అనుకోకుండానే ఒకే వేదికపై చేర్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై థాక్రే సోదరులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇకపై తామిద్దరం ఒక్కటిగా ఉంటామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కాగా, అన్నదమ్ములిద్దరూ చివరి సారిగా 2005లో ఒకేవేదికపై కనిపించారు. ఆ తర్వాత శివసేనలో గొడవల కారణంగా రాజ్ థాక్రే పార్టీ వీడారు. 2006 మార్చి 9వ తేదీన సొంతంగా మహారాష్ట్ర నవ నిర్మాణ సేనను స్థాపించారు.కాగా, రాజ్ వ్యాఖ్యలపై దేవేంద్ర ఫడ్నవిస్ తొలిసారి స్పందించారు. ఠాక్రే కజిన్లను కలిపానంటూ తనకు క్రెడిట్ ఇవ్వడంపై ఫడ్నవిస్ థాంక్స్ చెప్పారు.

# ఎన్నికల హామీలను అమలు చేయండి

**ఆరు నెలలు దాటినా చిత్తశుద్ధి ఏదీ**

**సిఎం రేవంత్‌కు బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావు లేఖ**



**హైదరాబాద్, జూలై5 (జనంసాక్షి) :** ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం తక్షణమే వాటిని అమలు చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. 100 రోజుల్లో 6 గ్యారంటీ-లు అమలు చేసి తీరుతామని చెప్పి.. 600 రోజులైనా అమలు చేయలేదని విమర్శించారు. 6 గ్యారంటీ-ల్లో భాగంగా 63 అనుబంధ హామీలను ప్రకటిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో ఊరూరా కరపత్రాలు పంచారని ఎద్దేవా చేశారు. అన్ని వార్తా పత్రికల్లో మొదటి పేజీల్లో ప్రకటనలు సైతం ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ ఏ ఒక్క గ్యారంటీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. తమను మోసం చేశారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని రామచందర్‌రావు లేఖలో పేర్కొన్నారు.

# ప్రతి రెవెన్యూ గ్రామానికి గ్రామ పరిపాలనా అధికారి

**రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, జూలై5 (జనంసాక్షి) :** ప్రతి రెవెన్యూ గ్రామానికి గ్రామ పరిపాలనా అధికారి ఉంటారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమావేశమయ్యారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ పరిపాలనా అధికారుల నియామకాన్ని చేపట్టినట్లు- పేర్కొన్నారు. వీఆర్‌వో, వీఆర్‌ఏలుగా పని చేసినవారికి జీపీవోలుగా అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక పరీక్ష ద్వారా 3,454 మంది అర్హత సాధించారని వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు వీఆర్‌వో, వీఆర్‌ఏలకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

# వారసత్వ ఆస్తి కేసులో సైఫ్‌కు చుక్కెదురు

**ఎనిమీ ప్రాపర్టీపై వేసిన కేసు కొట్టివేత**



**భోపాల్, జూలై5 (జనంసాక్షి) :** దివంగత క్రికెటర్ పటౌడీ కుమారుడు బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. మధ్యప్రదేశ్‌లోని తన పూర్వీకుల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా పేర్కొనాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సైఫ్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఈ ఆస్తికి సంబంధించి ప్రభుత్వానికి హక్కులు సంక్రమిస్తాయి. ఎనిమీ ప్రాపర్టీ కింది ఇవి దఖలు పడ్డాయి. దీనిని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ తిరస్కరణకు గురయ్యింది. సైఫ్ కుటుంబానికి చెందిన రూ.15వేల కోట్ల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా నిర్ణయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఈ విషయంపై మరోసారి విచారణ జరపాలని, ఏడాదిలోగా తుది నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. తాజా పరిణామంతో ఆ ఆస్తుల యాజమాన్య హక్కులపై సందిగ్ధం నెలకొంది. భోపాల్‌లో సైఫ్ కుటు-ంబానికి అతడి నాన్నమ్మ సాజిదా సుల్తాన్ నుంచి పలు విలాసవంతమైన భవంతులు వారసత్వంగా వచ్చాయి. భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె సాజిదా. ఆయన పెద్ద కుమార్తె అబీదా సుల్తాన్ దేశ విభజన నేపథ్యంలో 1950లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. సాజిదా ఇక్కడే నివసిస్తూ పటౌడీ నవాబు అయిన ఇఫ్తిఖర్ అలీఖాన్(సైఫ్ తా)ను వివాహమాడారు. సాజిదాకు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాలక్రమంలో ఆమె వారసులైన సైఫ్ కుటుంబానికి దక్కాయి. అయితే హమీదుల్లాకు చట్టబద్ధ వారసురాలు అబీదా మాత్రమే అని, ఆమె పాక్‌కు వలస వెళ్లినందువల్ల ఎనిమీ యాక్ట్ ప్రకారం ఆ ఆస్తులను కాందిశీకుల ఆస్తులుగా గుర్తిస్తున్నట్లు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ కార్యాలయం 2015లో ప్రకటించింది. దీన్ని సవాలు చేస్తూ సైఫ్ కుటుంబసభ్యులు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా దీనిని కోర్టు తిరస్కరించడంతో ఇక ఆశలు వదులుకోవాల్సిందే.

# అతనిదంతా క్రిమినల్ మనస్తత్వం

**క్రికెటర్ షమీపై మాజీ భార్య హసీన్ జహాన్**

**కోల్‌కతా, జూలై5 (జనంసాక్షి) :** టీమ్‌ఇండియా సీనియర్ బౌలర్ మహ్మద్ షమీపై అతడి మాజీ భార్య హసీన్ జహాన్ సంచలన ఆరోపణలు చేశారు. అతడో కర్కశ వ్యక్తిత్తం కలిగిన వ్యక్తి అని దుయ్యబట్టారు. ఇటీవల విడాకుల సందర్భంగా తనకు ఇచ్చే భరణం సరిపోదని ఆమె తెలిపింది. తాజాగా అతడు వ్యక్తిత్వం లేని, క్రూరమైన మనస్తత్వం కలిగిన వాడని, అందుకే తనను ఎంతగానో వేధించాడని ఆమె ఆరోపించారు. వీరి విడాకుల కేసుకు సంబంధించి ఇటీవల కలకత్తా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. 2018లో హసీన్ అతడిపై గృహహింస కేసు పెట్టింది. దీనిపై కొన్నేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల హసీన్, ఆమె కుమార్తె సంరక్షణ కోసం రూ.4 లక్షలను భరణం కింద చెల్లించాలని షమీని కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో షమీని విమర్శిస్తూ హసీన్ జహాన్ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్ట్ చేశారు. గత ఏడేళ్లుగా మన మధ్య న్యాయపోరాటం జరుగుతోంది. నీ క్యారెక్టర్ లేనితనం, దురాశ, క్రూరమైన మనస్తత్వంతో సొంత కుటుంబాన్నే చేజేతులా నాశనం చేశావ్. మమ్మల్ని చంపడానికి, మా పరువు తీసి వేధించడానికి, నన్ను ఓడించడానికి నువ్వు ఎంతమంది క్రిమినల్స్‌కు డబ్బు ఇచ్చి ఉంటావ్. దానివల్ల నువ్వు ఏమైనా సాధించావా? పురుషాధిక్య సమాజంలో నాపై నిందలేసి నువ్వు మద్దతు కూడగట్టు-గలవేమో..! కానీ, ఏదో ఒకరోజు నీకు కూడా కష్టకాలం మొదలవుతుంది. అప్పుడు నీకు అండగా నిలిచినవాళ్లే నిన్ను తరిమేస్తారు. చట్టంపై నాకు నమ్మకం ఉందని షమీని ఆమె దుయ్యబట్టారు. క్రిమినల్స్, వేశ్యలకు నువ్వు ఇచ్చిన డబ్బును.. మన కుమార్తె చదువు కోసం వెచ్చించి ఉంటే, మన భవిష్యత్తు కోసం ఉపయోగించి ఉంటే ఇప్పుడు మన జీవితం ఎంతో బాగుండేది. మనమంతా ఎంతో మర్యాదగా జీవించేవాళ్లం అంటూ హసీన్ జహాన్ రాసుకొచ్చారు. నాకు ఆ భగవంతుడు ఎంత ధైర్యాన్ని, సహనాన్ని ఇచ్చాడో చూడు. నిజం కోసం నేను ఏళ్లతరబడి పోరాడుతూనే ఉన్నాను... ఉంటాను కూడా. అందుకే, నువ్వు ఎంతమంది క్రిమినల్స్‌తో చేతులు కలిపినా నన్ను ఏమీ చేయలేకపోతున్నావ్. ఈ 2014లో హసీన్‌తో షమీకి వివాహమైంది. వీరికి కుమార్తె జన్మించింది. అయితే, ఆ తర్వాత వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు.



# శ్రీకృష్ణనగర్ బస్తీలో మురుగునీరు

**మున్సిపల్ అధికారుల తీరుపై కేంద్రమంత్రి ఆగ్రహం**

**హైదరాబాద్, జూలై5 (జనంసాక్షి) :** కాలనీల్లో మురుగునీరు ప్రవహిస్తున్నా చర్యలు తీసుకోరా అంటూ.. మున్సిపల్ అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంటిముందు ఇలా ఉంటే ఎలా ఉంటుందో ఊహించారా అని అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని శ్రీకృష్ణనగర్ బస్తీలో శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ-హాల్ సీ బ్లాక్‌లో ఇళ్ల ముందు పెద్ద ఎత్తున మురుగునీరు పారుతుండటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు కిషన్‌రెడ్డి ఎదుట వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. 'మీ ఇంటి ముందు ఇలా మురుగు ఉంటే ఒక్క నిమిషమైనా ఉండగలరా?' అని తీవ్రంగా మందలించారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలన్నారు.

# అమర్‌నాథ్ మార్గంలో ప్రమాదం

**వరుసగా ఢీకొన్న బస్సులు**



**శ్రీనగర్, జూలై5 (జనంసాక్షి) :** అమర్‌నాథ్ యాత్రికులు వెళ్తోన్న బస్సులకు ప్రమాదం జరిగింది. వరుసగా ఒకదానినొకటి ఐదు బస్సులు ఢీకొనడంతో 36 మంది యాత్రికులు గాయపడ్డారు. జమ్మూకశ్మీర్లోని రాంబన్ జిల్లా చందర్‌కోట్ వద్ద పహల్గాం బేస్ క్యాంప్‌నకు వెళ్తుండగా ఈ ఘటన చోటు-చేసుకుంది. క్షతగాత్రులను రాంబన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యాత్రికులు అల్పాహారం చేయడం కోసం చందర్‌కోట్ వద్ద వాహనాలు నిలిపిఉంచారు. అప్పుడే ఒక బస్సు నియంత్రణ కోల్పోయి, ఆగిఉన్న వాటిని ఢీకొట్టింది. దాంతో వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో యాత్రికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగి నప్పటికీ బాధితుల్లో ఎక్కువమంది యాత్రను కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని రాంబన్ పోలీసు ఉన్నతాధికారి కుల్బీర్‌సింగ్ వెల్లడించారు. అయితే కొందరికి గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారు ఆగిపోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇక దెబ్బతిన్న బస్సులను మార్చడంతో యాత్ర ప్రారంభమైనట్లు- చెప్పారు. జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. కట్టుదిట్టమైన భద్రత మధ్య 5,880 మందికి పైగా భక్తుల తొలి బ్యాచ్ బుధవారం జమ్ము నుంచి బయల్దేరింది. సాధారణంగా యాత్రికులు పహల్గాం మార్గంతో పాటు-బాల్తాల్ మీదుగా ప్రయాణిస్తుంటారు. ఈ రెండు మార్గాలను ఇప్పటికే 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈసారి భద్రతను మరింత పటిష్ఠం చేసినట్లు- జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వెల్లడించారు.

# ఏపీలో నరకాసుర పాలన

**రోజూ ఎక్కడో ఓ చోట వైసిపి నేతల హత్యలు**

**వల్లభనేని వంశీని పరామర్శించిన పేర్నినాని, కొడాలి నాని**



**విజయవాడ, జూలై5 (జనంసాక్షి) :** టిడిపి నేతలు ప్రతి రోజూ వైఎస్ఆర్ సిపి నేతలపై హత్యలు, హత్యా యత్నాలు చేస్తున్నారని మాజీ మంత్రి పేర్నినానిఆరోపించారు. ప్రతిరోజూ ఆడపిల్లలు బలవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎపిలో నరకాసుర పాలన జరుగుతోందని, మనుషుల రూపంలో ఉన్న సైకోల పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. రాజకీయ ముసుగులో హత్యలు చేస్తున్నారని విమర్శించారు. సిఎం చంద్రబాబు నాయుడు పాలనపై ప్రజల్లో ఏహ్యాభావం ఏర్పడిందని చెప్పారు. వైయస్ఆర్ సిపి వాళ్లకు పనులు చేయొద్దని చెబుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయని విమర్శించారు. పోలీస్ వ్యవస్థ ఎక్కడుంది అని ప్రశ్నించారు. చంద్రబాబుతో సహా టిడిపి నేతలు కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని దాడులు చేయమని, భయపెట్టమని, ఊళ్లోంచి తరిమేయమని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి మాజీ సర్పంచ్ నాగమల్లేశ్వరరావు కుటుంబానికి మంచి పేరుందని, నాగమల్లేశ్వరరావు కుటుంబానికి నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉందని తెలియజేశారు. టిడిపి నేతల దోపిడిని అడ్డుకోవడమే నాగమల్లేశ్వరరావు చేసిన నేరమా? అని వైసిపి మాజీ ఎమ్మెల్యే బాబురావు మీద దాడి చేసి కొడుతుంటే అడ్డుపడింది నాగమల్లేశ్వరరావు కాదా? అని పేర్ని నాని నిలదీశారు. కృష్ణా జిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీ ఇటీవల జైలు నుంచి బెయిల్ పై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో, ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో ఉన్న ఓ వైసీపీ నేత ఇంట్లో వంశీని మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్నినాని ఆత్మీయంగా కలిసి పరామర్శించారు. అలాగే, వంశీ ఆరోగ్యంపై ఇరువురు నేతలు అడిగి తెలుసుకున్నారు. అయితే, వల్లభనేని వంశీ, కొడాలి నాని, పేర్నినాని మధ్య కొంతసేపు పలు అంశాలపై చర్చలు జరిగాయి. వంశీతో పాటు-, అన్ని కేసుల్లో అరెస్టయిన ఆయన అనుచరులను కూడా కొడాలి నాని పరామర్శించారు. ఈ ఉదయం కోర్టు విధించిన షరతుల మేరకు గుడివాడ, గన్నవరం పోలీస్ స్టేషన్లలో కొడాలి నాని, వల్లభనేని వంశీ సంతకాలు చేశారు.

# భూసమీకరణ ద్వారా మరో 20వేల ఎకరాలు

**స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం**

**ఇందుకోసం 10వేల ఎకరాలు కేటాయింపు**

**నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్**

**పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ**

**ఎంఎస్కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ**

**కిమ్స్ మెడకల్ కాలేజీ సహా 16 సంస్థలకు 65 ఎకరాలు**

**చంద్రబాబు అధ్యక్షతన సిఆర్డిఎ సమావేశంలో ఆమోదం**



**అమరావతి, జూలై5 (జనంసాక్షి) :** రాజధాని నిర్మాణానికి అవసరమైన ఇసుకను కృష్ణా నదిలో తవ్వుకునేలా సీఆర్‌డీఏకు అనుమతులు మంజూరు చేశారు. ప్రణాళిక ప్రకారం వచ్చే మూడేళ్లలో రాజధాని అమరావతి తొలి దశ నిర్మాణం పూర్తవుతుందని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. రాజధానిలో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్ సహా మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్‌ఎఫ్‌పీగా పిలిచేందుకు ఆమోదం ఇచ్చారు. రాజధాని అమరావతిలో స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం కోసమే 10వేల ఎకరాలు అవసరమవుతుందని మంత్రి నారాయణ అన్నారు. భూ సేకరణ వల్ల రైతులు నష్టపోతారనే ఉద్దేశంతోనే భూ సమీకరణకు వెళ్తున్నట్లు- తెలిపారు. అమరావతి రెండో దశ భూ సమీకరణకు ఇప్పటికే 7 గ్రామాల పరిధిలో 20 వేల ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సమ్మతించినట్లు తెలిపారు. ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన సీఆర్‌డీఏ 50వ అథారిటీ- సమావేశంలో 7 అంశాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వెల్లడించారు. ఈ భేటీకి పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్ సహా ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో మొత్తం ఏడు అంశాలకు సీఆర్డీఏ అథారిటీ- గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ- ఏర్పాటుకు మరో 2,500 ఎకరాల చొప్పున కేటాయించేందుకు సీఎం అంగీకరించారని వివరించారు. అమరావతిలో 5 స్టార్ హోటళ్లకు అనుబంధంగా 10వేల మంది సామర్థంతో కన్వెన్షన్ సెంటర్ కట్టే సంస్థలకు అదనంగా 2.5 ఎకరాలు, 7,500 మంది సామర్థంలో కన్వెన్షన్ సెంటర్ కట్టే సంస్థలకు మరో 2 ఎకరాలు ఇవ్వాలని నిర్ణయించారు. రాజధాని పరిధిలోని అమరావతి మండలంలో 4, తుళ్లూరు మండలంలో 3 గ్రామాల్లో అదనంగా 20, 494 ఎకరాల మేర భూ సమీకరణకు సీఆరీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. రాజధానిలో హైడెన్సిటీ-రెసిడెన్షియల్ జోన్ సహా మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలపగా.. మందడం, రాయపూడి, పిచుకలపాలెంలోని ఫైనాన్స్, స్పోర్ట్ సిటీల్లో దాదాపు 58 ఎకరాల్లో హైడెన్సిటీ-రెసిడెన్షియల్ జోన్, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్ ఎఫ్ పీ పిలిచేందుకు ఆమోదం తెలిపింది. ఇక, అమరావతిలో నిర్మించే ఫైవ్ స్టార్ హోటళ్ల సమీపంలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం సీఆర్డీఏ ప్రతిపాదనకు అథారిటీ- ఆమోదం తెలిపింది. మందడం, తూళ్లురు, లింగాయపాలెంలో 2.5 ఎకరాల చొప్పున నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి క్యూబీఎస్ ప్రాతిపదికనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులకు ఇసుక డ్రెడ్జింగ్ కోసం సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది. ప్రకాశం బ్యారేజి ఎగువన డీసిల్టేషన్ పక్రియ ద్వారా ఇసుక తవ్వుకునేందుకు సీఆర్డీఏ అథారిటీ- పర్మిషన్ ఇచ్చింది. వచ్చే రెండేళ్లలో రాజధాని నిర్మాణానికి 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని అంచనా వేసింది. భూముల కేటాయింపులపై కేబినెట్ సబ్ కమిటీ- తీసుకున్న నిర్ణయాలకు సీఆర్డీఏ అథారిటీ- ఆమోదం తెలిపింది. అయితే, సీబీఐ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఎంఎస్కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ, కిమ్స్ సహా 16 సంస్థలకు 65 ఎకరాల మేర భూ కేటాయింపులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. రాజధానిలోని ఈ-15 రహదారిపై 6 లేన్ల ఆర్వోబీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజుల స్మారక చిహ్నాల ఏర్పాటుకు స్థలం కేటాయించడానికి ఆమోదం లభించింది. మందడం, తుళ్లూరు, లింగాయపాలెంలో 2.5 ఎకరాల చొప్పున నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి క్యూబీఎస్ ప్రాతిపదికన అమోదం అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల కోసం ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టేషన్ పక్రియ ద్వారా ఇసుక తవ్వుకునేందుకు అనుమతి ఇచ్చారు. వచ్చే రెండేళ్లలో రాజధాని నిర్మాణానికి 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని అంచనా వేశారు. భూముల కేటాయింపులపై కేబినెట్ సబ్ కమిటీ- తీసుకున్న నిర్ణయాలకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం ఇచ్చింది. రాజధానిలోని ఈ-15 రహదారిపై 6 లైన్ల ఆర్వోబీ నిర్మాణానికి ఆమోదం లభించింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370